# నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
గురువారం
6 ఆగస్టు 2026


# భూ రికార్డుల్లో పారదర్శకతే ప్రభుత్వ లక్ష్యం

**భూ భారతి పోర్టల్‌పై పూర్తి స్థాయి అవగాహనతో ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించాలి**

**రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్లకు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సూచన**

**నాగర్ కర్నూల్ ఆగస్టు 5 (నినాదం)**
రాష్ట్ర ప్రభుత్వం భూ పరిపాలనలో సంస్కరణలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అమలు చేస్తున్న భూ భారతి పోర్టల్ ద్వారా ప్రజలకు భూ సంబంధిత సేవలను వేగవంతంగా, పారదర్శకంగా, జవాబు దారీతనంతో అందించేందుకు రెవెన్యూ శాఖ సిబ్బంది సమర్థవంతంగా పనిచేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సూచించారు. నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధ్యక్షతన జిల్లాలోని అన్ని తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్లకు భూ భారతి పోర్టల్ నిర్వహణ, భూ భారతి చట్టం, ఆన్‌లైన్ దరఖాస్తుల పరిశీలన, పరిష్కార విధానంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ,...... భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకతను పెంపొందించడం, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా సకాలంలో సేవలు అందించడం, భూ వివాదాలను తగ్గించడం వంటి లక్ష్యాలతో ప్రభుత్వం భూ భారతి పోర్టల్‌ను రూపొందించిందన్నారు. ఈ లక్ష్యాల సాధనలో రెవెన్యూ శాఖ సిబ్బంది కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని తెలిపారు. భూ భారతి పోర్టల్‌కు సంబంధించిన ఎలాంటి సందేహాలు వచ్చినా సంబంధిత అధికారులను నిస్సందేహంగా సంప్రదించి నివృత్తి చేసుకోవాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా పూర్తి జవాబుదారీతనంతో పనిచేయాలని శిక్షణలో పాల్గొన్న జూనియర్ అసిస్టెంట్లకు సూచించారు. కొన్నిసార్లు తెలియకుండానే తప్పులు జరిగే అవకాశం ఉంటుందని, అలాంటి సందర్భాల్లో తహసీల్దార్లు వంటి అధికారులు బాధ్యత వహించాల్సి వస్తుందని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి ఉద్యోగి తన పనిని అత్యంత నిబద్ధత, ఏకాగ్రతతో నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. దరఖాస్తుదారులకు స్లాట్ బుకింగ్, విచారణ తదితర తేదీల వివరాలను ముందుగానే తెలియజేస్తే వారు సమయపాలన పాటించేందుకు అవకాశం ఉంటుందని, ఈ విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. భూ భారతి పోర్టల్ లాగిన్ వివరాలను అత్యంత గోప్యంగా ఉంచాలని, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. ప్రతి రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ పోర్టల్‌లోని అన్ని మాడ్యూళ్లపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.



భూ సంబంధిత దరఖాస్తులను నమోదు చేసే దశ నుంచి పరిష్కరించే వరకు ప్రతి చర్యను ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని, ప్రజల నుంచి వచ్చే ప్రతి దరఖాస్తును నిర్దేశిత గడువులో పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, సేవలందింపులో ఎలాంటి నిర్లక్ష్యం, జాప్యం చోటుచేసుకోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.
శిక్షణలో భాగంగా భూ భారతి చట్టంలోని వివిధ అధికరణలు, వాటి అమలు విధానం, రెవెన్యూ అధికారుల బాధ్యతలు, చట్టపరమైన అంశాలను సవివరంగా వివరించారు. ప్రస్తుతం భూ భారతి పోర్టల్‌లో భూ సంబంధిత దరఖాస్తుల పరిష్కారానికి 13 రకాల మాడ్యూళ్లు అందుబాటులో ఉన్నాయని, గతంలో ఇదే ప్రక్రియ 33 రకాల మాడ్యూళ్ల ద్వారా నిర్వహించబడేదని, ప్రజలకు మరింత సులభమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం విధానాలను సరళీకృతం చేసి, మాడ్యూళ్ల సంఖ్యను తగ్గిస్తూ సేవల సామర్థ్యాన్ని పెంచిందని వివరించారు. ప్రతి మాడ్యూల్ పరిధి, దరఖాస్తుల నమోదు విధానం, పరిశీలన, ధ్రువీకరణ, అనుమతులు, తిరస్కరణకు గల కారణాలు, ఆన్‌లైన్ ప్రక్రియలో పాటించాల్సిన జాగ్రత్తలను ఉదాహరణలతో వివరించారు. శిక్షణలో పాల్గొన్న జూనియర్ అసిస్టెంట్లు అడిగిన సందేహాలను నివృత్తి చేస్తూ, భవిష్యత్తులో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలందించే విధంగా సూచనలు చేశారు. జిల్లాలో భూ పరిపాలనను మరింత సమర్థవంతంగా మార్చేందుకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు కీలకమని, భూ భారతి పోర్టల్‌పై పూర్తి స్థాయి అవగాహనతో పనిచేయడం ద్వారా భూ సంబంధిత దరఖాస్తుల పరిష్కారం వేగవంతమై, ప్రజల్లో ప్రభుత్వంపై మరింత విశ్వాసం పెరుగుతుందని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తెలిపారు. ఆర్డీవో బన్సీలాల్, శిక్షణ తరగతుల్లో రెవెన్యూ అంశాలు, భూ భారతి దరఖాస్తుల పరిష్కార విధానం, భూ రికార్డుల నిర్వహణ చరిత్ర తదితర అంశాలపై జూనియర్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చెన్నయ్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు అశోక్, హర్షవర్ధన్, ఆర్డీవో బన్సీలాల్, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, రెవెన్యూ శాఖ అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



## తల్లిపాలు అమృతం లాంటివి

**ఆర్మూర్, ఆగస్టు 5 (నినాదం)**
నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజక వర్గం ఎర్గట్ల మండల కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. స్థానిక సర్పంచ్ కోల్పాక ఉపేంద్ర ముఖ్య అతిథిగా విచ్చేసి తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల సూపర్ వైజర్ గంగహంస మాట్లాడుతూ,తల్లిపాలు అమృతంతో సమానమని, గర్భిణీ,డెలివరీ అయిన ఒక గంట లోపు వచ్చే పాలను ముర్రుపాలు అంటారని, అవి పిల్లలకు తప్పకుండా అందించాలని తల్లులకు సూచించారు. 6 నెలల వరకు కేవలం బిడ్డకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని వివరించారు. 7వ,నెల బిడ్డలకు అన్నప్రాశన కార్యక్రమాలు నిర్వహించి, 7వ నెల నుంచి అనుబంధ ఆహారం ఇస్తూ, 2 సంవత్సరాల వరకు తల్లిపాలు కొనసాగించాలని తెలిపారు. బిడ్డకు 2 సంవత్సరాల లోపు మెదడు అభివృద్ధి చాలా వేగంగా జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎర్గట్ల సర్పంచ్ తోటకూర ఉపేందర్ సమక్షంలో గర్భిణులకు సీమంతాలు, చిన్న పిల్లలకు అన్నప్రాశన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ సూపర్ వైజర్, హెచ్. ఈ.ఓ. అంగన్‌వాడీ టీచర్లు – చంద్రకళ, శోభన, సులోచన, భవిత, ఆశ వర్కర్లు, తదితరులు, పాల్గొన్నారు.



## సైనిక సంక్షేమాధికారి బాదం మోహన్‌కు ఆత్మీయ వీడ్కోలు

**నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 5 (నినాదం) :**
నిజామాబాద్ జిల్లా ప్రాంతీయ సైనిక సంక్షేమ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న బదాం గంగా మోహన్ పదోన్నతితో మహబూబ్‌నగర్ జిల్లా ప్రాంతీయ సైనిక సంక్షేమ కార్యాలయానికి బదిలీ కావడంతో బుధవారం ఆయనకు ఘనంగా ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి బి. పవన్ కుమార్ అధ్యక్షత వహించగా, కార్యాలయ సిబ్బంది, నిజామాబాద్ జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు, కామారెడ్డి జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు, అలాగే నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన మాజీ సైనికులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రీ బదాం గంగా మోహన్‌ను శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పదోన్నతి పొంది మహబూబ్‌నగర్ జిల్లాలో కూడా అదే అంకితభావంతో సేవలందించాలని ఆకాంక్షిస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి. పవన్ కుమార్, సులేమాన్, ఉమర్, సుర హరప్రసాద్, సాయిరెడ్డి, గుజరాతీ మోహన్, థామస్, తుల రాములు, రాజేశం తదితరులతో పాటు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన మాజీ సైనికులు, మాజీ సైనిక వితంతువులు పాల్గొన్నారు.

## సింగరేణిలో మళ్లీ రాజుకున్న ప్రమోషన్ల మంట

**3 రోజుల నిరాహార దీక్షలో ఓవర్ మ్యాన్ లు**

**సింగరేణి హెడ్ ఆఫీస్ ఎదుట బాధితుల పోరాటం..**

**మద్దతుగా నిలిచిన టిబిజికెఎస్**

**కొత్తగూడెం, ఆగస్టు05(నినాదం)**
సింగరేణి బొగ్గు గని సంస్థలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న 'బ్యాక్‌డేటెడ్ ఓవర్‌మ్యాన్' ప్రమోషన్లను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బాధిత ఉద్యోగులు ఆందోళన బాటపట్టారు. ఆగస్టు 5, 6, 7 తేదీలలో కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం (హెడ్ ఆఫీస్) ఎదుట మూడు రోజుల పాటు ఈ నిరాహార దీక్షలను నిర్వహించనున్నారు.

**యాజమాన్యం నిర్లక్ష్యంపై నిరసన జ్వాల**
ఓవర్‌మ్యాన్ ప్రమోషన్ల సమస్యపై ఇప్పటికే యాజమాన్యానికి పలుమార్లు వినతిపత్రాలు అందజేశామని, గుర్తింపు పొందిన యూనియన్ ద్వారా ప్రతిపాదనలు పంపినా, హెడ్ ఆఫీస్ వద్ద ధర్నాలు చేసినా అధికారుల్లో చలనం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం చూపుతున్న తీవ్ర అలసత్వం, నిర్లక్ష్యం కారణంగానే చివరకు నిరాహార దీక్షకు దిగాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. బ్యాక్‌డేటెడ్ ప్రమోషన్ల ఉత్తర్వులు ఇచ్చే వరకు తమ పోరాటం ఆగేది లేదని హెచ్చరించారు.

**అండగా నిలిచిన టిబిజికేస్ నాయకత్వం**
బాధిత ఉద్యోగులు చేపడుతున్న ఈ పోరాటానికి తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టిబిజికెఎస్) పూర్తి మద్దతు ప్రకటించింది. టిబిజికెఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి



కాపు కృష్ణ ఆందోళన బాటలో ఉన్న సిబ్బందికి తమ సంఘం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు గడప రాజయ్య, కార్పొరేట్ ఉపాధ్యక్షుడు తుమ్మ శ్రీనివాస్ రావు, ఇల్లందు ఉపాధ్యక్షుడు జాఫర్, కేంద్ర ఆర్గనైజింగ్ సెక్రటరీలు అన్వేష్ రెడ్డి, మహేందర్ పాల్గొని కార్మికులకు దిశా నిర్దేశం చేశారు. ఈ నిరాహార దీక్షకు సెంట్రల్ కమిటీ సభ్యులు కె. విజయ్ కుమార్, బోరింగ్ శంకర్, గిన్నారపు మహిదర్ తో పాటు పివికె పిట్ కమిటీ ప్రతినిధులు నేమిల వెంకటేశ్వర్లు, గౌకాడ నవీన్, రాజేష్ వినీత్, సీనియర్ నాయకులు ఎన్. శంకర్, తిరుపతి, దేవ్ సింగ్ నాయక్, అమరేందర్, గనిపాక రమేష్ తదితరులు మద్దతుగా నిలిచారు. సింగరేణిలోని అన్ని ఏరియాల మైనింగ్ స్టాఫ్, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున హెడ్ ఆఫీస్ వద్దకు తరలివచ్చి ఈ దీక్షను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## నగర సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ముందుకు..

**జీజీహెచ్ లో మౌలిక వసతులపై మంత్రికి వినతి**

**ఆర్ వోబీ..ఆర్ యూబీ..నిర్మాణం, బస్ స్టాండ్ ఆధునికీకరణ కోసం మంత్రులను కలిశా**

**అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ**



**నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 5 (నినాదం):**
నగర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా తన ప్రతి అడుగు ఉంటుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రభుత్వం ఏర్పడి రెండున్నర ఏళ్ళు గడిచినా..నియోజకవర్గ అభివృద్ధి కోసం నయాపైసా ఇవ్వడం లేదన్నారు. నగర మేయర్, కార్పొరేషన్ కమిషనర్ ర్ నగరంపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఓటమి చెందిన వారికి నిధులు ఇస్తున్నారు తప్ప, ప్రస్తుత ప్రజా ప్రతినిధులకు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. గతంలో అనేక సార్లు ఆయా శాఖల మంత్రులను కలవడం జరిగిందని గుర్తు చేశారు. నగర అభివృద్ధి కోసం మళ్లీ నలుగురు మంత్రాన్ని కలవడం జరిగిందన్నారు. ప్రధానంగా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ను కలిసి పలు అంశాలపై వినతి అందజేశానన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరుగుతోందని, దీనికి శాశ్వత పరిష్కారం చూపే దిశగా రూ.100 కోట్లతో నాందేవాడ, దేవి రోడ్డు, రైల్వే స్టేషన్ అదనపు వంతెన నిర్మించాలని ప్రతిపాదించినట్లు చెప్పారు. అలాగే రూ.70 కోట్లతో ఎల్లమ్మ గుట్ట రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరానన్నారు. అలాగే వర్ని, నిజామాబాద్, డిచ్పల్లి, ఇందల్వాయి, భీమ్గల్ కమ్మర్పల్లి వరకు నగరం మీదుగా 107 కిలోమీటర్ల కొత్త జాతీయ రహదారి ప్రతిపాదనలు కూడా అందించినట్లు పేర్కొన్నారు. నగరంలోని రేడియో స్టేషన్ నుంచి ముదక్పల్లి వరకు రోడ్లు భవనాల రహదారి అభివృద్ధి కూడా అవసరమని వివరించినట్లు పేర్కొన్నారు. ఇందూరులోని టీ హబ్ ద్వారా యువతకు ప్రముఖ ఎంఎన్ సీ కంపెనీలు తీసుకు రావాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు కలిసినట్లు చెప్పారు. ఇందూరు యువతలో ప్రతిభకు కొదవలేదని, ఉద్యోగ అవకాశాల కోసం హైదరాబాద్, బెంగళూరు, పూణే వంటి నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. యువతను నగరాలకు పంపడం కాదని, ఉద్యోగాలను నిజామాబాద్ కే తీసుకురావాలని అన్నారు. జిల్లా జనరల్ ఆస్పత్రి సమస్యలను సమగ్రంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గారిని కలిసి వివరించినట్లు తెలిపారు. ఎమ్మారై యంత్రం ఇప్పటికీ లేకపోవడం, మార్చురీ ఫ్రీజర్ల కొరత, లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్ లేకపోవడం ప్రధాన సమస్యలన్నారు. అలాగే సివిల్ సర్జన్, ఆర్ ఎంఓ లు, క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ల ఖాళీలు భర్తీ చేయాలని కోరారు. పేదల ప్రాణాలను కాపాడే ఆసుపత్రిలో సౌకర్యాల కొరత ఉండకూడదని, ప్రజల ఆరోగ్యం పై రాజీపడే పరిస్థితి ఎప్పుడు ఉండకూడదు అన్నారు. తెలంగాణలోని ప్రధాన నగరాల్లో ఒకటైన నిజామాబాదు బస్టాండులో పెరిగిన రద్దీకి తగిన సౌకర్యాలు లేకపోవడం శోషనీయమని అన్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కి అందజేసినట్లు చెప్పారు. గతంలో స్థలానికి సంబంధించి వినతి పత్రం కూడా అందజేసినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం ఉన్న బస్టాండ్కు విశాలమైన వేచి ఉండే హాలు, సిట్టింగ్ కెపాసిటీ పెంపు, డిజిటల్ బస్సు ఇన్ఫర్మేషన్ బోర్డులు, ఎల్ఈడి స్క్రీన్లు, సీసీ కెమెరాలు, పార్కింగ్ సదుపాయం పరిశుభ్రత వంటి అంశాలపై వినతి పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయంతో నిజామాబాద్ అభివృద్ధిని వేగవంతం చేయాలన్నదే తన ప్రయత్నమని అర్బన్ ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇందుకోసం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ గారితో కలిసి రైల్వే శాఖకు సంబంధించిన అనేక ప్రతిపాదనలు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కు అందజేసినట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ, పోతన్కర్ లక్ష్మీ నారాయణ, ఫ్లోర్ లీడర్ ప్రమోద్, కార్పొరేటర్లు బెల్లాల్ శశాంక్, జ్యోతి మురళి, శ్యామల సత్యపాల్, బొబ్బిలి సువర్ణ వేణు గోపాల్, బంటు ప్రీతి ప్రవీణ్, ప్రసూన శ్రీనివాస్, ఇప్పకాయల సుమిత్ర కిషోర్, పసునూరి రాము, బట్టు రాఘవేందర్, ఎస్సీ మోర్చ నాయకులు జస్పాల్ సింగ్, బాబీ సింగ్ పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్ల ఎత్తుగడలపై అప్రమత్తంగా ఉండాలి: సీపీ సునీల్ దత్

**'ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్'తో విద్యార్థులకు సైబర్ భద్రతపై అవగాహన.. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సూచన**





**ఖమ్మం ప్రతినిధి , ఆగస్టు 5 (నినాదం)**
సైబర్ నేరాల కట్టడికి అప్రమత్తత, అవగాహనే అత్యంత ప్రభావవంతమైన ఆయుధాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. సైబర్ నేరాలపై ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు సైబర్ జాగృక్త దివస్ కార్యక్రమంలో భాగంగా ఖమ్మం నగరంలోని ఎస్ఆర్ జూనియర్ కాలేజీలో సైబర్ క్రైమ్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన 'సురక్ష కా తిరంగా – సైబర్ స్వతంత్ర తెలంగాణ''ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్' ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. డిజిటల్ యుగంలో సాంకేతిక పరిజ్ఞానం మానవ జీవితాన్ని మరింత సులభతరం చేసినప్పటికీ, అదే సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ సైబర్ నేరగాళ్లు ప్రజల సొమ్ము, వ్యక్తిగత సమాచారం, గోప్యతను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారని అన్నారు. నగదు లావాదేవీల స్థానంలో యూపీఐ, నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, డిజిటల్ వాలెట్లు, ఆన్‌లైన్ కొనుగోళ్లు, సామాజిక మాధ్యమాల వినియోగం పెరగడంతో సైబర్ నేరాలకు అవకాశాలు కూడా అధికమయ్యాయని పేర్కొన్నారు. సైబర్ నేరాల నివారణలో ప్రతి పౌరుడు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించిన ఆయన.. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, యూపీఐ పిన్, సీవీవీ వంటి రహస్య సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దన్నారు. తెలియని లింకులను క్లిక్ చేయడం, అపరిచిత మొబైల్ యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం, అనుమానాస్పద క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయడం వల్ల భారీ ఆర్థిక నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రతి ఖాతాకు వేర్వేరు బలమైన పాస్‌వర్డ్‌లు ఉపయోగించడంతో పాటు రెండు దశల భద్రత (టూ–ఫ్యాక్టర్ ఆథెంటికేషన్)ను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు.ప్రస్తుతం కృత్రిమ మేధస్సు (ఏఐ)ను ఉపయోగిస్తూ నకిలీ వెబ్‌సైట్లు, నకిలీ మొబైల్ యాప్‌లు, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రకటనలు, ఉద్యోగాలు, పెట్టుబడుల పేరుతో మోసాలు, డిజిటల్ అరెస్టు పేరుతో బెదిరింపులు, ఓటీపీలు, యూపీఐ అభ్యర్థనలు, క్యూఆర్ కోడ్‌ల ద్వారా డబ్బులు దోచుకునే కొత్త తరహా సైబర్ నేరాలు విస్తరిస్తున్నాయని తెలిపారు. నేరగాళ్లు కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వేగంగా వినియోగిస్తుండగా, ప్రజల్లో అదే స్థాయిలో అవగాహన పెరగకపోవడం వల్ల మోసాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి నెల వందల సంఖ్యలో సైబర్ మోసాలకు సంబంధించిన ఫిర్యాదులునమోదవుతున్నాయని, లక్షల రూపాయల మేర ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారని సీపీ తెలిపారు. విద్యావంతులు సైతం నేరగాళ్ల మానసిక వ్యూహాలకు మోసపోవడం ఈ నేరాల తీవ్రతను తెలియజేస్తోందన్నారు. ఒక్కసారి బ్యాంకు వివరాలు, ఓటీపీ, యూపీఐ పిన్ వ్యక్తిగత సమాచారం నేరగాళ్ల చేతికి చేరితే కొన్ని నిమిషాల్లోనే బ్యాంకు ఖాతాల్లోని డబ్బు మాయమవుతుందని హెచ్చరించారు. ఇటీవలి కాలంలో 'డిజిటల్ అరెస్టు' పేరుతో జరుగుతున్న మోసాలు మరింత ప్రమాదకరంగా మారాయని సీపీ పేర్కొన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు, పోలీసు అధికారులు, ఇతర ప్రభుత్వ సంస్థల పేర్లు చెప్పి వీడియో కాల్ ద్వారా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ గంటల తరబడి ఫోన్‌లోనే ఉంచి వారి నుంచి లక్షల రూపాయలు బదిలీ చేయించుకుంటున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయని చెప్పారు. అలాగే తక్కువ సమయంలో భారీ లాభాలు వస్తాయని ఆశ చూపిస్తూ నకిలీ ట్రేడింగ్ యాప్‌లు, పెట్టుబడి పథకాల ద్వారా ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత వివరాలను అధికంగా పంచుకోవడం, ఒకే పాస్‌వర్డ్‌ను అన్ని ఖాతాలకు ఉపయోగించడం, అనుమానాస్పద లింక్‌లను తెరవడం వంటి అలవాట్లు సైబర్ నేరగాళ్లకు అవకాశంగా మారుతున్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ డిజిటల్ లావాదేవీల సమయంలో అప్రమత్తంగా ఉండటమే సైబర్ నేరాలను నివారించే ఉత్తమ మార్గమని సూచించారు.ఆన్‌లైన్ మోసం లేదా ఆర్థిక సైబర్ నేరానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని, అలాగే జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సకాలంలో సమాచారం అందిస్తే డబ్బు రికవరీ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ ఫణిందర్, ఇన్‌స్పెక్టర్లు కరుణాకర్, బాలకృష్ణ, మోహన్ బాబు, భానుప్రకాష్, ఉస్మాన్ షరఫ్, రవికుమార్, ఎస్సైలు రంజిత్ కుమార్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గెస్ట్ ఫ్యాకల్టీ నియామకాల్లో భారీ అక్రమాలు?

**పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిబంధనలకు నీళ్లు!**

**మెరిట్ జాబితాలో మార్పులు.. బంధువులకు పోస్టుల కట్టబెట్టుడు?**

**ప్రిన్సిపల్ పద్మపై సమగ్ర విచారణకు PDSU భద్రాద్రి జిల్లా కమిటీ డిమాండ్**

**కొత్తగూడెం, ఆగస్టు 5 (నినాదం):**
పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి నిర్వహించిన గెస్ట్ ఫ్యాకల్టీ నియామక ప్రక్రియ తీవ్ర వివాదాస్పదంగా మారింది. సెలక్షన్ కమిటీ నిబంధనల ప్రకారం రూపొందించిన ప్రాథమిక ఎంపిక జాబితాను పక్కనబెట్టి, అనంతర కాలంలో అక్రమంగా మార్పులు చేర్పులు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



కళాశాల ప్రిన్సిపల్ పద్మ స్వయంగా ఈ వ్యవహారాన్ని నడిపిస్తూ, కమిటీ ఎంపిక చేయని పలువురి పేర్లను జాబితాలో చేర్చారని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ తీవ్రంగా ధ్వజమెత్తింది.

**నెలకు లంచాల ఒప్పందం.. గతంలో మణుగూరులోనూ ఇదే తరహా దందా**
పిడిఎస్ యూ జిల్లా అధ్యక్షుడు బుర్ర వీరభద్రం విలేకరులతో మాట్లాడుతూ ప్రిన్సిపల్ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్ పద్మ తన పరిధిలోని పాల్వంచతో పాటు కొత్తగూడెం కళాశాలల్లోనూ అర్హత లేని తన బంధువులు, ఆప్తులకు పోస్టులను కట్టబెట్టారని విమర్శించారు. అంతేకాకుండా, అనర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసి, వారి నుంచి ప్రతి నెలా వేతనంలో కొంత మొత్తం తనకు ముట్టజెప్పేలా ముందస్తు ఒప్పందాలు కుదుర్చుకున్నారని సంచలన ఆరోపణ చేశారు. గతంలో మణుగూరు ప్రభుత్వ కళాశాలలో జరిగిన గెస్ట్ ఫ్యాకల్టీ నియామకాల్లోనూ అనర్హులకు పోస్టులిచ్చిన చరిత్ర ప్రిన్సిపల్ పద్మకు ఉందని, అక్కడి అక్రమాల వెనుక కూడా ఆమె హస్తమే ఉందని ఆయన గుర్తుచేశారు.

**సమగ్ర విచారణ జరిపి అర్హులకు న్యాయం చేయాలని డిమాండ్**
ప్రభుత్వ విద్యాసంస్థల్లో నియామకాలు కేవలం మెరిట్, రిజర్వేషన్లు, పారదర్శకత ఆధారంగానే జరగాలని, ఇలాంటి అక్రమాల వల్ల నిజమైన అర్హతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని విద్యార్థి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సెలక్షన్ కమిటీ సమావేశపు మినిట్స్, అసలు మెరిట్ జాబితా, తుది ఎంపిక జాబితా, తదనంతరం జరిగిన మార్పులకు సంబంధించిన అన్ని రికార్డులను ఉన్నతాధికారులు స్వాధీనం చేసుకుని సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తక్షణమే సెలక్షన్ కమిటీ ఎంపిక చేసిన అసలు అభ్యర్థుల పేర్లను బహిర్గతం చేయాలన్నారు.

**ఉన్నత విద్యాశాఖ చర్యలు తీసుకోకుంటే జిల్లా వ్యాప్త ఆందోళనలు**
ఈ వ్యవహారంలో ఉన్నత విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి ప్రిన్సిపల్ పద్మపై చట్టపరమైన, శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని పిడిఎస్ యూ జిల్లా కమిటీ కోరింది. అనర్హుల నియామకాలను రద్దు చేసి, మెరిట్ కలిగిన అభ్యర్థులకు వెంటనే న్యాయం చేయాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థలను దిగ్బంధించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని పిడిఎస్ యూ నాయకులు హెచ్చరించారు.

నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
గురువారం
6 ఆగస్టు
2026

# రు.95 లక్షలతో దమ్మపేటలో అభివృద్ధి పనుల జాతర

### ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే జారె..





**దమ్మపేట, ఆగస్టు 5(నినాదం):** అశ్వారావుపేట నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా దమ్మపేట మండలంలోని పలు గ్రామాల్లో రూ. 95 లక్షల నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ విస్తృతంగా పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్య, పసిపిల్లల ఆరోగ్యం, ప్రజా సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. పర్యటనలో భాగంగా ముందుగా మల్కారం గ్రామంలో మౌలిక వసతుల కల్పన కోసం సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం గుత్తావారిగూడెం గ్రామంలో చిన్నారుల సంక్షేమం కోసం నూతనంగా నిర్మించిన అంగన్వాడీ కేంద్రం భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ (పీడీ) భాగస్వామ్యంతో నిర్వహించిన తల్లి పాల వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొని, వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం గుర్వాయిగూడెం గ్రామంలోని పాఠశాల ఆవరణలో విద్యార్థుల భద్రత కోసం నిర్మించిన ప్రహరీ గోడను ప్రారంభించారు. అదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయి, ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న సీనియర్ కాంగ్రెస్ నేత తంగిళ్ళ విశ్వనాథ్ మాతృమూర్తి రాములమ్మను పరామర్శించి, ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలోనే కుంజా సుజాత నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని ఆ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా రవాణా సౌకర్యాలను మెరుగుపరిచే క్రమంలో గండుగులపల్లి గ్రామంలో రాకపోకల సౌకర్యం కోసం సీసీ రోడ్డుతో పాటు కల్వర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి పనులను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో అంగన్వాడీ పీడీ, స్థానిక సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, జిల్లా మరియు మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, వివిధ శాఖల సంబంధిత అధికారులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యానగర్ కాలనీలో సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామసభ విజయవంతం



**కొత్తగూడెం (చుంచుపల్లి), ఆగస్టు 5(నినాదం) :** విద్యానగర్ కాలనీలో గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామసభ విజయవంతంగా నిర్వహించారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, బీఎల్ఓలు, పీహెచ్సీ డాక్టర్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ విద్యానగర్ కాలనీలోని అన్ని వార్డుల్లో ఉన్న సమస్యలను వార్డు సభ్యుల సహకారంతో దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అంటువ్యాధులు ప్రబలకుండా గ్రామంలో పారిశుద్ధ్య చర్యలను మరింత పటిష్టంగా చేపట్టాలని గ్రామ పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఈ గ్రామసభలో గ్రామ దీపికలు, అంగన్‌వాడీ టీచర్లు, ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు . అనంతరం సర్పంచ్ శాంతి శ్రీ ప్రజా సమస్యలపై చర్చించారు. గ్రామ అభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని సర్పంచ్ పేర్కొన్నారు.

# ఛాతీ వ్యాధుల శస్త్రచికిత్సలో మినిమల్లీ ఇన్వాసివ్ థొరాసిక్ సర్జరీ

### యశోద హాస్పిటల్స్ థోరాసిక్ సర్జన్ డాక్టర్ సి. రోహన్ రెడ్డి



**నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 5 (నినాదం) :** ఊపిరితిత్తులు, అన్నవాహిక, ఛాతి మధ్య భాగం (మీడియాటినం), డయాఫ్రేమ్, ఛాతీ గోడకు వచ్చే వ్యాదులను గుర్తించి చికిత్స చేయడానికి సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ అత్యాధునిక విదానాలను ఉపయోగిస్తోందని యశోద హాస్పిటల్స్ దొరాసిక్ సర్జన్ డాక్టర్ సి. రోహన్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మినిమల్లీ ఇన్వాసివ్, రోబోట్ సహాయంతో చేసి సర్జరీల ద్వారా మెరుగైన వైద్యం అందిస్తోందన్నారు. ఊపిరితిత్తుల క్యాన్సర్, అన్నవాహిక క్యాన్సర్, ఛాతీలో కణితులు వంటి వ్యాదులపై ప్రజల్లో అవగాహన పెరుగుతోందని, వ్యాదిని త్వరగా గుర్తించడం వల్ల పేషంట్ల కు మరింత సురక్షితమైన ఆపరేషన్లను ఆసుపత్రి అందిస్తోందన్నారు. దీని ద్వారా ఖచ్చితమైన చికిత్స లభించడమే కాకుండా, పేషెంట్లు త్వరగా కోలుకొని ఆరోగ్యంగా ఇంటికి వెళుతున్నారన్నారు. థొరాసిక్ సర్జరీ అంటే గుండెను మినహాయించి, చాతీలో వచ్చే ఇతర వ్యాధులకు చేసే ప్రత్యేకమైన ఆపరేషన్, కొన్నిక్లిష్టమైన సమస్యలకు చాతీని పూర్తిగా తెరిచి చేసే ఓపెన్ సర్జరీ తప్పనిసరి అయినప్పటికీ, ఇప్పుడు ఆధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయన్నారు. వీడియో కెమెరా సాయంతో చేసే సర్జరీ (వాట్స్), రోబోట్ సహాయంతో చేసే సర్జరీ (రాట్స్) వంటి పద్ధతుల ద్వారా కేవలం ఒక చిన్న రంధ్రం లేదా కోతతో ఆపరేషన్లు చేస్తున్నారన్నారు. వీటి వల్ల పేషంట్లకు సర్జరీ కోత, నొప్పి చాలా తక్కువగా ఉంటాయని, ఆసుపత్రిలో ఎక్కువ రోజులు ఉండాల్సిన అవసరం కూడా ఉండదన్నారు. పేషేంట్లు చాలా త్వరగా తమ పనులు తాము చేసుకోగలుగుతారన్నారు. డాక్టర్లు కూడా చుట్టుపక్కల ఉండే అవయవాలకు ఎలాంటి హాని కలగకుండా చాలా ఖచ్చితత్వంతో ఈ ఆపరేషన్ చేయగలుగుతున్నారన్నారు. గత పదేళ్లలో చాతీ సర్జరీల్లో ఎన్నో మార్పులు వచ్చాయని ఈ రోజుల్లో చిన్న కోతతో లేదా రోబోట్ సహాయంతో ఆపరేషన్లు చేస్తున్నామన్నారు. దీని వల్ల సంక్లిష్టమైన సమస్యలకు కూడా శరీరానికి పెద్దగా ఇబ్బంది కలగకుండా ఖచ్చితంగా చికిత్స చేయగలుగుతున్నామని చెప్పారు. “వ్యాధిని ముందుగానే గుర్తించడం ఆధునిక సర్జరీ నైపుణ్యాలు అన్ని విభాగాల వైద్యులు కలిసి క్యాన్సర్ కు వైద్యం చేయడం వల్ల పేషేంట్లకు అత్యుత్తమ చికిత్స అందుతోందన్నారు. వారు త్వరగా కోలుకొని సాధారణ జీవితం గడపగలుగుతున్నారన్నారు. ప్రతి పేషంట్ కు వారి ఆరోగ్యపరిస్థితికి తగ్గట్టుగా ఆధునిక టెక్నాలజీని ఉపయోగిస్తూనే ప్రేమతో కూడిన వైద్యం అందించడమే మా లక్ష్యమని ఆయన వివరించారు. అధునాతన ఆపరేషన్ థియేటర్లు, హై-డెఫినిషన్ ఇమేజింగ్ సిస్టమ్స్, రోబోటిక్ సర్జికల్ ప్లాట్ఫారమ్‌లు, థొరాసిక్ సర్జన్లు, పల్మోనాలజిస్టు, ఆంకాలజిస్టు, రేడియాలజిస్టు, అనస్థీషియాలజిస్ధులు, క్రిటికల్ కేర్ నిపుణులతో కూడిన మల్టీడిసిప్లేనరీ బృందం మద్దతుతో, యశోద హాస్పిటల్స్ అనేక రకాల థొరాసిక్ (చాతి) సమస్యలకు సమగ్రమైన చికిత్సను అందిస్తోందన్నారు. ప్రారంభ దశలో ఉన్న ఊపిరితిత్తుల క్యాన్సర్లు, అన్నవాహిక వ్యాధుల నుండి ప్రాణాపాయం లేని ఛాతి కణితులు సంక్లిష్టమైన దాతీ ఎమర్జెన్సీల వరకు, హాస్పిటల్ ఎవిడెన్స్-బేస్డ్, మినిమల్లీ నాసిస్ సర్జికల్ సేవలను నిరంతరం విస్తరిస్తోందన్నారు. పేషింట్లు మెరుగైన భద్రత సౌకర్యంతో మంచి ఫలితాలను సాదించడంలో సహాయపడుతుందన్నారు. యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ గత మూడు దశాబ్దాలుగా వైవిద్యమైన వైద్య అవసరాలు కలిగిన ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను అందిస్తోందని, సమర్ధవంతమైన నాయకత్వం బలమైన యాజమాన్యం కింద, యశోద గ్రూప్ అత్యున్నత ప్రమాణాలతో కూడిన వైద్య చికిత్సను అందించే ‘సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్’గా ఎదిగిందన్నారు. పేషంట్ల అవసరాలకు అనుగుణంగా, అరుదైన క్లిష్టమైన ప్రక్రియల కోసం సైతం విప్లవాత్మక సాంకేతికతను ఉపయోగిస్తూ, యశోద గ్రూప్ ప్రతి వైద్య విభాగంలోనూ అత్యాధునిక రోగనిర్ధారణ చికిత్సా సేవలను అందిస్తోందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సీనియర్ మేనేజర్ రూపేష్‌షిండే, మార్కెటింగ్ మేనేజర్ అమర్నాథ్ మూర్తిలు పాల్గొన్నారు.

# సబ్బితంలో ఉచిత వైద్య శిబిరం, మొక్కల పంపిణీ



**కమాన్ పూర్ ఆగస్టు 05 (నినాదం):** పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామంలో బుధవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వన మహోత్సవం మరియు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నూనె సరోజన రమేష్ గ్రామ ప్రజలకు ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేశారు. ప్రతీ ఇంట్లో ఒక్కో మొక్క నాటి పర్యావరణాన్ని సంరక్షించాలని ఆమె కోరారు. అలాగే, వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల నివారణకు రాఘవపూర్ పిహెచ్‌సి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. జ్వరాలు, ఇతర వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా సర్పంచ్ సూచించారు. ఈ కార్యక్రమాలలో ఉప సర్పంచ్ ఇండ్ల మహేందర్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్, ఎస్‌హెచ్‌జీ మహిళలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తల్లి పాలే బిడ్డకు శ్రేష్టం



**వలిగొండ, ఆగస్టు 05 (నినాదం):** తల్లి పాలే పుట్టిన బిడ్డకు శ్రేష్టమని వేములకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సూపర్వైజర్ రేణుకదేవి అన్నారు. బుధవారం మండలంలోని దుప్పెల్లి గ్రామంలో ఆమె అంగన్వాడి టీచర్లతో కలిసి తల్లి పాల ప్రాముఖ్యతపై గర్భిణీలకు, తల్లులకు ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జావిద్ పాషా, సూపర్వైజర్ రేణుకా దేవి లు మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే ముర్రు పాలు పట్టాలని, అవి పిల్లలకు రోగ నిరోధక శక్తి అందిస్తాయని, అవి అమృతంతో సమానమని అన్నారు. శిశువు 6 మాసాలు నిండే వరకు తల్లి పాలు ఇవ్వాలని అవి మానసిక ఎదుగుదలకు ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మహ్మద్, ఆరోగ్య కార్యకర్తలు జె. సత్తయ్య, ఎన్ అనిత అంగన్వాడి టీచరు ప్రేమలత, యాదమ్మ, సుగుణ, ఆశా కార్యకర్తలు కవిత, సుజాత, యాదమ్మ, గ్రామపంచాయతీ సిబ్బంది, వైద్య సిబ్బంది, గర్భిణీలు, బాలింతలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థులకు కిట్లు పంపిణీ..

### మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన ఎంఈవో



**బిక్కనూర్,ఆగస్టు 5(నినాదం) :** బిక్కనూరు మండలం బస్వాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను బుధవారం మండల విద్యాధికారి ఆర్. రాజ గంగారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని ప్రీ-ప్రైమరీ విద్యార్థులకు పుస్తకాల కిట్లు, యూనిఫారాలు, షూస్ పంపిణీ చేశారు. అనంతరం ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారమే భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలల నిర్వహణ, విద్యార్థుల హాజరు, బోధన విధానాన్ని పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు డా. ఎం. వెంకటేశ్వర్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు ఎల్. రాధ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



# యువ నేతపై ప్రజల్లో పెరుగుతున్న క్రేజ్

### సమస్యలు వింటూ.. మహిళలతో మాటా మంతి..
### “ప్రణవ్” పలకరింపుతో పులకించిన మహిళలు



**జమ్మికుంట, ఆగస్టు 6 (నినాదం) :** ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందిస్తున్న సమయంలో జమ్మికుంటకు వచ్చిన హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ ప్రణవ్ బాబు ను చూసి మహిళలు ఆప్యాయతతో పలకరించారు. మున్సిపల్ పరిధిలోని ఎనిమిదో వార్డులో ప్రణవ్ పర్యటిస్తున్న సమయంలో ఆయనతో పలువురు మహిళలు ఆప్యాయంగా మాట్లాడారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా ఓపికతో వారి సమస్యలను విని తప్పకుండా పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని వారిని అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నాయని వారు సమాధానం తెలపడంతో భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలు మీకోసం ప్రభుత్వం అందిస్తుందని స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి కాంగ్రెస్ నిలబెట్టిన అభ్యర్థులను గెలిపించాలని వారికి సూచించారు. ప్రణవ్ బాబు చెక్కులు పంపిణీ చేస్తున్న సమయంలో మహిళలు యువకులు ఆయనతో ఆప్యాయంగా మాట్లాడుతూ ముందుకు సాగారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయతతో పలకరిస్తూ ప్రణవ్ బాబు వారి సమస్యలు వింటూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎగ్గని శ్రీనివాస్ మొలుగూరి సదయ్య దిడ్డి రాము మహమ్మద్ సజ్జు పొన్నగంటి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# తొర్రూరులో ఘనంగా బోనాల సంబరాలు

### బోనం ఎత్తిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి







**తొర్రూరు, ఆగస్టు 5( నినాదం):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలో భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని అన్నారం రోడ్డు లోని ముత్యాలమ్మ తల్లి ఆలయంలో,ఎస్సీ కాలనీ సమీపంలోని ముత్యాలమ్మ తల్లి ఆలయంలో ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొడ్రాయి వద్ద నుండి బోనం ఎత్తుకొని మహిళలతో పాటు బయలుదేరారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో తలపై బోనాలు ఎత్తుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, భక్తుల జైజై ధ్వనులతో తొర్రూరు పట్టణమంతా పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి బోనాల ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో పాలకుర్తి నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో ఉండాలని, రైతులకు సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, యువతకు ఉపాధి అవకాశాలు పెరగాలని, ప్రతి కుటుంబం ఆనందంగా జీవించాలని ఆమె ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం మరింత ప్రజాసేవతో ముందుకు సాగాలని, పాలకుర్తి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ, బోనాలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, సంస్కృతిని ప్రతిబింబించే గొప్ప పండుగ అని పేర్కొన్నారు. మన సంప్రదాయ లను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రజల విశ్వాసాలను, ఆధ్యాత్మిక భావాలను ప్రతిబింబించే మహత్తర పండుగ అని అన్నారు. ప్రజల ఆశీస్సులు, అమ్మవారి కృపతో పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నిరంతరం కృషి చేస్తున్నామని, రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, సాగునీరు, మౌలిక వసతులు, మహిళా సంక్షేమం, యువత ఉపాధి వంటి అన్ని రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు నిరంతరం కృషి చేస్తూ, నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తమ సంకల్పమని అన్నారు. పండుగ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువత ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. పలువురు మహిళలతో కలిసి బోనాల ఊరేగింపులో పాల్గొని భక్తులతో మమేకమయ్యారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ, పండుగ ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. పట్టణంలో బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా వేడుకలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్, వైస్ చైర్మన్ సోమా రజిని రాజశేఖర్, పట్టణ అధ్యక్షులు ముద్దసాని సురేష్, మండల అధ్యక్షులు రవీంద్ర చారి, సీనియర్ నాయకులు డా, సోమేశ్వర రావు, గంజి విజయ్ పాల్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మంగళంపల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ జినుగు సురేందర్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు చిత్తలూరి శ్రీనివాస్, సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, మేకల కుమార్, యువజన నాయకులు రాజేష్ యాదవ్, మహేష్ యాదవ్, పట్టణ పార్టీ సీనియర్ నాయకులు, పట్టణ వార్డు కౌన్సిలర్లు, మాజీ వార్డు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు, మహిళలు, భక్తులు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# కమాన్‌పూర్‌లో అభివృద్ధి పనులపై గ్రామసభ..!!

### జలసిరి, పర్యావరణ పరిరక్షణపై గ్రామసభలో తీర్మానం
### మంత్రి శ్రీధర్ బాబు సహకారం మరువలేనిది
### సర్పంచ్ రంగు సత్యనారాయణ





**కమాన్‌పూర్, ఆగస్టు5 (నినాదం):** కమాన్‌పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన గ్రామాభివృద్ధి పనులపై గ్రామసభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి సంక్షేమ పనులు, మౌలిక సదుపాయాల కల్పనపై విస్తృతంగా చర్చించారు. సర్పంచ్ సత్యనారాయణ మాట్లాడుతూ...గ్రామంలో ప్రజలకు, చిన్నారులకు తీవ్ర ఇబ్బందిగా మారిన కోతులు, కుక్కల బెడదను అరికట్టేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం తీసుకువచ్చిన జలసిరి కార్యక్రమం లో భాగంగా పంట కుంటలు, ఊట కుంటలు, ఇంకుడు గుంతల వలన కలిగే ప్రయోజనాలు ప్రజలకు వివరించారు అలాగే ప్రతి ఒక్కరూ ఖాళీ స్థలాలు, పంట పొలాల వద్ద మొక్కలు నాటి సంరక్షించాలి అని సూచించారు. రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు గ్రామాన్ని అభివృద్ధి పథం లో తీసుకెళ్లడానికి ప్రత్యేక చొరవ తీసుకొని మౌలిక సదుపాయాల కొరకు నిధుల మంజూరుకు అందించిన సహకారం గురించి ప్రజలకు వివరించారు. ఈ సమావేశం లో ట్రాన్స్‌కో ఏఈ స్వామి, కార్యదర్శి రాము, జిపిఓ రాజేందర్, వార్డు సభ్యులు పంజా సాయిరాం, పి. రాజకుమార్, బి లక్ష్మి, ఎం కుమార్,లింగస్వామి, తూటి రాజు, లైన్‌మెన్ ఓదెలు, ఏఈఓ నవీన్, ఏఎన్ఎం శ్రీలత, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, వీవోఏలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గురువారం, తెలంగాణ
06 ఆగస్టు 2026
# నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

## అంగన్‌వాడీ చిన్నారులకు యూనిఫాంల పంపిణీ



**కోదాడ,ఆగస్టు 5(నినాదం):** అనంతగిరి మండలంలోని ఖానాపురం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు ఉచిత యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కంటు లాజర్ మాట్లాడుతూ చిన్నారుల విద్య, ఆరోగ్యం, పోషకాహారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకుని చిన్నారులను క్రమం తప్పకుండా కేంద్రాలకు పంపించాలని సూచించారు. ఉప సర్పంచ్ గింజుపల్లి జగన్ మాట్లాడుతూ, చిన్నారుల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, యూనిఫాంల పంపిణీ వంటి కార్యక్రమాలు వారిలో పాఠశాలల పట్ల ఆసక్తిని పెంపొందిస్తాయని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యం, విద్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, ఏఎన్ఎం పద్మావతి, అంగన్‌వాడీ టీచర్ దేవేంద్ర, ఆశా కార్యకర్తలు స్వాతి, ముత్యాలరాణి, ఆయమ్మ గుండు రమణ, చిన్నారులు, వారి తల్లులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై సీఎం వ్యాఖ్యలు సరికావు

### మట్టపల్లి పుల్లయ్య గౌడ్




**కోదాడ,ఆగస్టు 5(నినాదం):** ఇంజనీరింగ్ విద్యార్థులపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని బీఆర్ఎస్ పార్టీ అనంతగిరి మండల ఉపాధ్యక్షుడు మట్టపల్లి పుల్లయ్య గౌడ్ విమర్శించారు. విద్యార్థులను "క్రిమినల్ వేస్ట్"గా పేర్కొనడం లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రుల మనోభావాలను దెబ్బతీసే చర్య అని అన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం విద్యార్థులనే విమర్శించడం బాధాకరమన్నారు. విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని, వాటి నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులు దేశ భవిష్యత్తుకు బలమైన పునాది అని, వారిని ప్రోత్సహించాల్సిన ముఖ్యమంత్రి అవమానకర వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. సీఎం వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా ఇంజనీరింగ్ విద్యార్థులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని మట్టపల్లి పుల్లయ్య గౌడ్ డిమాండ్ చేశారు.


## తల్లిపాలే శిశువుకు శ్రీరామరక్ష



**తోగుట, ఆగస్టు 5 (నినాదం):** తల్లిపాలు శిశువుకు అమృతంతో సమానమని వెంకట్రావుపేట గ్రామ సర్పంచ్ బండారు కవిత స్వామి గౌడ్ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బుధవారం తొగుట మండలంలోని వెంకట్రావుపే. 3వ అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలేఖతో కలిసి మాట్లాడిన సర్పంచ్, శిశువు జన్మించిన మొదటి గంటలోనే తల్లిపాలు ఇవ్వడం ఎంతో అవసరమని తెలిపారు. తొలి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలే ఇవ్వాలని, అనంతరం తల్లిపాలతో పాటు అదనపు పోషకాహారం అందించాలని సూచించారు. తల్లిపాలపై సమాజంలో మరింత అవగాహన పెంపొందించి ప్రతి శిశువుకు ఆరోగ్యవంతమైన భవిష్యత్తు అందించడమే తల్లిపాల వారోత్సవాల లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రవీందర్, ఏఎన్ఎం లక్ష్మి, వైద్యాధికారి సుభాషిణి, అంగన్‌వాడీ సిబ్బంది జ్యోతి, స్వప్న, వీణ, ఆశా కార్యకర్తలు భాగ్యలక్ష్మి, యాదమ్మ, వినోద, గర్భిణీలు, బాలింతలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

## జవహర్ నగర్... డంపింగ్ యార్డ్‌కు శాశ్వత పరిష్కారం చూపండి

### మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్



**జవహర్ నగర్, ఆగస్టు 5 (నినాదం):** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లో నెలవై ఉన్న డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని కేంద్ర మంత్రికి మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ బుధవారం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎంపీ ఈటెల రాజేందర్ విలేకరులతో మాట్లాడుతూ రోజుకు పదివేల మెట్రిక్ టన్నుల చెత్త ఒకే చోట వేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. జవహర్ నగర్ తో పాటు చుట్టుపక్కల ప్రాంతాలైన కీసర, అహ్మద్గూడా, నాగారం, ఘట్కేసర్, దమ్మాయిగూడ, మొదలైన ప్రాంత ప్రజలు జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ వల్ల తీవ్రమైన కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారని, జీరో పొల్యూషన్ తో చెత్త రీసైకిల్ చేపట్టాలని విజ్ఞప్తి చేశానని తెలిపారు. ఈ మేరకు కేంద్ర మంత్రి హైదరాబాదులోనూ ఢిల్లీ తరహా వ్యర్థాల నిర్వహణకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.

## 5వ రోజు కొనసాగుతున్న ఉపాధిహామీ ఉద్యోగుల నిరసనలు



**హుజూర్నగర్ (మఠంపల్లి) ఆగస్టు 5 (నినాదం):** గ్రామీణ అభివృద్ధి శాఖ ఉద్యోగుల నిరసనలు ఐదవ రోజు కొనసాగుతున్నాయి. రాష్ట్రజేఏసీ పిలుపుమేరకు మండలంలోని ఉద్యోగులు పెన్డౌన్, షట్ డౌన్ నిర్వహిస్తూ విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మండల పరిషత్ సూపరింటెండెంట్ వారికి వారి సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక పంపించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఇట్టి కార్యక్రమంలో ఏపీవో ఉమా ఈసి సందీప్, టి ఏ లు ఎం. బొంగయ్య బి. మన్సూర్ డి. సక్రు నాయక్ సిఓ ఏఏ రమాదేవి మహమ్మద్ అఫ్జల్, అటెండర్ సరిత పాల్గొన్నారు.

# బెంగాల్ పనివారిలో రాజకీయ చైతన్యం

### గీతం ఆతిథ్య ఉపన్యాసంలో పేర్కొన్న కేంబ్రిడ్జ్ చరిత్రకారిణి ప్రొఫెసర్ సమీతా సేన్



**పటాన్చెరు, ఆగస్టు 05(నినాదం):** పశ్చిమ బెంగాల్ లోని గృహ కార్మికులలో రాజకీయ చైతన్యం అభివృద్ధి చెందుతోందని, గుర్తింపు, గౌరవం, న్యాయపరమైన వేతనాలు, చట్టపరమైన రక్షణ వంటి డిమాండ్లతో సమీకృతమవుతున్నట్టు కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం లోని చరిత్ర ఉపన్యాసకురాలు సమీతా సేన్ పేర్కొన్నారు. హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, సెంటర్ ఫర్ ఏషియన్ స్టడీస్ ఆధ్వర్యంలో పట్టణీకరణ, లింగం, శ్రమ (యూజీఎల్) విభాగం క్లస్టర్ ప్రారంభోపన్యాసాన్ని బుధవారం నిర్వహించింది. 'ఉద్యమిస్తున్న పనిమనుషులు: పశ్చిమ బెంగాల్ లో గృహ కార్మికుల రాజకీయాలు' అనే అంశంపై ఆమె ఆన్ లైన్ లో ఆతిథ్య ఉపన్యాసం చేశారు. పట్టణీకరణ, శ్రమ, లింగం వంటి అంశాలపై పనిచేస్తున్న స్కాలర్లను ఒకచోట చేర్చి, వివిధ రంగాల మధ్య అర్థవంతమైన సంభాషణలను ప్రోత్సహించే ఒక వేదికగా యూజీఎల్ డైలాగ్ ను రూపొందించారు. గృహాలలో పనిచేయడం అనేది లింగం, వర్గం, వలసలు, పట్టణీకరణ సమస్యలతో ముడిపడి ఉందని, ఇది అంతర్ విభాగ పరిశోధనకు ఒక ముఖ్యమైన రంగంగా నిలుస్తుందని డాక్టర్ సమీతా సేన్ అభిప్రాయపడ్డారు. అస్థిరమైన ఉపాధి, సామాజిక భద్రత లేకపోవడం, పరిమిత చట్టపరమైన రక్షణలతో సహా గృహ కార్మికులు ఎదుర్కొంటున్న సవాళ్లపై ప్రొఫెసర్ సేన్ చర్చించారు. గృహ కార్మికుల సంఘాలు, సమూహాలు పెరగడం వారి సమస్యలను ప్రజా చర్చలు, విధానపరమైన సంప్రదింపులలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిందని ఆమె పేర్కొన్నారు. కార్మికుల జీవన అనుభవాలను నమోదు చేయవలసిన ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, సమకాలీన భారతదేశంలో కార్మిక, లింగ, పట్టణ పరివర్తనలను మరింత బాగా అర్థం చేసుకోవడానికి స్కాలర్లు అంతర్ విషయ విధానాలను అవలంబించాలని ఆమె ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, స్కాలర్లు, విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. కార్మిక హక్కులు, మహిళా ఉద్యమాలు, పట్టణ భారతదేశంలో గృహ కార్మికుల మారుతున్న స్వభావంపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని హైదరాబాదులోని స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లోని ఆంగ్ల, ఇతర భాషల విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్, యూజీఎల్ క్లస్టర్ సమన్వయకర్త డాక్టర్ దేబద్రిత చక్రవర్తి సమన్వయం చేశారు.

ప్రొఫెసర్ సమీతా సేన్ కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో ఇంపీరియల్, నావల్ హిస్టరీకి సంబంధించిన వేర్ హార్మ్స్‌వర్త్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్నారు. ఆమె గతంలో డైమండ్ హార్బర్ మహిళా విశ్వవిద్యాలయానికి తొలి ఉప కులపతిగా పనిచేశారు. కలకత్తా, జాదవ్ పూర్ విశ్వవిద్యాలయాలలో బోధించారు. జాదవ్ పూర్ వర్సిటీలోని స్కూల్ ఆఫ్ ఉమెన్స్ స్టడీస్ డైరెక్టర్ గా, అంతర్ విభాగం అధ్యయనం డీన్ గా కూడా సేవలందించారు. కామన్వెల్త్ చరిత్రలో ట్రెవర్ రీస్ బహుమతి గ్రహీత అయిన ఆమె, కార్మిక చరిత్ర, లింగ అధ్యయనాలు, వలస భారతదేశంలో విస్తృతంగా ప్రచురించారు. 1982 నుంచి 'సచేతన' అనే సంస్థ ద్వారా మహిళా ఉద్యమంలో కూడా చురుకైన సభ్యురాలిగా ఆమె ఉన్నారు.

# సైబర్ నేరాలపై విద్యార్థులతో అవగాహన ర్యాలీ

- దుబ్బాకలో సైబర్ క్రైమ్ పోలీసుల వినూత్న కార్యక్రమం --

**అప్రమత్తంగా ఉంటేనే మోసాల నుంచి రక్షణ: సీఐ రాజేష్**




**దుబ్బాక, ఆగస్టు 5 (నినాదం):** ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విస్తృతంగా అందుబాటులోకి రావడంతో పాటు సైబర్ నేరాలు కూడా రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేసేందుకు సిద్ధిపేట జిల్లా దుబ్బాక పోలీసులు వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక సీఐ రాజేష్ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ బృందం, ప్రైవేట్ కళాశాల విద్యార్థులతో కలిసి పట్టణంలో సైబర్ నేరాల నివారణపై భారీ అవగాహన ర్యాలీ నిర్వహించింది. ఈ కార్యక్రమం ప్రజల్లో విశేష స్పందనను రేకెత్తించింది. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు చేతుల్లో అవగాహన ప్లకార్డులు పట్టుకుని పట్టణంలోని ప్రధాన వీధుల గుండా నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. "అపరిచిత లింకులను క్లిక్ చేయవద్దు", "ఓటీపీ, యూపీఐ పిన్, బ్యాంకు వివరాలను ఎవరికీ చెప్పవద్దు", "తెలియని కాల్స్, మెసేజ్‌లను నమ్మవద్దు", "సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండండి", "1930కు వెంటనే ఫిర్యాదు చేయండి" వంటి సందేశాలతో ప్రజలను చైతన్యపరిచారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహం వద్ద విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేసి సైబర్ భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరగాళ్లు ఉపయోగిస్తున్న కొత్త కొత్త మోసపూరిత పద్ధతులు, వాటి నుంచి ఎలా రక్షించుకోవాలి, మోసానికి గురైతే వెంటనే తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు వివరించారు.

ఈ సందర్భంగా సీఐ రాజేష్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉండటంతో సైబర్ నేరగాళ్లు సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుంటున్నారని అన్నారు. బ్యాంకు అధికారులు, పోలీసు అధికారులు, ఆదాయపు పన్ను శాఖ, కూరియర్ సంస్థలు, ఉద్యోగాల పేర్లు, లాటరీలు, బహుమతులు, పెట్టుబడులు, కేవైసీ అప్‌డేట్, విద్యుత్ బిల్లు, గ్యాస్ కనెక్షన్ వంటి పేర్లతో వచ్చే కాల్స్, మెసేజ్‌లు, లింకులను నమ్మరాదని సూచించారు. అపరిచిత లింకులను క్లిక్ చేయడం, మొబైల్‌లో తెలియని యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవడం, ఓటీపీ, ఏటీఎం పిన్, యూపీఐ పిన్, బ్యాంకు ఖాతా వివరాలను ఇతరులతో పంచుకోవడం వల్ల క్షణాల్లో బ్యాంకు ఖాతాల్లోని నగదు మోసగాళ్ల చేతికి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఏదైనా అనుమానం వచ్చిన వెంటనే సంబంధిత బ్యాంకు కస్టమర్ కేర్ లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు. విద్యార్థులు సైబర్ భద్రతపై పూర్తి అవగాహన కలిగి ఉండటమే కాకుండా తమ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, గ్రామ ప్రజలకు కూడా ఈ సమాచారాన్ని చేరవేయాలని కోరారు. "ఒక విద్యార్థి కనీసం ముగ్గురికి సైబర్ భద్రతపై అవగాహన కల్పిస్తే, ఆ ముగ్గురు మరో ముగ్గురికి తెలియజేస్తారు. ఈ విధంగా సమాజమంతా అప్రమత్తమైతే సైబర్ నేరాలను గణనీయంగా తగ్గించవచ్చు" అని సీఐ రాజేష్ పేర్కొన్నారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 జాతీయ సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, అలాగే సమీప పోలీస్ స్టేషన్ లేదా సైబర్ క్రైమ్ పోలీసులను వెంటనే సంప్రదించాలని సూచించారు. సకాలంలో స్పందిస్తే మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వివరించారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా వెంటనే ఫిర్యాదు చేస్తే పోలీసులు తక్షణ చర్యలు తీసుకుంటారని భరోసా ఇచ్చారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఎస్ఐ కీర్తిరాజుతో పాటు మిరుదొడ్డి, భూంపల్లి పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, సైబర్ క్రైమ్ సిబ్బంది, ప్రైవేట్ కళాశాల అధ్యాపకులు, వందలాది మంది విద్యార్థులు పాల్గొని సైబర్ భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల సహకారంతోనే సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని పోలీసులు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# ఆగస్టు 10న జైల్‌భరోను జయప్రదం చేయాలి

### తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ తొగుట మండల కమిటీ



**తోగుట, ఆగస్టు 5 (నినాదం):** సిద్ధిపేట జిల్లా తోగుట మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికులు ఆగస్టు 10న కేంద్ర,రాష్ట్ర కార్మిక సంఘాలు,ఎస్ఎకెఎం పిలుపు మేరకు "జైల్ భరో" కార్యక్రమంలో పాల్గొంటున్నారని ఎంపీడీఓ పి. వి. నర్సింహారెడ్డి కి గ్రామ పంచాయతీ కార్మికులు వినతిపత్రం అందించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్మిక సంఘం తోగుట మండల ప్రధాన కార్యదర్శి కె . మాణిక్యం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులు,సౌకర్యాలపై దాడి చేస్తూ యజమానులకు ప్రయోజనం కల్గించే విధంగా 2025 నవంబర్ 21న 4 లేబర్ కోడ్లను అమల్లోకి తెచ్చిందనీ, కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసిందనీ విమర్శించారు. వీటివల్ల కార్మికులు,ఉద్యోగులపై పని భారం పెరుగుతుందనీ,జీతభత్యాలు పెరగవు. ఉద్యోగ భద్రత ఉండదనీ ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల అమలు నీరుగారుతుందనీ,వీటిని దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయనీ తెలిపారు. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో మార్పులు చేసి, వ్యవసాయ కార్మికుల ఉపాధినీ దెబ్బతీస్తుందని విమర్శించారు. నూతన విద్యా విధానం వల్ల విద్యారంగం పూర్తిస్థాయి కార్పొరేటీకరణ అవుతోందనీ,విద్యుత్ సవరణ బిల్లు వల్ల వినియోగదారులపై భారం పడుతోందనీ,ప్రభుత్వ విద్యుత్ రంగం ప్రైవేట్ పరం చేయడం వలన ఉచిత విద్యుత్ కోల్పోతారని అన్నారు. రైతులు గిట్టుబాటు ధర ఇతర సమస్యలు ఎదుర్కొంటున్నారనీ వీటన్నింటికీ నిరసనగా దేశవ్యాప్తంగా అన్ని కేంద్ర,రాష్ట్ర కార్మిక సంఘాలు,సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో 2026 ఆగస్టు 10న జైల్ భరో కార్యక్రమానికి పిలుపునిచ్చాయి. తొగుట మండల పరిధిలోని అన్ని రంగాల కార్మికులతో గ్రామ పంచాయతీ కార్మికులు కూడా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రా కార్మికులు పోచయ్య, స్వామి, నర్సింలు, బాల్ రాజు, .నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## భూములు కోల్పోయిన రైతులకు
# ఇండ్ల స్థలాల పట్టాలు పంపిణీ



**కొడంగల్ ఆగస్టు 05(నినాదం) :** టి.జి.ఐ.సి. ఇండస్ట్రియల్ కారిడార్ భూ సేకరణలో భాగంగా భూములు కోల్పోయిన లగచర్ల, హకీంపేట్, పోలెపల్లి గ్రామాలకు చెందిన అర్హులైన రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇండ్ల స్థలాల పట్టాలను బుధవారం కొడంగల్ పట్టణంలోని రెడ్డి బసిరెడ్డి ఫంక్షన్ హాల్ లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి తిరుపతిరెడ్డి,జిల్లా కలెక్టర్ దీపక్ తివారి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశ్రామిక అభివృద్ధితో పాటు భూములు కోల్పోయిన రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా ఇండ్ల స్థలాల పట్టాలు అందజేయడం జరిగిందని తెలిపారు. ఇండ్ల స్థలాల పట్టాలు పొందిన రైతులు ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భూ సేకరణకు సంబంధించి ప్రభుత్వం ప్రకటించిన పునరావాస, పునర్నిర్మాణ చర్యలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. భూములు కోల్పోయిన రైతుల పునరావాసానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శక విధానంలో ఇండ్ల స్థలాలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. అందరి సహకారం తో 230 ఎకరాలలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఎడుకేషన్ హబ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. త్వరలోనే ఇండస్ట్రీయల్ పార్క్ వస్తుందని, 501 లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన పట్టాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. హైదరాబాద్ నుండి కొడంగల్ వరకు రేడియల్ రోడ్డు ఏర్పాటు కు మీ అందరి సహకారమందించాలన్నారు.

**భూములు కోల్పోయిన వారికి కేటాయించిన ఇళ్ళస్థలాల వివరాలు గ్రామాల ఇలా ఉన్నాయి:**

హకీంపేట్ (అసైన్డ్ భూములు): 175 మంది లబ్ధిదారులు, హకీంపేట్ (పట్టా భూములు): 113 మంది లబ్ధిదారులు,
- లగచెర్ల (అసైన్డ్ భూములు): 54 మంది లబ్ధిదారులు,
- లగచర్ల (పట్టా భూములు): 173 మంది లబ్ధిదారులు,
- పోలెపల్లి (అసైన్డ్ భూములు): 38 మంది లబ్ధిదారులు,

మొత్తంగా 432 మంది లబ్ధిదారులకు డ్రా పద్ధతిలో, 121 మంది లబ్ధిదారులకు నేరుగా (డైరెక్ట్ అలాట్‌మెంట్) ఇండ్ల స్థలాలు కేటాయించారు.. మొత్తం 553 మంది లబ్ధిదారులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయగా, ఇందుకోసం మొత్తం 77 సార్లు డ్రా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్ పి స్నేహ మెహర,జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారి, అదనపు ఎస్ పి రాజేష్‌మీనా, ఆర్ డి ఓ అనిత, మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్,యూత్ కాంగ్రెస్ జాతీయ నాయకులు ఎం. కృష్ణంరాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్య గౌడ్,హకీంపేట్, లగచర్ల, పోలె పల్లి సర్పంచ్ లు, రవీంద్ర, చంద్రయ్య, వెంకట్రాములు గౌడ్,సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ సైబర్ జాగ్రూక్త దివాస్

### సురక్షా కా తిరంగా సైబర్ స్వతంత్ర తెలంగాణ




**వికారాబాద్, ఆగస్టు 5(నినాదం ):** కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే సైబర్ జాగ్రూక్త దివాస్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్ బీ) ఆధ్వర్యంలో స్వాతంత్ర్య మాసోత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సురక్షా కా తిరంగా సైబర్ స్వతంత్ర తెలంగాణ కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్ బుధవారం జిల్లా పరిధిలోని తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘనంగా నిర్వహించిన సైబర్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ముందుగా తాండూర్ చౌరస్తా నుండి సెయింట్ మార్క్ స్కూల్ వరకు నిర్వహించిన భారీ సైబర్ అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం సెయింట్ మార్క్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సైబర్ అవగాహన సభలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్ది సైబర్ నేరాలు కూడా కొత్త రూపాల్లో పెరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ డిజిటల్ ప్రపంచంలో అప్రమత్తంగా వ్యవహరించడం అత్యంత అవసరమని తెలిపారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులు, నకిలీ పెట్టుబడి ఆఫర్లు, పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో వచ్చే మోసాలను నమ్మవద్దని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీ 1930బ్యాంక్ ఖాతా వివరాలు, ఎటిఎం పిన్ , సీవివి యూపీఐ పిన్ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ తెలియజేయవద్దని అన్నారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలు, ఫేక్ అకౌంట్లు, ఫిషింగ్ లింకులు, స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు వంటి సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయడం లేదా నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్ లో ఫిర్యాదు నమోదు చేయాలని తెలిపారు. విద్యార్థులు సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించుకొని, తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా ఈ విషయాలను తెలియజేయాలని, ప్రతి పౌరుడు బాధ్యతాయుతమైన డిజిటల్ పౌరుడిగా వ్యవహరిస్తేనే సైబర్ స్వతంత్ర తెలంగాణ లక్ష్యం సాధ్యమవుతుందని ఎస్పీ పేర్కొన్నారు. తాండూర్ మున్సిపల్ ఛైర్మన్ నీరజ బాల్ రెడ్డి మాట్లాడుతూ, సైబర్ నేరాలు ప్రతి కుటుంబాన్నీ ప్రభావితం చేసే స్థాయికి చేరుకున్న నేపథ్యంలో ఈలాంటి అవగాహన కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థులు, యువత, మహిళలు డిజిటల్ లావాదేవీలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, మోసపూరిత కాల్స్, నకిలీ పెట్టుబడి పథకాలు, అనుమానాస్పద లింకులను నమ్మవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ డీఎస్పీ ఎన్. యాదయ్య, తాండూర్ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్, రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి , డివిజన్ ఎస్ ఐ లు, పట్టణంలోని వివిధ స్కూల్స్ కి చెందిన స్టూడెంట్స్ ,వైస్ ఛైర్మన్ అబ్దుల్ రజాక్, మున్సిపల్ కౌన్సిలర్లు, పోలీసు అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు

### బ్లాక్ స్పాట్లు, క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎస్పీ



**నల్లగొండ ప్రతినిధి ఆగస్టు 5 (నినాదం):** జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ బుధవారం జిల్లాలోని ప్రమాదాలకు గురయ్యే బ్లాక్ స్పాట్స్ (ఆక్సిడెంట్ ప్రోన్ ఏరియాస్ ) ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్. హెచ్ 02,ఎన్. హెచ్ 167లో గల తరచూ ప్రమాదాలు జరుగు బ్లాక్ స్పాట్స్ అయినా వెల్‌కమ్ టూ మిర్యాలగూడ జంక్షన్, నందిపాడు ఎక్స్ రోడ్డు, చిల్లాపురం క్రాస్ రోడ్డు, చింతపల్లి క్రాస్ రోడ్డు, జంకుతాడా రోడ్డు, మిర్యాలగూడ అప్రోచ్ రోడ్డు ప్రాంతాలను సందర్శించి అక్కడ తరచూ ప్రమాదాలు జరగడానికి గల కారణాలను సంబంధిత అధికారులతో సమీక్షించారు. ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు, జీబ్రా క్రాసింగ్‌లు, సెంటర్ లైన్లు, రోడ్ మార్కింగ్‌లకు రీ–పెయింటింగ్, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు, సీసీ కెమెరాల ఏర్పాటు, బారికేడింగ్, రిఫ్లెక్టివ్ హెచ్చరిక బోర్డులు, దిశా సూచికలు, క్యాట్ ఐస్ ఏర్పాటు వంటి పనులను అత్యవసరంగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే అన్ని జంక్షన్ల వద్ద అక్రమ పార్కింగ్ పూర్తిగా తొలగించి వాహనాల రాకపోకలకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్, ట్రాఫిక్, పోలీసు మరియు ఇతర సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రమాదకర ప్రాంతాల్లో ఉన్న లోపాలను వెంటనే గుర్తించి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల్లో అనవసర జంక్షన్లు, అనధికారిక కట్స్ (రాజూవఅఆఅస్త్రం)సాధ్యమైనంత వరకు మూసివేయడం, అవసరమైన చోట మాత్రమే నియంత్రిత యూ–టర్న్‌లు కల్పించడం, ప్రమాదకర కూడళ్ల వద్ద ట్రాఫిక్ పోలీసు సిబ్బందిని అధిక సంఖ్యలో నియమించి వాహనాల రాకపోకలను నియంత్రించడం, ట్రాఫిక్ ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించడం, రద్దీ సమయాల్లో ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో మిర్యాలగూడ ఇంచార్జ్ డిఎస్పీ రవి,సీఐ లు పి. ఎన్. డి ప్రసాద్, సోమనర్సయ్య, నాగభూషణ్,నాగరాజు, ఎస్.ఐ లక్ష్మయ్య,డి. టి. ఆర్. బి ఇంచార్జ్ రిటైర్డ్ సీఐ అంజయ్య, సంబంధిత రోడ్డు భద్రత అధికారులు ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ ,ఎక్సైజ్,ట్రాన్స్ పోర్ట్ అధికారులు,మరియు స్థానిక ప్రజలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నినాదం

గురువారం 6 ఆగస్టు 2026

తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం


# జీఎం పాదయాత్రలు బంద్.. సమస్యలు యథాతథం

## జీఎం అడుగు కోసం ఎదురుచూపులు

**మంచిర్యాల, ఆగస్టు 5 (నినాదం):** ఒకప్పుడు సింగరేణి శ్రీరాంపూర్ ఏరియాలో జనరల్ మేనేజర్ (జీఎం) పాదయాత్రలు కార్మికులకు, వారి కుటుంబాలకు పెద్ద భరోసాగా ఉండేవి. కాలనీల్లోకి స్వయంగా వెళ్లి సమస్యలను తెలుసుకోవడం, అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు ఇవ్వడం, పరిష్కారానికి గడువు నిర్ణయించడం వంటి చర్యలతో ప్రజల్లో విశ్వాసం ఉండేది. అయితే ఇటీవల కాలంలో అలాంటి పాదయాత్రలు పూర్తిగా నిలిచిపోవడంతో కార్మిక వాడల్లో సమస్యలు ఎక్కడికక్కడే పేరుకుపోతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాలనీల్లో దెబ్బతిన్న రోడ్లు, మూసుకుపోయిన డ్రైనేజీలు, తాగునీటి సరఫరాలో అంతరాయం, వీధి దీపాల సమస్య, చెత్త తొలగింపులో నిర్లక్ష్యం, దోమల బెడద, పారిశుద్ధ్య లోపాలు వంటి సమస్యలు నెలల తరబడి కొనసాగుతున్నా వాటిని ప్రత్యక్షంగా పరిశీలించే పరిస్థితి కనిపించడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో జీఎం పాదయాత్ర నిర్వహించిన సమయంలో కార్మికులు నేరుగా తమ సమస్యలను చెప్పుకునే అవకాశం ఉండేది.



చిన్న సమస్యలైనా వెంటనే పరిష్కారం దొరికేది. ఇప్పుడు మాత్రం అధికారులు కార్యాలయాలకే పరిమితమవడంతో సమస్యల పరిష్కారం ఆలస్యమవుతోందని పలువురు పేర్కొంటున్నారు. ప్రతి కాలనీకి ప్రత్యేక సమస్యలు ఉన్నప్పటికీ వాటిపై సమగ్ర సమీక్షలు లేకపోవడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మారుస్తోందని కార్మిక సంఘాల నాయకులు చెబుతున్నారు. అధికారులు పత్రాలపై సమీక్షలు నిర్వహించడం కంటే క్షేత్రస్థాయిలో పర్యటిస్తేనే అసలు పరిస్థితి తెలుస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. డ్రైనేజీలు, రోడ్లపై నీరు నిల్వ ఉండడం, దోమల విజృంభణ, పారిశుద్ధ్య సమస్యలతో కార్మిక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. చిన్నారులు, వృద్ధులు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని చెప్పే సింగరేణి యాజమాన్యం, కాలనీల్లోని వాస్తవ పరిస్థితులపై కూడా అదే స్థాయిలో దృష్టి సారించాలని కార్మికులు కోరుతున్నారు. జీఎం పాదయాత్రలను మళ్లీ ప్రారంభించి ప్రతి కాలనీని సందర్శిస్తూ సమస్యలను గుర్తించి, పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. లికార్మికుల ప్రశ్న ఒక్కటే... జీఎం పాదయాత్రలు మళ్లీ ఎప్పుడు ప్రారంభమవుతాయి? మా సమస్యలు వినేది ఎవరు? అనే ప్రశ్న ఇప్పుడు శ్రీరాంపూర్ ఏరియా కార్మిక వాడల్లో బలంగా వినిపిస్తోంది. క్షేత్రస్థాయి పర్యటనలు పునఃప్రారంభమైతేనే సమస్యల పరిష్కారం వేగవంతమవుతుందని కార్మికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# పట్టుదలతో చదివితే ఉద్యోగం సాధ్యం

## బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి



**మంచిర్యాల, ఆగస్టు 5 (నినాదం):** ఉద్యోగ లక్ష్యంతో కష్టపడి చదివితే మీ సొంతం అవుతుందని బీజే పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి పేర్కొన్నారు. బుధవారం సేవా భారతి–ఏకలవ్య ఆశ్రమం ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న ఉచిత పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ శిక్షణా కార్యక్రమం మంచిర్యాల పట్టణం లోని గోదావరి రోడ్డులో ఉన్న ఏకలవ్య ఆశ్రమంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా శిక్షణకు ఎంపిక కోసం వచ్చిన అభ్యర్థులతో మాట్లాడారు. ఉచితంగా కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పట్టుదలతో చదివి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. ఉత్తమ శిక్షకుల ద్వారా నాణ్యమైన శిక్షణ అందించి ఎక్కువ మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏకలవ్య ఆశ్రమం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఆనంద్‌రావు, శ్రీనివాస్, అంజి, సేవా భారతి సభ్యులు పాల్గొన్నారు.

## పదవి విరమణ పొందిన

# ఉపాధ్యాయులకు సన్మానం



**మంథని ఆగస్టు 5 (నినాదం) :** ఇటీవల పదవి విరమణ పొందిన విశ్రాంత ఉపాధ్యాయులు బిరుదు మధు, బోనాల రవీందర్ లకు పెంజెరుట్ట కమిటీ ఆధ్వర్యంలో లోకే మనోహర్, టేక్కొగారి రాధాకృష్ణన్ లు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఎంతో మంది విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసిన వీరి సేవలను ఈ సందర్భంగా పలువురు వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది కేతిరెడ్డి రఘోతం రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గోటికార్ కిషన్ జి, మంథని రమేష్, రాంపల్లి లక్ష్మణ్, పల్లి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ భద్రతపై రైతులకు అవగాహన

**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, ఆగస్టు 5(నినాదం) :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, కాగజ్నగర్ మండలంలోని నజరూల్ నగర్ విలేజ్ నంబర్––1లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం కాగజ్నగర్ డివిజనల్ ఇంజనీర్ వీరేశ ఆధ్వర్యంలో 'పొలం బాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వదులుగా ఉన్న విద్యుత్ వైర్లను సరిచేయడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు పొలాల్లోని మోటార్లకు అతుకులు లేని నాణ్యమైన వైర్లను ఉపయోగించాలని, స్టార్టర్ బాక్సులను ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలని సూచించారు. మోటార్లకు కెపాసిటర్లు అమర్చడం వల్ల వోల్టేజ్ హెచ్చు తగ్గులు తగ్గి మోటార్లు కాలిపోకుండా రక్షణ కలుగుతుందని డీఈ వీరేశ వివరించారు. వర్షాకాలంలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో ఉండకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని, అప్రమత్తంగా ఉంటే విద్యుత్ ప్రమాదాలను నివారించవచ్చని ఆయన రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్




డివిజనల్ ఇంజనీర్ ఇర్ఫాన్ అహ్మద్, కాగజ్‌నగర్ రూరల్ సబ్ ఇంజనీర్ ప్రసాద్, సబ్ డివిజన్ సబ్ ఇంజనీర్ ఆశారాణి, ఫోర్‌మన్ విలాస్, లైన్ ఇన్‌స్పెక్టర్ ఎం.జి. సతీష్, లైన్‌మన్ మోహన్‌తో పాటు విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# కేంద్ర విధానాలపై సీఐటీయూ సమరశంఖం

## ఆగస్టు 10 'జైలు భరో'కు భారీ సమీకరణ పిలుపు



**సుల్తానాబాద్, ఆగస్టు 05 (నినాదం):** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, రైతు, ప్ర జా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవా లని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాల యం ఎదుట కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ నాలుగు లేబర్ కో డ్స్, విద్యుత్ సవరణ చట్టం, ఉపాధి హామీ పథ కంలో మార్పులు, పెరుగుతున్న నిత్యావసర ధ రలు ప్రజలపై తీవ్ర భారం మోపుతున్నాయని వి మర్శించారు. ఆగస్టు 10న పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ నుంచి ఉదయం 10 గంటలకు నిర్వ హించే 'జైలు భరో' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్మికులు, రైతులు, వ్యవసాయ కూ లీలు, ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. కార్య క్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ తాండ్ర అంజయ్య, న్యాతరి రమేష్, చిలుముల రామ్మూర్తి, శ్రీనివాస్, లక్ష్మి, లత తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్ పాస్టర్స్ అసోసియేషన్

# అధ్యక్షులుగా కాంపెల్లి దాస్



**మంథని, ఆగస్టు 5 (నినాదం) :** మంథని డివిజన్ యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులుగా పాస్టర్ కాంపల్లి దాస్ ఎన్నికయ్యారు. బుధ వారం మంథని మండలం సిరిపురం గ్రామంలోని సెనగోగు ప్రార్థన మందిరంలో మంథని డివిజన్ లోని పాస్టర్లు సమావేశమై బ్యాలెట్ ద్వారా ఎన్నికల నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా పాస్టర్ కాలువల సామ్యూల్, ప్రధాన కార్యదర్శిగా పాస్టర్ జాన్ పాల్, సహాయ కార్యదర్శిగా పాస్టర్ సిరిపురం అబ్రహం, కోశాధికారిగా పాస్టర్ సాత్విక్, కార్యవర్గ సభ్యులుగా పాస్టర్ ఎలీషా, పాస్టర్ దూడ మహేష్‌లు ఎన్నికైయ్యారు. ఈ సమావేశంలో మంథని డివిజన్ లోని పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గంగమ్మ తల్లి బోనాల జాతర వేడుకలు..

## బోనాల వేడుకల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్న ప్రముఖులు

**మంథని, ఆగస్టు 5 (నినాదం) :** గంగమ్మ తల్లి బోనాల జాతర వేడుకలను గంగపుత్ర బెస్తలు బుధవారం అంగరంగ వైభవంగా ఘనంగా జరుగుపుకున్నారు. ప్రత్యేకంగా ఆలంకరించిన పల్లకిలో శ్రీ గంగామాత విగ్రహాన్ని ఉంచి కొబ్బరికాయ కొట్టి గంగమ్మ తల్లి బోనాల వేడుకను ప్రారంభించారు. గంగాపుత్ర బెస్తలు తమ సంప్రదాయ వృత్తి అయిన చేపలు పట్టే పెద్ద వలన అందంగా ఆలంకరించి ప్రదర్శిస్తుండగా, మహిళలు నెత్తిన బోనాలు ఎత్తుకొని ర్యాలీగా గోదావరి వరకు తరలి వెళ్లారు. ర్యాలీలో భాగంగా ప్రధాన రస్తాలో డీజే సౌండ్స్?తో పాటు సంప్రదాయల నృత్యాలు చేయడంతో పాటు చేపలు పట్టే విధానాలను ప్రదర్శించారు. అదే విధంగా డప్పు కళాకారులతో సైతం ప్రత్యేక నృత్యాలు చేశారు. గంగపుత్ర బెస్తలు నిర్వహించిన బోనాల వేడుకలను పట్టణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆనంతరం గోదావరి తీరం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గద్దెపై గంగమ్మ తల్లి, గౌరమ్మ, మత్స్యగిరింద్ర, చేప, తాబేలు ప్రతిమలను పెట్టి వివిధ రకాల పూలు, పసుపు, కుంకుమలతో ప్రత్యేకంగా పూజించారు. ఆనంతరం గంగ, గౌరమ్మలతో పాటు మత్స్యగిరింద, చేప, తాబేలు ప్రతిమలను గోదావరిలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి సమర్పించిన బోనాలను గంగాపుత్రులు ప్రసాదంగా స్వీకరించడంతో పాటు సహపంక్తి భోజనాలు చేశారు. గంగమ్మ తల్లి బోనాల వేడుకల్లో మంథని



మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్రనాయకులు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, చల్లా నారాయణరెడ్డిలు పాల్గొని బోనం ఎత్తుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గంగమ్మ తల్లి బోనాల వేడుకలు ఇంత పెద్ద ఎత్తున జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు, గంగమ్మ తల్లి దీవేనలు మంథని ప్రాంత ప్రజలపై, గంగపుత్రుల ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గంగాపుత్ర సంఘం నాయక గంధం వెంకటస్వామి, అంకరి ప్రకాశ్, అంబటి సతీష్, బోయిని నారాయణ, అంబటి శ్రీనివాస్, గట్టయ్య, సొల్ల స్వామి, అటికేటి నరేష్, అంకరి శివమురళీ, అటికేటి కోటేష్, మోసం నర్సయ్య, జీదుల రాజేందర్, మోసం శంకర్‌లు పాల్గొన్నారు.

## యుద్ధప్రాతిపదికన

# పైప్‌లైన్ మరమ్మతు

రేపటి నుంచి యథావిధిగా తాగునీటి సరఫరా

శివాలయం వద్ద స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

ప్రజల భద్రతకు మున్సిపాలిటీ చర్యలు

మున్సిపల్ చైర్ పర్సన్ బిరుదు రాధాకృష్ణ

**సుల్తానాబాద్, ఆగస్టు 05 (నినాదం):** సుల్తానాబాద్ పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు, నూతన అమృత్ తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ ప నులు కొనసాగుతున్న నేపథ్యంలో గట్టేపల్లి ప్రధా న పైప్‌లైన్ దెబ్బతిని పట్టణంలో తాగునీటి సరఫ రాకు తాత్కాలిక అంత రాయం ఏర్పడింది. విష యం తెలుసుకున్న మున్సి పల్ చైర్పర్సన్ బిరుదు రాధాకృష్ణ, కమిషనర్ టి. రమేష్ సంఘటనా స్థలా న్ని పరిశీలించి, మున్సిపల్ సిబ్బందితో యుద్ధ ప్రా తిపదికన మరమ్మతు పనులు పూర్తి చేయించా రు. మరమ్మతు పనులు విజయ వంతంగా పూర్తి కావడంతో గురువారం నుంచి పట్టణంలో యథా విధిగా మంచినీటి సరఫరా పునరుద్ధరించనున్న ట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. అదేవిధం గా, శివాలయం సమీప రహదారిపై వాహనాల రాకపోకల వల్ల ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఉండేందుకు ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చిం తకుంట విజయ రమణారావు



ఆదేశాల మేరకు చైర్పర్సన్ బిరుదు రాధాకృష్ణ పర్యవేక్షణలో ప్లాస్టిక్ స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. ఈ చర్యతో రహ దారిపై ప్రయాణించే వాహనదారులు, పాదచారు లకు మరింత భద్రత కలగనుంది. ఈ కార్యక్రమం లో వైస్ చైర్పర్సన్ అంతటి పుష్పలత, వార్డు కౌన్సిలర్లు గాజుల రాయమల్లయ్య, ఊట్ల వర ప్రదీప్, సిద్ధ తిరుపతి, తొర్రికొండ ప్రభాకర్ తదిత రులు పాల్గొన్నారు.

# కమాన్‌పూర్‌లో కుక్కలు, కోతుల బెడద..

## సమస్య పరిష్కారానికి వినతి..

**కమాన్‌పూర్, ఆగస్టు 05 (నినాదం):** కమాన్‌పూర్ మండలం లో వీధి కుక్కలు, కోతుల సంచారం పెరగడంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. బుధవారం రెండు వేర్వేరు ఘటనల్లో కుక్కలు ద్విచక్ర వాహనాలకు అడ్డుగా రావడంతో వాహనదారులు కిందపడిపోయి గాయపడ్డారు. మరో ఘటనలో ఎండి సమీర్ నాలుగేళ్ల కుమారుడి పై కుక్క దాడి చేయడంతో బాలుడి ముఖానికి గాయాలయ్యాయి. అలాగే మండల కేంద్రానికి చెందిన మంథని నరేష్‌పై కోతులు దాడి చేసి కరిచాయి. ఈ ఘటనల నేపథ్యంలో స్పందించిన కమాన్‌పూర్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, కమాన్‌పూర్ గ్రామ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ, వీధి కుక్కలు, కోతుల



సమస్య ఒక్క గ్రామానికే పరిమితం కాకుండా, మండల వ్యాప్తంగా ప్రజలను ఇబ్బంది లకు గురిచేస్తోం దని తెలిపారు. ఈ సమస్యను మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) సాదినేని ప్రియాంక దృష్టికి తీసుకెళ్లి చర్చించినట్లు వెల్లడించారు. ఎంపీడీవో సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ వీధి కుక్కల నియంత్రణ, కోతుల బెడద నివారణకు తగిన చర్యలు వేగవంతం చేయాలని సంబంధిత శాఖలను కోరినట్లు పేర్కొన్నారు. మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చిన్నారులు ఒంటరిగా బయట తిరగకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక ప్రజాప్రతినిధులు సూచించారు.

# త్వరలో తహసిల్దార్ కార్యాలయం ప్రారంభం..!!

**కమాన్పూర్ ఆగస్టు 5 (నినాదం):** పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రంలో సుమారు రూ. 75 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ భవనాన్ని బుధవారం తహసీల్దార్ ముస్త్యాల వాసంతి, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గాండ్ల మోహన్, మల్యాల తిరుపతి పరిశీలించారు. గత కొన్ని సంవత్సరాలుగా తహసీల్దార్ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతుండటంతో, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవ తీసుకుని నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. మంత్రి ఆదేశాల మేరకు గుత్తేదారు భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేశారు. ఈ నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని త్వరలోనే మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా వైభవంగా ప్రారంభించనున్నట్లు నాయకులు తెలిపారు.



# తల్లిపాలే శిశువుకు తొలి టీకా

## కొత్తపల్లిలో తల్లిపాల వారోత్సవాలు ఘనం



**భీమదేవరపల్లి, ఆగస్టు 5 (నినాదం):** శిశువు ఆరోగ్యానికి తల్లిపాలే తొలి టీకా, సంపూర్ణ పోషకాహారమని సీడీపీఓ దుగ్యాల స్వరూపరాణి పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు ఇవ్వడం, తొలి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలే అందించడం వల్ల రోగనిరోధక శక్తి పెరిగి శిశువు ఆరోగ్యంగా ఎదుగుతాడని తెలిపారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కుటుంబ సభ్యులు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, విశ్రాంతి, అవసరమైన వైద్య సేవలు అందించాలని కోరారు. గ్రామ సర్పంచ్ సిక ప్రదీప్ మాట్లాడుతూ, ప్రతి తల్లి తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించి శిశువులకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని పిలుపునిచ్చారు. గ్రామంలో తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణకు గ్రామపంచాయతీ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. గ్రామ వైద్యుడు డాక్టర్ దినేష్ మాట్లాడుతూ, తల్లిపాలు శిశువు మెదడు ఎదుగుదల, శారీరక వికాసం, రోగనిరోధక శక్తి పెంపుదలకు ఎంతో కీలకమని చెప్పారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లి ఆరోగ్యానికీ మేలు జరుగుతుందని, తల్లి––శిశువు మధ్య భావోద్వేగ బంధం మరింత బలపడుతుందని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, గ్రామస్థులు పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన పొందారు.

# సింగరేణి అభివృద్ధికి కేంద్రం అండ

## పీకేఓసీ 2 డీప్ సైడ్ కోల్ బ్లాక్ కేటాయింపుపై హర్షం

**మంచిర్యాల, ఆగస్టు 5 (నినాదం):** సింగరేణి సంస్థ ఆదాయాన్ని పెంచడంతో పాటు రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం మణుగూరు పీకేఓ సీ –2 డిప్ సైడ్ కోల్ బ్లాక్ వేలం నిర్వహించకుండా నేరుగా సింగరేణి సంస్థకు కేటాయించిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి పేర్కొన్నారు. ఈ నిర్ణయానికి గుర్తుగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ బుధవారం శ్రీరాంపూర్ సింగరేణి ఆర్‌కే–7 గనిలో కార్మికులను కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం సింగరేణి సంస్థ బలోపేతానికి నిరంతరం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఇటీవల తాడిచెర్ల–2 కోల్ బ్లాక్ కేటాయించిన అనంతరం తాజాగా మణుగూరు పీ కే ఓ సీ 2 డిప్ సైడ్ కోల్ బ్లాక్‌ను కూడా ఎలాంటి వేలం ప్రక్రియ లేకుండానే సింగరేణికి కేటాయించడం సంస్థపై కేంద్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. ఈ కోల్ బ్లాక్ ద్వారా సుమారు 30 సంవత్సరాల పాటు 180 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగే అవకాశం ఉందని తెలిపారు. దీని ద్వారా సింగరేణి సంస్థకు సుమారు రూ. 42,360 కోట్ల ఆదాయం, రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 10,500 కోట్ల ఆదాయం సమకూరడంతో పాటు దాదాపు 2 వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో గతంలో ఒడిశాలోని నైని కోల్ బ్లాక్, తెలంగాణలో తాడిచెర్ల–2, తాజాగా మణుగూరు పీకేఓ సీ –2 కోల్ బ్లాక్‌లు సింగరేణి సంస్థకు కేటాయించబడ్డాయని పేర్కొన్నారు. ఈ మూడు కోల్ బ్లాక్‌ల ద్వారా మొత్తం 860 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, సుమారు 6,500 మందికి ఉపాధి, సింగరేణికి రూ. 1,95,



510 కోట్ల ఆదాయం, రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 48 వేల కోట్లకు పైగా ఆదాయం లభించే అవకాశం ఉందని తెలిపారు. సింగరేణి సంస్థ అభివృద్ధి, రాష్ట్ర ఆర్థిక ప్రగతి, యువతకు ఉద్యోగావకాశాల కల్పనలో కేంద్ర ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తోందని రఘునాథ్ వెరబెల్లి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సత్రం రమేష్, కుర్రె చక్రవర్తి, కమలాకర్ రావు, ఎనగందుల కృష్ణమూర్తి, పట్టి వెంకట కృష్ణ, ఆనంద్ కృష్ణ, ఈర్ల సదానంద, పొన్నవేణి సదయ్య, కాదాసు భీమయ్య, గొల్ల మహేందర్, కొండ వెంకటేష్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గురువారం । తెలంగాణ
6 ఆగస్టు 2026
నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

## పట్టణ ప్రగతి మా ప్రభుత్వ లక్ష్యం



**అచ్చంపేట ఆగస్టు 5 (నినాదం):** మార్నింగ్ వాక్ లో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే వంశీకృష్ణనగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని వివిధ వార్డులలో ఎమ్మెల్యే వంశీకృష్ణ మార్నింగ్ లో భాగంగా ప్రజల ను తమ వార్డు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అచ్చంపేట పట్టణంలోని 4వ వార్డు చింతల్ బస్తిలో స్థానిక మున్సిపల్ చైర్మన్, మాజీ ఎంపీపీ రామనాథం తో కలిసి ఎమ్మెల్యే వంశీకృష్ణ పర్యటించారుబస్తిలోని ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని, రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు తదితర మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అచ్చంపేట పట్టణాన్ని సమగ్ర పట్టణ ప్రణాళికలో భాగంగా అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువస్తామనీ చెప్పారు. ఇప్పటికే వివిధ వార్డులలో అభివృద్ధి పనుల గురించి సీసీ రోడ్లు డ్రైనేజీ వ్యవస్థ వీధి దీపాలు తదితర పనులు వేగంగా సాగుతున్నాయని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఖాదర్, కౌన్సిలర్ ఆకుల వెంకటేష్, విష్ణువర్ధన్ రెడ్డి, మల్లేష్, హలరాజు, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు

## అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు



**హుస్నాబాద్ ఆగస్టు 5 (నినాదం):** హుస్నాబాద్ మండలం గాంధీనగర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాల వారోత్సవాలు, అన్నప్రాసన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పోలు సంపత్ చేతుల మీదుగా అంగన్వాడీ చిన్నారులకు యూనిఫార్మ్‌లను పంపిణీ చేశారు. అనంతరం గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ, తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ ఆహారమని, మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం ద్వారా పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఎదుగుతారని అన్నారు. గర్భిణీలు, బాలింతలు పాలు, గుడ్లు, ఆకుకూరలు, పప్పుధాన్యాలు, పండ్లు వంటి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారం, ఆరోగ్య సేవలు, చిన్నారుల సంక్షేమ కార్యక్రమాలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకుని అంగన్వాడీ కేంద్రాలను తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని కోరారు. అంగన్వాడీ టీచర్ లక్ష్మి మాట్లాడుతూ, గర్భిణీలు, బాలింతలు క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రానికి వచ్చి ప్రభుత్వం అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని, తల్లిపాల ప్రాముఖ్యతను ప్రతి కుటుంబం గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, గ్రామ కార్యదర్శి, గ్రామస్తులు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, అంగన్వాడీ చిన్నారులు పాల్గొన్నారు.


## రోడ్డు నిబంధనలతోనే ప్రాణాలకు రక్షణ –ఎస్ఐ




**వేములపల్లి,ఆగస్టు 5 (నినాదం):** ప్రతి ఒక్క వాహనదారుడు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే రహదారి ప్రమాదాల బారిన పడకుండా తమ ప్రాణాలను కాపాడుకోగలరని వేములపల్లి ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో వాహనదారులకు ప్రత్యేకంగా రోడ్డు భద్రతా అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అలాగే నాలుగు చక్రాల వాహనాలు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, ప్రయాణంలో మొబైల్ ఫోన్ మాట్లాడడం లాంటి నిర్లక్ష్యపు చర్యల వల్ల ఘోర ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయే ముప్పు ఉందని హెచ్చరించారు. ఇటీవల జరుగుతున్న ద్విచక్ర వాహన ప్రమాదాల్లో హెల్మెట్ ధరించకపోవడం వల్లే అత్యధికంగా మరణాలు సంభవిస్తున్నాయని, ఈ విషయాన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ వాడాలని కోరారు. మైనర్లకు తల్లిదండ్రులు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వకూడదని, ఒకవేళ ఇస్తే పిల్లలతో పాటు తల్లిదండ్రులపై కూడా చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం కలవరపెడుతోందని, తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని సూచించారు. అలాగే సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు వహిస్తే ఆర్థిక నష్టాలను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు పుట్టల సందీప్‌కుమార్, పెదపంగ సైదులు, దేశిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వాహనదారులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞానానికి నిలయం.. యువతకు మార్గదర్శి గ్రంథాలయం

### హుజూర్‌నగర్ ప్రభుత్వ గ్రంథాలయాన్ని పరిశీలించిన జిల్లా సెక్రటరీ రామచంద్ర నాయక్



**హుజూర్‌నగర్,ఆగస్టు 05 (నినాదం ):** పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు ప్రభుత్వ గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరమైన వేదికలని, వాటిని మరింత సమర్థవంతంగా వినియోగించేలా సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా సెక్రటరీ రామచంద్ర నాయక్ అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ ప్రభుత్వ గ్రంథాలయాన్ని ఆయన పరిశీలించి, అక్కడి పాఠకులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ అభ్యర్థులు ప్రభుత్వ సెలవు రోజుల్లో కూడా గ్రంథాలయాన్ని తెరిచి ఉంచాలని కోరుతూ ఆయనకు స్థానికులు వినతిపత్రం అందజేశారు. వినతిపై స్పందించిన రామచంద్ర నాయక్, సంబంధిత ఉన్నతాధికారులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే విద్యార్థులు, నిరుద్యోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని గ్రంథాలయ పని వేళలను ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయం అనేది కేవలం పుస్తకాలు చదివే స్థలం మాత్రమే కాకుండా, జ్ఞానాన్ని పెంపొందించే కేంద్రం, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు నిత్య అధ్యయన వేదిక అని అన్నారు. ప్రశాంతమైన వాతావరణం, పుస్తకాల అందుబాటు, దినపత్రికలు, పోటీ పరీక్షల మెటీరియల్ వంటి సౌకర్యాలను యువత సద్వినియోగం చేసుకుంటే జ్ఞానవంతులే కాకుండా ప్రయోజకుల అవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జి శ్రీధర్ రెడ్డి, ఉద్యోగ అభ్యర్థులు, పాఠకులు పాల్గొన్నారు.

# బోడేపూడి జీవితం నేటి తరానికి ఆదర్శం

### సిపిఐ(ఎం) రాష్ట్ర సీనియర్ నాయకులు పి.సోమయ్య



**వైరా, ఆగస్టు 5, (నినాదం):** రైతు బాంధవుడు అమరజీవి కామ్రేడ్ బోడేపూడి వెంకటేశ్వరరావు జీవితం నేటి తరానికి ఆదర్శం అని సిపిఐ(ఎం) రాష్ట్ర సీనియర్ నాయకులు పి. సోమయ్య అన్నారు. సిపిఐ(ఎం) వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మాజీ శాసనసభ్యులు, శాసనసభా పక్ష నాయకుడు, అమరజీవి కామ్రేడ్ బోడేపూడి వెంకటేశ్వరరావు 29వ వర్ధంతి పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్ అధ్యక్షతన స్థానిక మిట్టపల్లి గార్డెన్ లో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా బోడేపూడి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో టి. సోమయ్య మాట్లాడుతూ నేడు దేశంలో, రాష్ట్రంలో పాలకులు ప్రజా వ్యతిరేక విధానాలు, రైతుల పట్ల పాలకులు అమలు చేస్తున్న రైతు వ్యతిరేక చట్టాలు రైతులకు గుదిబండగా ఉన్నాయని విమర్శించారు. రైతులు వ్యవసాయం చేయడానికి అనేక సమస్యలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. గిట్టుబాటు ధరలు లేక, వ్యవసాయంపై ప్రభుత్వాలు పెట్టిన ఆంక్షల వలన రైతులు పంటలు పండించడానికి, విత్తనాలు కొనే దగ్గర నుండి పంటను అమ్ముకునే వరకు అనేక రూపాల్లో నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు వ్యతిరేక అనేక ఆంక్షలు నేడు పాలకుల పాలనలో కనిపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో రైతాంగ సమస్యలు ఎక్కడుంటే అక్కడ రైతుల కోసం పనిచేసిన ఒక నిజాయితీ గల ప్రజాప్రతినిధిగా, రైతు బాంధవుడుగా పేరు తెచ్చుకున్న బోడెపూడి వెంకటేశ్వరావు ధన్యజీవి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ, వైరా రూరల్ కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు, కొణిజర్ల మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, నాయకులు మచ్చా మణి, తోట నాగేశ్వరావు, తూము సుధాకర్, గుడిమెట్ల రజిత, పైడిపల్లి సాంబశివరావు, కొంగర సుధాకర్, మల్లెంపాటి రామారావు, హరి వెంకటేశ్వరావు, కామినేని రవి, గుమ్మా నరసింహారావు, రాచబంటి బత్తిరన్న, తోట కృష్ణవేణి, షేక్ నాగుల్ పాషా, పారుపల్లి శ్రీనాథ్ బాబు, బాజోజి రమణ, శాఖా కార్యదర్శులు, పార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ పాలు ముద్దు ,డబ్బా పాలు వద్దు

### నేటి బాలలే రేపటి పౌరులు
### తోగ్గూడెం లో జరిగిన తల్లి పాల వారోత్సవాలులో పాల్గొన్న సర్పంచ్ కుంజా వినోద్






**ములకలపల్లి, ఆగస్టు 05 (నినాదం ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజకవర్గం ములకలపల్లి మండలం (జగన్నాధపురం) తోగ్గూడెం గ్రామంలో నిర్వహించిన. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుంజా వినోద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుంజా వినోద్ మాట్లాడుతూ, తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ ఆహారమని, పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల శిశువు ఆరోగ్యంగా ఎదగడంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. ప్రతి తల్లి తొలి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలను మాత్రమే అందించాలని, అనంతరం పోషకాహారంతో పాటు రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను కొనసాగించాలని సూచించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రతి కుటుంబంలో అవగాహన పెరగాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తల్లిపాలే బలమైన పునాది అని పేర్కొన్నారు. అనంతరం జరిగిన శ్రీమంతం కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించారు తదుపరి తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు సెక్రటరీ సునీష్ స్కూల్ హెచ్ యమ్ రమాదేవి అంగన్వాడీ సూపర్ వైజర్ భవాని జగన్నాధపురం కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ చేకుర్తి రామాచారి కాంగ్రెస్ సీనియర్ నాయకులు సోయం బోడప్ప గాదెగోని జగదీష్ స్థానిక బి యల్ ఎ ,సున్నం నాగేష్ మిడియం నారాయణ ,కూరం రామకృష్ణ ములకలపల్లి మండల బియల్ఎ కోఆర్డినేటర్ ,సురభి రాజేష్ యన్ యస్ యు ఐ మండల అధ్యక్షుడు ,గుంట్రు సాయి పూనెం వెంకటేష్ జగన్నాధపురం సోషల్ మీడియా అధ్యక్షులు అంగన్వాడి టీచర్లు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వద్దు, స్టీల్ వస్తువులు ముద్దు





వెల్దుర్తి, ఆగస్టు 5 (నినాదం): మాసాయిపేట మండలంలోని మాసాయిపేట గ్రామపంచాయతీలో ప్లాస్టిక్ వస్తువులు, వాడొద్దని స్టీల్ వస్తువులు, వాడాలని భోజనానికి, మంచినీరు త్రాగడానికి, గ్రామ కార్యదర్శి ఆలోచించి సర్పంచ్ వీరన్న గారి కృష్ణారెడ్డి అనుసరించి 15? వేల రూపాయలు సుమారు ఖర్చు అయిందని గ్రామ కార్యదర్శి తెలిపారు అదే విధంగా గ్రామ సర్పంచ్ వీరన్న గారికి కృష్ణారెడ్డి జిల్లా పంచాయతీ శాఖ అధికారి ఆధ్వర్యంలో ప్రారంభం చేశారు అనంతరం మాసాయిపేట మండలం లో పనిచేస్తున్న ఎంపీడీవో, వివిధ గ్రామాల కార్యదర్శులు, సమక్షంలో గ్రామ సర్పంచ్ వీరన్న గారి కృష్ణారెడ్డి అధికారికి శాలువాతో సన్మానం చేశారు, అనంతరం తిరిగి గ్రామ సర్పంచ్ వీరన్న గారి కృష్ణారెడ్డిని శాలువాతో సన్మానం చేశారు అదే విధంగా మాసాయిపేట అభివృద్ధి కోసం చాలా విషయాలు భవనాల గురించి చాలా అభివృద్ధి కోసం జిల్లా అధికారితో చర్చించారు జిల్లా అధికారి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విగ్నేశ్వర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి వార్డు సభ్యులు, పెరమండ రమేష్, ప్రశాంత్, సఫాయి కార్మికులు తదితరులు ఉన్నారు


# సోషలిజం అజేయం..పోరాటాల ద్వారానే అది సాధ్యం





**వైరా ఆగస్టు 5 (నినాదం ):** సిపిఎం పార్టీ కొణిజర్ల, వైరా టౌన్, వైరా రూరల్ మండలాల పార్టీ సభ్యుల రాజకీయ శిక్షణా తరగతులు బుధవారం వైరా మిట్టపల్లి గార్డెన్ లో ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు జరగనున్న ఈ శిక్షణా తరగతులను పార్టీ సీనియర్ నాయకులు వనమా చిన్న సత్యనారాయణ జండా ఆవిష్కరణ చేసి ప్రారంభించారు. ప్రిన్సిపాల్ గా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ వ్యవహరించారు. పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు పి సోమయ్య కమ్యూనిస్టు పార్టీ మూల సూత్రాలు నిర్మాణం అనే అంశంపై బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషలిజం అజేయం, అసమానతలు లేని సమాజాన్ని స్థాపించటమే కమ్యూనిస్టుల లక్ష్యంగా పనిచేయాలన్నారు. కమ్యూనిస్టు పార్టీ పేద ప్రజల, రైతుల, కార్మికుల అసమానతలకు గురయ్యే ప్రజలందరి కోసం పనిచేస్తుందన్నారు. మధ్యాహ్నం రాజకీయ విద్యా విభాగం జిల్లా బాధ్యులు బోడ పట్ల రవీందర్ మతం మతోన్మాదం అనే అంశంపై బోధించారు. భారతదేశంలో ఒక క్రమ పద్ధతిలో కేంద్ర ప్రభుత్వం రాజకీయాల్లోకి, అన్ని రంగాలలో మతాన్ని చొప్పిస్తూ మతోన్మాద రాజకీయాలకు పాల్పడుతుందన్నారు. పది సంవత్సరాల కాలంలో పెద్ద ఎత్తున దాడులు జరుగుతున్నాయి అన్నారు. అన్ని రంగాలలో బిజెపి విధానాలను అమలు జరిగే విధంగా చేస్తుందన్నారు. భవిష్యత్తులో కేంద్ర ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రైతులు, విద్యార్థులు, కార్మికులు పెద్ద ఎత్తున దేశంలో ఆందోళనలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, వైరా రూరల్ కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు, కొణిజర్ల మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, కొంగర సుధాకర్, మచ్చా మణి, తాతా పద్మ, గుడిమెట్ల రజిత, పైడిపల్లి సాంబశివరావు,హరి వెంకటేశ్వరావు, బోయినపల్లి శ్రీనివాసరావు, తోట నాగేశ్వరావు,మాగంటి తిరుమలరావు, అన్నవరం వెంకటేశ్వర్లు,చింతపల్లి ప్రసాద్, బాణాల వెంకట్రావమ్మ, కంచర్ల అనిత తదితరులు పాల్గొన్నారు.

## వైరా పోలీసుల చొరవతో ఒంటరి మహిళకు కృత్రిమ కాలు ఏర్పాటు






**వైరా, ఆగస్టు 5,(నినాదం ):** మానవతా దృక్పథంతో స్పందించిన వైరా పట్టణ పోలీసులు మరోసారి తమ సేవాతత్పరతను చాటుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లా, రెడ్డిగూడెం మండలం, నాగలూరు గ్రామానికి చెందిన ఉప్పుటల జమలమ్మ (56)కు వైరా పట్టణ ఎస్ఐ పుష్పాల రామారావు చొరవతో ఆధునిక కృత్రిమ కాలును అందజేశారు. జమలమ్మ గత ఏడాది మధుమేహం కారణంగా ఒక కాలును కోల్పోయారు. ఒంటరి మహిళగా జీవిస్తున్న ఆమెకు నిత్యజీవితంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తనకు వచ్చే వృద్ధాప్య పెన్షన్‌తోనే జీవనం సాగిస్తున్న ఆమె, కృత్రిమ కాలు ఏర్పాటు చేయాలని వైరా పట్టణ ఎస్ఐ పుష్పాల రామారావును ఆశ్రయించారు. ఆమె పరిస్థితిని తెలుసుకున్న ఎస్ఐ వెంటనే స్పందించి, విజయవాడకు చెందిన స్వచ్ఛంద సేవకుడు, రిటైర్డ్ విద్యుత్ శాఖ ఉద్యోగి శ్రీనివాసరావు సహకారాన్ని తీసుకున్నారు. ఆయన ఆర్థిక సహాయంతో ఎవల్యూషన్ ప్రోస్థెటిక్స్ సంస్థ ద్వారా అత్యాధునిక కృత్రిమ కాలును కొనుగోలు చేసి, విజయవాడలో జరిగిన కార్యక్రమంలో జమలమ్మకు అమర్చేందుకు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జమలమ్మ మాట్లాడుతూ, మామూలుగా నడిచే అవకాశం కల్పించిన వైరా పట్టణ ఎస్ఐ పుష్పాల రామారావు, ఆర్థిక సహకారం అందించిన శ్రీనివాసరావుకు జీవితాంతం రుణపడి ఉంటాను అని భావోద్వేగంగా తెలిపారు. సమాజంలో ఆపదలో ఉన్నవారిని గుర్తించి వారికి అండగా నిలవడం పోలీసుల సామాజిక బాధ్యతలో భాగమని, వైరా పట్టణ పోలీసులు చేపడుతున్న ఇటువంటి సేవా కార్యక్రమాలు ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని పలువురు ప్రశంసించారు.


## నష్టపోయిన రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలి

### తల్లాడ లో అఖిల భారత ఐక్యరైతు సంఘం ఆధ్వర్యంలో ఎమ్మార్వోకి వినతిపత్రం




**తల్లాడ, ఆగస్టు 5(నినాదం ):** తల్లాడ మండల కేంద్రం లో ఉన్న రైతంగ సమస్యల పై అఖిల భారత ఐక్య రైతు సంఘము వైరా డివిజన్ ఆధ్వర్యంలో రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టి కి తీసుకొని వెళ్లే అందుకు ఎమ్మార్వో కరుణాకర్ రెడ్డి కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వైరా డివిజన్ కార్యదర్శి పాశం అప్పారావు మాట్లాడుతూ వర్ష భావం లేక పంటలు వేసి నష్టబోయిన రైతంగాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాల ఆదుకోవాలని ఎకరానికి 12000 నష్ట పరిహారం ఇవ్వాలని రాష్టం లో ఖరీఫ్ సీజన్లో వర్షాలు లేక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వారిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో అఖిల భారత ఐక్య రైతు సంఘము మండల కార్యదర్శి కొండ వెంకటేశ్వర్లు,ఏస్కె జానీ, పుల్లమ్మ, వెంకులు, లల్మీయా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## వైరా ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి,గోవిందు శ్రీనివాసరావు



**తల్లాడ, ఆగస్టు 5(నినాదం ):** టిపిసిసి ఆదేశాల మేరకు మండలం, గ్రామ కమిటీలను, ఎన్నుకునేందుకు ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అన్ని మండలాలకు ఇన్చార్జీలను నియమించింది. దీనిలో భాగంగా ఏన్కూర్ మండలానికి ఇంచార్జిగా జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు శ్రీనివాసరావు ను టీపీసీసీ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ నియమించింది. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఏన్కూరు మండలం ఇన్చార్జి గోవింద్ శ్రీనివాసరావు బుధవారం వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్ తో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు, ఈ సందర్భంగా వైరా శాసన సభ్యులు రాందాస్ నాయక్ ను గోవింద్ శ్రీనివాసరావు ఏనుకూరు మండలం ఇన్చార్జిగా నియమించినందుకు గాను శుభాకాంక్షలు తెలియజేసి ఎమ్మెల్యే ను శాలువ తో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ ఏన్కూర్ మండలంలోని అన్ని కమిటీలు చాలా పారదర్శకంగా నియమించాలన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారిని ప్రత్యేకంగా గుర్తించి వారికి పార్టీలో సముచిత స్థానం కల్పించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను బలంగా ప్రజల్లోకి తీసుకు వెళ్లే విధంగా కృషి చేయాలి అన్నారు. ఈ సందర్భంగా గోవిందు శ్రీనివాసరావు మాట్లాడుతూ హై కమాండ్ ఆదేశాల మేరకు కట్టుబడి పని చేస్తానని కమిటీలు ఎన్నిక పారదర్శకంగా ఉండేలా చూస్తానని, పార్టీ కోసం కష్టపడ్డ వారికి సముచిత స్థానం కలిపించే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా తాజా రాజకీయాల పై చర్చించారు. తనను ఏనుకూరు మండలం ఇన్చార్జి గా నియమించినందుకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో అన్నారుగూడెం యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇండ్ల రంగ, ఏనుకూరు మండలం స్థానిక ప్రజాప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు




## సామాజిక న్యాయం దిశగా ఉద్యమించాలి


### జిల్లాలో టీజేఎస్ ను క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయండి.
### టీజేఎస్ వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ ప్రొ.కోదండరామ్



**పాలేరు ఆగస్టు 05( నినాదం):** తెలంగాణ ప్రజల ఆకాంక్షలైన నిధులు.. నియమాకాలు. నీళ్లు, సామాజిక న్యాయం దిశగా ఉద్యమించాలని తెలంగాణ జన సమితి వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ ప్రో. కోదండరామ్ సూచించారు. టీజేఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడుగా ఎన్నికైన మాదాసు శ్రీనివాసరావు హైద్రాబాద్ లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ను ఘనంగా సన్మానించారు. తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లా డారు.. ఖమ్మం జిల్లాలో పార్టీని బలోపేతం చేయాలని సూచిం చారు. గ్రామీణ ప్రాంతం బూత్ కమిటీ నుంచి మండలం, పట్టణాలలో అన్ని కమిటీలు పూర్తి చేయాలని సూచించారు. సామాజిక న్యాయం దిశగా జనసమితి జెండా కింద ప్రజలను ఏకం చేయాలని సూచించారు. పార్టీని క్షేత్ర స్థాయిలో తిరుగులేని శక్తిగా నిలపాలని సూచించారు. జిల్లాలో పార్టీని బహుజన ప్రజా ఉద్యమాల వేదికగా తీర్చిదిద్దటానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని నూతన అధ్యక్షుడు మాదాసు శ్రీనివాసరావు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యాక్షుడు అంబటి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పల్లె వినయ్కుమార్, గోపగాని శంకర్రావు, మేకపోతుల నర్సయ్య,జిల్లా నాయకులు మందడి వెంకటేశ్వ రరావు,తీగ రాములు, మోహన్రావు, నాగేశ్వరరావు, వెంకట్రావ్ పాల్గొన్నారు.



## మాడ్గుల మండలంలో యువకుడు అదృశ్యం



**ఆమనగల్లు, ఆగస్టు 05(నినాదం):** మా డ్గుల మండల పరిధిలోని చాంద్రా యణ పల్లి గ్రామానికి చెందిన మానుపాటి నరేష్ (24) అనే యువకుడు అదృశ్యమయ్యాడు. కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఈ నెల 3వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు ఇంటి నుంచి వెళ్లిన నరేష్ తిరిగి రాలేదని తల్లి వెంకటమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంధువులు, చుట్టుపక్కల గాలిం చినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిస్తే మాడ్గుల పోలీస్ స్టేషన్లో తెలపాలని కోరారు.

గురువారం, తెలంగాణ
6 ఆగస్టు 2026
# నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

## విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ



**పెబ్బేరు, ఆగస్టు 5 (నినాదం):** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం ఉచితంగా నోట్ పుస్తకాలు పంపిణీ చేయడం అభినందనీయమని పెబ్బేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు పేర్కొన్నారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించడం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు గణనీయమైన ఊరటనిస్తున్నట్లు వారు తెలిపారు. బుధవారం పెబ్బేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత నోట్ పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఇప్పటికే ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను అందించిందని, ఇప్పుడు నోట్ పుస్తకాలు కూడా పంపిణీ చేయడంతో విద్యార్థులు ఎలాంటి అదనపు ఖర్చు లేకుండా విద్యను కొనసాగించే అవకాశం కలుగుతోందని అధ్యాపకులు వివరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ ఫీజు లేకుండా ప్రవేశాలు కల్పించడంతో పాటు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను ఉచితంగా అందించడం వల్ల తల్లిదండ్రులపై పడే ఆర్థిక భారం గణనీయంగా తగ్గుతోందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ విద్యా సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలతో చదువుకుని ప్రతిభ కనబర్చాలని అధ్యాపకులు సూచించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల పెబ్బేరు ప్రథమ సంవత్సరం ప్రవేశాల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో చేరడం పట్ల కళాశాల అధ్యాపక, బోధనేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థలపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో రోజురోజుకూ పెరుగుతున్న విశ్వాసానికి ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఓబుల్‌రెడ్డి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## చిన్నారులకు శ్రీరామరక్ష ముర్రుపాలు



**వేములపల్లి, ఆగస్టు 5 (నినాదం):** చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యానికి, శారీరక వికాసానికి తల్లి ముర్రుపాలు శ్రీరామరక్షగా నిలుస్తాయని వేములపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ పుట్టల సందీప్ కుమార్ తెలిపారు. ఐసిడిఎస్ దామరచర్ల ప్రాజెక్టు పరిధిలోని వేములపల్లి మండల కేంద్రంలో బుధవారం సిడిపిఓ ఉత్తర్వుల మేరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు సామూహిక అన్నప్రాసన వేడుకను ఏర్పాటు చేయగా సర్పంచ్ పుట్టల సందీప్ కుమార్ హాజరై చిన్నారులకు తొలిసారి ఆహారం తినిపించారు. అనంతరం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పరిమి రజిని అంగన్వాడీ కేంద్రానికి వచ్చిన తల్లులతో సమావేశమై పలు విషయాలను విశదీకరించారు. శిశువు జన్మించిన మొదటి గంటలోనే తల్లి పాలు పట్టించడం అత్యంత ఆవశ్యకమని తెలిపారు. ముర్రుపాలు చిన్నారి శరీరంలో వ్యాధి నిరోధక శక్తిని అపరిమితంగా పెంచుతాయని, జీవిత కాలానికి రక్షణ కల్పించే మొదటి టీకా లాగా పనిచేస్తూ పిల్లల్లో మేధో సంపత్తిని పెంపొందిస్తాయని సమాచారం అందించారు. పుట్టిన రోజు నుంచి ఆరు నెలల వయస్సు వరకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టించాలని సూచించారు. ఏడో నెలలోకి అడుగుపెట్టిన తరువాత చిన్నారులకు అన్నప్రాసన చేసి గుడ్లు, పప్పు ధాన్యాలతో కూడిన పోషకాహారాన్ని అలవాటు చేయాలని, దీంతో పాటు రెండేళ్ల వయస్సు దాటే వరకు తప్పనిసరిగా తల్లిపాలు అందిస్తూ ఉండాలని అవగాహన కల్పించారు. తల్లులందరూ ఈ విషయాలను గుర్తించి పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పరిమి రజిని, వార్డు మెంబర్లు హాజీ, మాతంగి సుధీర్, హెల్త్ సూపర్‌వైజర్ శాంతా, ఏఎన్ఎంలు శైలజ, సునీత, అంగన్వాడీ టీచర్లు జయమ్మ, శశికళ, పద్మ, రజిత, ఆశా వర్కర్లు విగ్నేశ్వరి, ప్రేమలత, ఆయా యాదమ్మ, బాలింతలు, గర్భిణులు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

### కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు బి. కె. హరిప్రసాద్‌ను కలిసిన బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి విజయ్ గౌడ్



**మునుగోడు, ఆగస్టు 5 (నినాదం) :** బెంగళూరు వేదికగా ఈనెల 7వ తారీఖున అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనున్న చారిత్రాత్మక, జాతీయ ఓబీసీ మహాసభ' కు ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరుతూ కర్ణాటక పీసీసీ అధ్యక్షులు, బి. కె. హరిప్రసాద్ ని బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి విజయ్ గౌడ్ బుధవారం బెంగళూరులో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు . బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మార్గదర్శకత్వంలో, జాతీయ ఓబీసీ మహాసభ సందర్భంగా ఈ భేటీ జరిగింది. జాతీయ బీసీ ప్రతినిధులు భవన్ రామ్ తైవడే, సచిన్ రాజోర్ కార్, తాటికొండ విక్రమ్ గౌడ్, కనకాల శ్యామ్ కురుమ, రావుల కోల్ నరేష్ ప్రజాపతి, లక్ష్మణ్ జిత్ లతో కలిసి పానుగంటి విజయ్ గౌడ్ పాల్గొని కేపీసీసీ అధ్యక్షులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి విజయ్ గౌడ్ మాట్లాడుతూ. దేశంలో ఓబీసీల సామాజిక, రాజకీయ, ఆర్థిక హక్కుల రక్షణ కోసం, దేశవ్యాప్త కుల గణన మరియు చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ల సాధనే ప్రధాన డిమాండ్లతో ఈ మహాసభను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ చారిత్రాత్మక పోరాటంలో కర్ణాటకలో బలమైన ఓబీసీ దిగ్గజం అయిన బి. కె. హరిప్రసాద్ మద్దతు యావత్ దేశ బీసీ సమాజానికి కొండంత అండ అని పేర్కొన్నారు. జాతీయ కమిటీ ఆహ్వానానికి కేపీసీసీ అధ్యక్షులు సానుకూలంగా స్పందిస్తూ, ఆగస్టు 7న జరిగే మహాసభకు తాను తప్పకుండా హాజరవుతానని స్పష్టమైన హామీ ఇచ్చారని విజయ్ గౌడ్ వెల్లడించారు. ఆగస్టు 7న బెంగళూరులో సాగబోయే ఈ చారిత్రాత్మక 11వ జాతీయ ఓబీసీ మహాసభను విజయవంతం చేయాల్సిందిగా యావత్ దేశంలోని బీసీ ప్రజానీకానికి, యువజన, విద్యార్థి సంఘాలకు పానుగంటి విజయ్ గౌడ్ పిలుపునిచ్చారు.

## మండల అభివృద్ధిపై నేడు ప్రత్యేక సమీక్ష

**వేములపల్లి, ఆగస్టు 5 (నినాదం) :** వేములపల్లి మండల పరిధిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించేందుకు బుధవారం ప్రత్యేక మండల సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జితేందర్‌రెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ఈ సమావేశం ప్రారంభం కానుంది. మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్‌రావు ఈ సమావేశానికి అధ్యక్షత వహిస్తారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు విధిగా సకాలంలో పూర్తిస్థాయి ప్రగతి నివేదికలతో హాజరు కావాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, వివిధ శాఖల పరిధిలో జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించేందుకు ఈ సమావేశం ఎంతగానో దోహదపడుతుందన్నారు. అధికారులు అందరూ ముందస్తు ప్రణాళికలతో వచ్చి సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# మేనిఫెస్టో హామీలు అమలేది?

### పీఆర్టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్ కుమార్



**మహాముత్తారం, ఆగస్టు 5 (నినాదం):** కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని, లేనిపక్షంలో సెప్టెంబర్ 1 నుంచి ప్రత్యక్ష ఉద్యమానికి శ్రీకారం చుడతామని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (పీఆర్టీయూటీఎస్) జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్ కుమార్ హెచ్చరించారు. మహాముత్తారం మండలంలోని ములుగుపల్లి ఉన్నత ప్రాథమిక పాఠశాల, కొర్లకుంట యూపీఎస్, దొబ్బలపాడు మోడల్ స్కూల్, మహాముత్తారం, నిమ్మగూడెం, యామ న్‌పల్లి కేజీబీవీ పాఠశాలల్లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండల అధ్యక్షుడు భుక్య రవినా యక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాట్లా డుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే పీఆర్టీయూటీఎస్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నా రు. ఉపాధ్యాయులందరూ సంఘంలో సభ్యత్వం స్వీకరించి ఐక్యంగా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులకు క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు అందేలా సంఘం కృషి చేస్తోందని తెలిపారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, అలాగే కాంగ్రెస్ మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్లుగా అన్ని సీపీఎస్ ఉద్యోగులకు ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగు లకు ఆరు నెలలకొకసారి ఇవ్వాల్సిన ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండటం సరికాదని, వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని మంచి ఫిట్‌మెంట్‌తో ప్రకటించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలి పారు. సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహిం చనున్న మహాధర్నాకు ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపు నిచ్చా రు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యద ర్శి అజ్మీరా రవీందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కామిడి సతీష్‌రెడ్డి, హెచ్ఎంఏ సురేందర్‌రెడ్డి, జిల్లా బాధ్యులు దాసరి రాజేంద్రప్రసాద్, మండల నాయకులు కొంకల గీతారెడ్డి, చైతన్య నాగరాజు, సతీష్‌కుమార్, షరీఫ్, సుధాకర్‌రెడ్డి, లావుడ్య ప్రకాష్‌తో పాటు జిల్లా, మండల, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### మూకమామిడి పంచాయతీలో స్టిచ్చింగ్ హబ్, వివో బిల్డింగ్ లను పరిశీలించిన

# జిల్లా గ్రామీణా అభివృద్ధి అధికారి విద్య చందన







**ములకలపల్లి, ఆగస్టు 05 (నినాదం):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజకవర్గం ములకలపల్లి మండలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడిషనల్ కలెక్టర్ మరియు జిల్లా గ్రామీణా అభివృద్ధి అధికారి విద్య చందన. బుధవారం ములకలపల్లి మండలంలో మూకమామిడి పంచాయతీ లో పాఠశాలల యూనిఫామ్ స్టిచ్చింగ్ హబ్ ను పరిశీలించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడిషనల్ కలెక్టర్ జిల్లా గ్రామీణా అభివృద్ధి అధికారి విద్య చందన. ఈ సందర్భంగా స్టిచ్చింగ్ హబ్ లో ఎంత మంది టైలర్స్ కూడు తున్నారు. రోజుకు ఎన్ని యూనిఫామ్ లు కుడుతున్నారు మరియు ఏ ఏ పాఠశాలల యూనిఫామ్ లు కుడుతున్నారు అని వివరాలు తెలుసుకున్నారు. పాఠశాలలు ప్రారంభించి రెండు నెలలు గడుస్తున్నా యూనిఫాములు తయారు కాకపోవడం ఈనెల ఆగస్టు 10 పదవ తారీకు లోగ ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాలకు ఒక జత యూనిఫామ్ తయారు చేయాలని. మిగతా యూనిఫామ్ లు ఈనెల ఆగస్టు 13 పదముడివ తేదీ లోగ పూర్తిచేయాలని ఆదేశించారు. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల మరియు కాలెజీలకు ఒక జత యూనిఫాం తప్పకుండా అందించాలని టైలర్స్ లకు ఆదేశించారు. అనంతరం మూకమామిడి గ్రామపంచాయతీ లో నిర్మిస్తున్న గ్రామ సమైక్య భవనాలను విఓ బిల్డింగ్ పరిశీలించా రు. అనంతరం స్థానిక సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి తో మాట్లాడుతూ. ఈనెల చివరి వారంలోపు గ్రామ సమైక్య భవనాలను పూర్తి చేయించాలని సంబంధిత అధికారులకు కాంట్రాక్టర్ లకు తెలియజేయాలని సూచించారు. పంచాయితీలో ప్రతి ఇంటికి ఇంకుడు గుంటలు నిర్మించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి, ఎంపీడీఓ సత్యనారాయణ, ఈజీఎస్ ఏపీడి వెంకట రమణయ్య, ఏపీఎం రామ్ కుమార్, సీసీ కె వెంకటేశ్వర్లు, వివోఏ స్వయం లలిత, పంచాయితీ సెక్రటరీ దోమల అరుణ్ కుమార్ వివో అధ్యక్షురాలు, మహిళలు పంచాయితీ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ సాగర్ జాప్యానికి కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణం

### కేసీఆర్ కలల ప్రాజెక్టు సీతారామ ప్రాజెక్టు: కోడి అమరేందర్ యాదవ్



**అశ్వాపురం, ఆగస్టు 5 (నినాదం):** సీతమ్మసాగర్ ప్రాజెక్టు పనులకు అడ్డుపడింది కాంగ్రెస్ పార్టీయేనని, రాజీవ్ సాగర్ ప్రాజెక్టును తొమ్మిదేళ్లపాటు జాప్యం చేసి పూర్తి చేయలేకపోయిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ యాదవ్ ఆరోపించారు. అశ్వాపురంలోని బీఆర్ఎస్ మండల పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీవ్ సాగర్ ప్రాజెక్టుకు 2005లో శంకుస్థాపన చేసినప్పటికీ, 2014 మే వరకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండి కూడా ప్రాజెక్టును పూర్తి చేయలేకపోయిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం, గోదావరి జలాలను ఆంధ్రప్రదేశ్‌కు తరలించే విధానాన్ని నిలువరించేందుకు ప్రాజెక్టును రీడిజైన్ చేసి, 6. 5 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సీతారామ ప్రాజెక్టును రూపకల్పన చేశారని పేర్కొన్నారు. 2017లో సీతారామ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి, ఐదేళ్లలోనే 90 శాతానికి పైగా పనులు పూర్తి చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సాగునీరు అందించే దిశగా బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రాజెక్టు పనుల్లో ఎలాంటి పురోగతి లేకుండా, గతంలో నిర్మించిన వ్యవస్థ ద్వారానే నీటిని తరలిస్తూ ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. సీతారామ ప్రాజెక్టు డీపీఆర్‌లో మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం లేకపోయినా, అప్పటి ఎమ్మెల్యే రేగా కాంతారావు చొరవతో 2023 జనవరిలో రూ. 25 కోట్ల నిధులు మంజూరు చేయించి పనులకు శ్రీకారం చుట్టారన్నారు. అనంతరం ఎన్నికల నియమావళి కారణంగా కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లు పూర్తయినా మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం నిర్మాణంలో ఆశించిన పురోగతి సాధించలేదని విమర్శించారు. స్థానిక రైతుల అవసరాలను విస్మరించి ఖమ్మం జిల్లా రైతులకు సాగునీరు అందించే ప్రయత్నం జరుగుతుండగా, బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన ఉద్యమాల ఫలితంగానే మారెళ్లపాడు పనులు తిరిగి ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. ప్రస్తుతం కూడా పనులు నత్తనడకన సాగుతున్నాయని, రైతుల ఆగ్రహానికి గురికాకుండా ఉండేందుకే మంత్రులు, ప్రజాప్రతినిధులు పర్యటనలు చేస్తున్నారని అన్నారు. రైతులను ఆదుకున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, రైతు బంధు, సాగునీరు, ధాన్యం కొనుగోళ్ల ద్వారా రైతుకు అండగా నిలిచిందని తెలిపారు. సీతమ్మ బ్యారేజ్‌కు 37 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో పనులు వేగంగా సాగుతున్న సమయంలో కాంగ్రెస్ నాయకులే కోర్టుల్లో కేసులు వేసి పనులను నిలిపివేశారని ఆరోపించారు. ఇప్పుడు అదే ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు తామే తీసుకొచ్చామని చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులకు యూరియా ఎరువులు కూడా సకాలంలో అందించలేకపోతోందని, రోజుకో యాప్ పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని అన్నారు. మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ద్వారా పినపాక నియోజకవర్గంలోని ప్రతి చివరి ఎకరాకు సాగునీరు అందే వరకు బీఆర్ఎస్ రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. అలాగే అశ్వాపురం మండలంలోని 24 గ్రామపంచాయతీల పరిధిలోని చెరువులు, కుంటలు నిండే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ముర్రి మల్లారెడ్డి, ఈదర సత్యనారాయణ, వెన్న అశోక్ కుమార్, నేలపట్ల సత్యనారాయణ రెడ్డి, చిలక వెంకటరమయ్య, మండల యువజన అధ్యక్షుడు గద్దాల రామకృష్ణ, ఆనందాపురం సర్పంచ్ ముర్రం సమయ్య, ఉప సర్పంచ్ దేవనబోయిన మహేష్, శివారపు డాక్టర్ బాబు, మందా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సహజ మరణానికి రూ. 5 లక్షలు ఇవ్వాలి

### టి యు సి ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబశివుడు




**అమరచింత, ఆగస్టు 5, (నినాదం):** తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం(టి యు సి ఐ) వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ దగ్గర రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం(టి యు సి ఐ) జిల్లా ప్రధాన కార్యదర్శి సి. రాజు అధ్యక్షత వహించగా ముఖ్యవక్తంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబశివుడు వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి పి అరుణ్ కుమార్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖ మోష, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ రాజు, తెలంగాణ ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం, జిల్లా అధ్యక్షులు టి యు సి ఐ జిల్లా అధ్యక్షులు ప్రసాద్ ప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న సంక్షేమ పథకాలలోని సహజ మరణం ప్రమాద మరణం ఇన్సూరెన్సును ప్రైవేటు ఇన్సూరెన్స్ వాళ్లకు ఇచ్చిన దాన్ని రద్దు చేయాలని మరియు సిఎస్సి ఆరోగ్య పరీక్షలు రద్దుచేసి హెల్త్ కార్డులు ఇవ్వాలని, 60 సంవత్సరాల దాటిన భవన నిర్మాణ కార్మికులకు కనీస పెన్షన్ నెలకు 9000 రూపాయలు ఇవ్వాలని, సహజ మరణానికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని డెలివరీ మ్యారేజ్ గిఫ్ట్ లకు ఇచ్చే సంక్షేమ పథకాన్ని లక్ష రూపాయలకు పెంచాలని సంక్షేమ బోర్డు ద్వారానే యధావిధిగా కొనసాగించాని డిమాండ్ చేశారు. అదేవిధంగా భవన నిర్మాణ కార్మికులకు చదువు లేక అక్రమంగా సకాలంలో రెన్యువల్ చేసుకోలేని కార్మికులకు ప్రభుత్వమే రెన్యువల్ చేయాలని పెండింగ్ క్లెయిమ్స్‌ను వెంటనే పరిష్కరించాలని అదేవిధంగా ఐటిఐ లకు మంజూరు చేసిన 667కోట్లు నిధులను నిలిపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది లేనిపక్షంలో అన్ని కార్మిక సంఘాలను కార్మికులను కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటాలకుపూనుకుంటామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం, అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటయ్య, చింతలన్న, కురుమన్న లు ప్రసంగించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జి చెన్నయ్య, కురుమన్న, తిరుపతి, మన్యం, కురుమన్న, రాజు, రాజు, వెంకటేష్, సీనియర్ తాపీ మేస్త్రీలు ఈదన్న, చిన్న బాలస్వామి, మాల వెంకటన్న, వడ్డే రాములు, చిన్న, బాలయ్య, అంజి, దేవన్న, మన్నెం, రాజు, యాకోబు, రవి, శేఖర్, రాజన్న, బీచ్ పల్లి, నాగన్న, శ్రీశైలం, తిప్పన్న, మైబు, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వం అండగా, బాధితుడికి

## రూ. 3 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ

### గంగారాం గ్రామానికి చెందిన శ్యామ్ సాగర్ కుటుంబానికి పత్రాలు అందజేసిన ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి



**బిజినపల్లి మండలం ఆగస్టు 5 నినాదం:** నాగర్‌కర్నూల్: నిరుపేదల వైద్య చికిత్సకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ఎంతో ఊతమిస్తోందని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం గంగారాం గ్రామానికి చెందిన గుంటి శ్యామ్ సాగర్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ శస్త్రచికిత్స అవసరమైన పరిస్థితి ఏర్పడటంతో కుటుంబ సభ్యులు నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డిని కలిసి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. బాధితుడి పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ. 3 లక్షల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ) మంజూరు చేయించారు. మంజూరైన ఎల్ఓసీ పత్రాన్ని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ, పేద ప్రజలకు అత్యవసర వైద్య చికిత్స అందించడంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్యం అందని పరిస్థితుల్లో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోందని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు హరీష్ రెడ్డి, వీరేందర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం



**మహాదేవపూర్ ఆగస్టు 5, (నినాదం);** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం బెగ్లూర్ లో పలు బాధిత కుటుంబాలను సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కట్కం అశోక్ పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు ఆదేశాల మేరకు గ్రామంలో ఇటీవల మరణించిన బొల్లి సమ్మయ్య కుటుంబానికి 5 వేల రూపాయల ఆర్థిక సహాయం, కాంగ్రెస్ కార్యకర్త కారు కొములయ్య కుటుంబానికి 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసి వారి కుటుంబాలను పరామర్శించి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని ధైర్యాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆకుల రాజయ్య, ఉప సర్పంచ్ సదానంద చారి, మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బుర్రి శివరాజ్, నాయకులు దోమల రాజేష్, పోచయ్య, శంకరయ్య, తిరుపతి, శ్రీను, కోటేష్ తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఎం జె పి బాలికల పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరం




**కమలాపూర్, ఆగస్టు 5 (నినాదం):** మండలంలోని ఎంజెపి బాలికల పాఠశాలలో ప్రాథమికఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక వైద్య శిబిరాన్నినిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో మొత్తం 53 మంది విద్యార్థినులకు మలేరియా, డెంగ్యూ నిర్ధారణ పరీక్షలతో పాటు హిమోగ్లోబిన్ (హెచ్‌బీ) స్థాయి పరీక్షలునిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసి, తగిన వైద్యసలహాలు అందించా రు. అనంతరం విద్యార్థినులకు హెచ్ పి వి ప్రాముఖ్యతను, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ చర్యలు, సీజనల్వ్యాధుల లక్షణాలు నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. పరిశుభ్రమైనపరిసరాలు, సురక్షితమైన తాగునీరు, దోమల పెరుగుదలను అరికట్టడం ద్వారావ్యాధులను నివారించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులునాగరాజు, అరుణ్ , హెచ్ ఈ ఓ రవీందర్, హెచ్ వి అమృత, టీబీ నోడల్ పర్సన్ ప్రభాకర్, హెల్త్ అసిస్టెంట్లు రవీందర్, రాము, గోవర్ధన్ బాబు, పాఠశాలప్రిన్సిపాల్ సౌజన్య, స్టాఫ్ నర్స్ అనిత తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మి గణపతికి విశేష అభిషేకాలు



**అల్వాల్, ఆగస్టు 5( నినాదం):** కామాజిగూడ డైరీ ఫార్మ్ రోడ్ ల వెలిసినమరకత శ్రీ లక్ష్మీ గణపతి దేవస్థానం లో ప్రపంచ అరుదైన అత్యంత విశిష్టమైన మరకతంతో మలిచిన మరకత శ్రీ లక్ష్మీ గణపతి స్వామి దేవాలయంలో బుధవారం స్వామివారికి సుప్రభాత సేవ, వస్త్రాలంకరణ సేవ, 32 ఔషధీకృత ద్రవ్యాలతో విశేష అభిషేకాలు, లక్ష్మీ గణపతి మూల మంత్రము శ్రీ మహాలక్ష్మి హోమం నిర్వహించిన ఆలయ వ్యవస్థాపకులు కార్యనిర్వహాకులు డాక్టర్ మోత్కూరు సత్యనారాయణ శాస్త్రి. ఈ పూజ లో పాల్గొన్న భక్తులకు ఆరోగ్యము, ఆయురారోగ్య, ఐశ్వర్య అభివృద్ధి, వ్యాపార అభివృద్ధి, ధన ప్రాప్తి, సర్వ కార్యసిద్ధి కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధి కి పాటుపడి స్వామి వారి కృపకు పాత్రులు కావాలని భక్తులను కోరారు.

గురువారం, తెలంగాణ
6 ఆగస్టు 2026
# నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

## టాన్స్‌ఫార్మర్ల దొంగతనాలపై కఠిన చర్యలు తీసుకోవాలి

### నేరేడుచర్ల ఎస్సైకు బీఆర్ఎస్ నేతల వినతి



**హుజుర్నగర్ (నేరేడుచర్ల)ఆగస్టు 05 (నినాదం ):**వ్యవసాయ సంక్షోభంతో సతమత మవుతున్న రైతులను మరింత ఇబ్బందులకు గురిచేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్లు, కాపర్ వైర్లు తదితర విద్యుత్ పరికరాల దొంగతనాలను చేస్తున్న వారిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు నేరేడుచర్ల ఎస్సై గోపాల్‌రెడ్డికి బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు రాపోలు నవీన్‌కుమార్ మాట్లాడుతూ, ఈ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, పంటల నష్టం, నకిలీ విత్తనాలు, నకిలీ పురుగుమందులు, అధిక పెట్టుబడులతో రైతులు ఇప్పటికే తీవ్ర ఆర్థిక, మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని ఇలాంటి సమయంలో రైతుల ట్రాన్స్‌ఫార్మర్లు, కాపర్ వైర్లు, ఇతర విద్యుత్ పరికరాలను దొంగిలించడం అత్యంత అమానవీయ చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆస్తులపై కన్నేసిన దొంగలను గుర్తించి చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని, గ్రామీణ ప్రాంతాల్లో పోలీసు గస్తీని పెంచి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నను రక్షించడం సమాజం, ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ అందరి బాధ్యత అని పేర్కొన్నారు. రైతుల కష్టార్జిత సంపాదనను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడే వ్యక్తులు తమచర్యలను విరమించుకోవాలని, రైతుల పట్ల మానవత్వంతో వ్యవహరించాలని నవీన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మాజీ సర్పంచ్ పల్లెపంగ నాగరాజు, రైతు నాయకులు రాంరెడ్డి, అంబటి నాగయ్య, కంపసాటి రాంమూర్తి, అంబటి మాధవి, మాతంగి శేఖర్, అరె శ్రీకాంత్, షేక్ నాగుల్, మీరా తదితరులు పాల్గొన్నారు

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

### రాఘువ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పులిపలుపుల మహేష్



**ఆలేరు, ఆగస్టు 5(నినాదం):** గ్రామాలు, పట్టణాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రాఘువ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పులిపలుపుల మహేష్ అన్నారు. బుధవారం ఆలేరు పట్టణ కేంద్రంలో రాఘువ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, మెడిసిటీ హాస్పిటల్స్ వైద్య బృందం సహకారంతో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా వైద్యులు మొత్తం 480 మందికి వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వైద్య సలహాలు, మందులు అందజేశారు. పరీక్షల అనంతరం 80 మందిని తదుపరి చికిత్సలు, వివిధ రకాల శస్త్రచికిత్సల కోసం మెడిసిటీ హాస్పిటల్‌కు రిఫర్ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరాన్ని ఉద్దేశించి పులిపలుపుల మహేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను నిరంతరం నిర్వహిస్తున్నామని చెప్పారు. వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందడం ద్వారా తీవ్రమైన ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు. ప్రజలు ఉచిత వైద్య సేవలను నిర్లక్ష్యం చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడిసిటీ హాస్పిటల్స్ వైద్య బృందం, స్థానిక మూడో వార్డు కౌన్సిలర్ యాట శివ, నాలుగో వార్డు కౌన్సిలర్ బీజని కళ్యాణి మధు, మంగ నరసింహులు, పంతం కృష్ణ, ఖుర్షీద్ పాషా, రాఘువ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కళ్లెం జితేందర్, మోరీగాడి సిద్ధులు, గుండ్రాజు నరసింహారాజు, కొత్వాల్ సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.


## గ్రామాభివృద్ధే లక్ష్యంగా తుర్రంవారిగూడెంలో గ్రామసభ

### డ్రైనేజీలు, పారిశుధ్యం, మౌలిక వసతుల మెరుగుదలపై గ్రామస్థుల విజ్ఞప్తి




**అశ్వాపురం, ఆగస్టు 5 (నినాదం):** అశ్వాపురం మండలంలోని తుర్రంవారి గూడెం గ్రామపంచా యతీ కార్యాలయంలో బుధవారం గ్రామ సర్పంచ్ కుంజ జాన్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ ధరావత్ హర్ష, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామంలో ప్రస్తుతం వీధి దీపాల నిర్వహణ, తాగు నీటి సరఫరా వ్యవస్థ సంతృప్తికరంగా ఉందని గ్రామస్థులు అభిప్రాయ పడుతూ, ఈ సేవలను మరింత విస్తరించి అభివృద్ధి చేయాలని కోరారు. అలాగే మురుగునీటి సమస్య తలెత్తకుండా సైడ్ డ్రైనేజీలను క్రమం తప్పకుండా శుభ్రం చేయడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. పారిశుధ్యం, ఇతర మౌలిక వసతులను కూడా మరింత మెరుగుపరచాలని గ్రామస్థులు కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుంజ జాన్ మాట్లాడుతూ, గ్రామంలో ఇప్పటికే కల్పిస్తున్న సౌకర్యాలను మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని తెలిపారు. సైడ్ డ్రైనేజీలతో పాటు గ్రామంలోని అన్ని సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని, అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ఎం. షారోన్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## బస్వాపూర్ సొసైటీ విభజనకు త్వరలో పరిష్కారం: షబ్బీర్ అలీ హామీ



బిక్కనూరు, ఆగస్టు 5 (నినాదం):బస్వాపూర్ సొసైటీ విభజన అంశంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని బస్వాపూర్, గుర్జకుంట, రాగ్యాట్లపల్లి గ్రామాల ప్రజాప్రతినిధులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బస్వాపూర్ సర్పంచ్ తుడుం పద్మ స్వామి, గుర్జకుంట సర్పంచ్ సంతోష్, రాగ్యాట్లపల్లి సర్పంచ్ భాగ్యమ్మ నీలంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బాగారెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకుడు తుడుం ప్రదీప్ తదితరులు సొసైటీ విభజనతో పాటు పలు గ్రామాలకు సంబంధించిన సమస్యలను షబ్బీర్ అలీ దృష్టికి తీసుకెళ్లారు. వారి వినతిపై స్పందించిన షబ్బీర్ అలీ బస్వాపూర్ సొసైటీ విభజన సమస్యను అత్యంత త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే గ్రామాల అభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలపై సంబంధిత అధికారులతో వెంటనే ఫోన్‌లో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

# భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసమే రీ సర్వే

### ప్రతీ రైతుకు హద్దులు పెట్టి..మ్యాఫ్ అందిస్తాం.
### సర్వే కు ప్రతీ రైతు తప్పకుండా రావాల్సిందే.
### కొంగర భూ రీసర్వే సభలో కలెక్టర్ దివాకర టి.ఎస్.




**పాలేరు ఆగస్టు 05( నినాదం):**ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ రీ సర్వే తో భూ సమస్యలు వంద శాతం పరిష్కారం అవుతుందని జిల్లా కలెక్టర్ టీ.ఎస్. దివాకర టి.ఎస్. పేర్కొన్నారు. మండలం లోని కొంగర లో బుధవారం జరిగిన భూ భారతి... భూ సర్వే గ్రామ సభలో పాల్గొన్నారు. రైతుల నుంచి వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. సర్వే యొక్క ఉద్దేశ్యం ను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... పాసు పుస్తకంలో భూమి ఉండి... క్షేత్ర స్థాయిలో భూమి లేకున్నా.... పట్టాదారు లో భూమి తక్కువ ఉండి....సాగు ఎక్కువగా ఉన్నా...ఈ సమస్యలను ఈ సర్వే తో పరిష్కారం అవుతుందన్నారు. ప్రతీ రైతు భూ రీ సర్వేలో పాల్గొనాలని సూచించారు. 24 గంటల ముందే నోటీసులు అంధిస్తారని తెలిపారు. కావునా ప్రతీ రైతు సర్వేలో పాల్గొనాలని సూచించారు. సర్వే అనంతరం రైతులు అభ్యంతరం వ్యక్తం చేయవచ్చునన్నారు. 60 రోజులు అనంతరం భూ భారతిలో పెడతామన్నారు. వంద శాతం శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. రైతుల మధ్య వివాదం ఉన్న భూముల పై క్షేత్ర స్థాయిలో విచారణ నిర్వహించి డిస్పోజల్ కేటగిరి లో ఉంచుతామన్నారు. సర్వే మొత్తం ఆధునిక టెక్నాలజీ తో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కొలతల ద్వారా ఎంత వస్తే అంత ఇక శాశ్వతం అన్నారు. అందుకే ప్రతీ రైతు ఖచ్చితంగా ఉండాలన్నారు. భూ భారతి లో నమోదు అనంతరం హద్దులు నిర్ణయించి... కొత్త పట్టాదారు పాసు పుస్తకంతో పాటు మ్యాఫింగ్ తో సహా అందిసామన్నారు. గ్రామాలలో ఉండే గెట్ల పంచాయతీ లు తొలిగిపోతాయ న్నారు. సర్వే పకడ్బందీగా జరగాలి..రైతులంతా సర్వేలో పాల్గొనాలని సూచించారు. అభ్యంతరాలు ఉంటే తహశీల్దార్ కు ఫిర్యాదు చేయవచ్చు నన్నారు. రైతులు సర్వేలో పాల్గొని వారి గెట్ల ను చూయించుకోవాలని సూచించారు. సర్వే అంతా బహిరంగంగానే జరుగుతుం దన్నా రు. ఇందులో ఎలాంటి దాపరికాలు ఉండవన్నారు. ప్రతీ ఒక్కరికి న్యాయం జరగాలని రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉద్దేశ్యమన్నారు. జిల్లాలో బేతుపల్లి, కాకరవాయి లో సర్వే శర వేగంగా జరుగుతుందన్నారు. కొంగర కు త్వరలోనే 10 ప్రత్యేక బృందాల ద్వారా సర్వే ప్రారంభిస్తారన్నారు. అనంతరం బుద్ధారంలో నిర్మాణంలో గ్రామ సమాఖ్య భవనం ను పరిశీలించారు. మండలంలో నిర్మాణంలో ఉన్న 21 భవనాలను నెల లోపు పూర్తి చేయించాలని ఆదేశించారు. పనుల పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, తహశీల్దార్ పి. రాంప్రసాద్, ఎంపీడీఓ యం. యర్రయ్య. డిప్యూటీ తహశీల్దార్ కనకం నరసింహారావు, మండల రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ ఆలస్యం మధుసూధ్రావు, సర్పంచ్ కృష్ణకుమారి, చిట్టూరి శ్రీనివాసరావు, నల్లాని మల్లిఖార్జున్రావు, ఈవూరి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి



**నినాదం, వేములపల్లి, ఆగస్టు 5:**కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్పొరేట్ అనుకూల, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 10న నిర్వహించే జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం మండల అధ్యక్షులు పాదూరి శశిధర్రెడ్డి, సిఐటియు జిల్లా నాయకులు శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా నాయకులు పాల్వాయి రామ్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకురాలు పెంటమల్ల సుకన్య, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు పాతూరి గోవర్ధన మాట్లాడారు. నాటి క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్పొరేట్ పెట్టుబడిదారులకు, మతోన్మాదులకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, ప్రజలు సమైక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. లేబర్ కోడ్స్ ఫైనల్ రూల్స్ నోటిఫికేషన్, విత్తన చట్ట సవరణల ద్వారా కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజువారీ పని వేళలను 8 గంటల నుంచి 12 గంటలకు పెంచుకునేలా యాజమాన్యాలకు వెసులుబాటు ఇచ్చి, ఉద్యోగ భద్రతను ప్రశ్నార్థకం చేశారని విమర్శించారు. విదేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల జీరో సుంకంతో దిగుమతులు పెరిగి దేశీయంగా పత్తి, ఇతర పంటల ధరలు పడిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. కనీస మద్దతు ధరల చట్టం, రుణ విమోచన చట్టం తీసుకురావడంలో కేంద్రం నిర్లక్ష్యం వహిస్తోందని చెప్పారు. ఉపాధి హామీ పథకాన్ని దెబ్బతీస్తూ, పేదలకు అందే ఆహార భద్రత బియ్యం కోటాపై కోతలు విధించేందుకు సవరణలు తెస్తున్నారని మండిపడ్డారు. ఈ ప్రజా వ్యతిరేక నిర్ణయాలను తిప్పికొట్టేందుకు ఈ నెల 10న చేపట్టే జైల్ భరోలో కార్మికులు, రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కోడిరెక్క వెంకన్న, పొదిల్ల వెంకన్న, వెంకటేశం, సంపత్, శ్రీనివాస్ రెడ్డి, రైతులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి అభివృద్ధికి రూ.105 కోట్ల నిధులు







**కామారెడ్డిప్రతినిధి, ఆగస్టు 5(నినాదం ):**కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ కృషితో వివిధ శాఖల నుంచి భారీ నిధులు మంజూరయ్యాయి. పంచాయతీరాజ్ శాఖ ద్వారా గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి రూ. 75.19 కోట్లు, రహదారుల అభివృద్ధికి ఆర్‌డబీ శాఖ ద్వారా రూ. 30 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా షబ్బీర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రహదారుల అభివృద్ధి నిధులు మంజూరు చేసిన ఆర్‌డబీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. షబ్బీర్ అలీ మాట్లాడుతూ, కామారెడ్డి సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా మరిన్ని నిధులు తీసుకురావడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. త్వరలోనే ఎఫ్‌డీఏ కింద రూ. 45 కోట్లు, సీఆర్ఆర్ కింద రూ. 32 కోట్లు కూడా మంజూరు కానున్నాయని వెల్లడించారు. గ్రామీణ మౌలిక సదుపాయాలు, రహదారులు, తాగునీటి వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు షబ్బీర్ కృషిని అభినందించారు.

# తైబజార్ వేలం నిర్ణయం ఉపసంహరించుకోవాలి

### పేదలపై భారం మోపే నిర్ణయాలను విరమించాలి: సీపీఎం ఆందోళన



**ఆలేరు, ఆగస్టు 5(నినాదం):** ఆలేరు మున్సిపాలిటీ పాలకవర్గం ఇటీవల జరిగిన సాధారణ సమావేశంలో తీసుకున్న తైబజార్ వేలం, జేసీబీ కొనుగోలు వంటి నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం పార్టీ నాయకులు డిమాండ్ చేసారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, అనంతరం కమిషనర్ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ నాయకుడు మోరీగాడి రమేష్ మాట్లాడుతూ తైబజార్‌ను వేలం వేసి తోపుడు బండ్ల వ్యాపారులు, ఫుట్‌పాత్ వ్యాపారులు, ద్విచక్ర వాహనాలపై కూరగాయలు తదితర వస్తువులు విక్రయించే చిరు వ్యాపారుల నుంచి రుసుములు వసూలు చేయాలన్న నిర్ణయం పేదలపై అదనపు భారం మోపేదిగా ఉందని విమర్శించారు. మున్సిపాలిటీ ఆదాయాన్ని పెంచుకునేందుకు ఇతర మార్గాలు అనేకం ఉన్నప్పటికీ, వాటిని పక్కనబెట్టి పేదల పై భారం మోపే చర్యలకు పాల్పడడం సరికాదన్నారు. ప్రైవేటు పాఠశాలలు, ఫంక్షన్ హాళ్ల నుంచి మున్సిపల్ చట్టాల ప్రకారం పన్నులు పూర్తిస్థాయిలో వసూలు చేస్తే లక్షల రూపాయల ఆదాయం సమకూరుతుందని తెలిపారు. ఇటీవల వివాదాస్పదంగా మారిన ఓ ప్రైవేటు పాఠశాలకు ఉన్నతాధికారుల జోక్యంతో కొలతలు వేసి పన్నులు విధించడం ద్వారా ఒక్క పాఠశాల నుంచే రూ. 2 లక్షల అదనపు ఆదాయం మున్సిపాలిటీకి వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి వందలాది ఇళ్లను ఆన్‌లైన్ పన్ను వ్యవస్థలో నమోదు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా సుమారు 150 నుంచి 200 ఇళ్లకు ఇప్పటికీ పన్నులు విధించలేని పరిస్థితి నెలకొందని అన్నారు. దాదాపు 20 ఏళ్లుగా పన్నులు చెల్లిస్తున్నప్పటికీ తమ ఇళ్లను మున్సిపల్ రికార్డుల్లో నమోదు చేయాలని కోరినా అధికారులు స్పందించడం లేదని, దీనివల్ల ప్రజలు ఇళ్ల కొనుగోలు, అమ్మకాల సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇదే నిర్లక్ష్యం మున్సి పాలిటీ ఆదాయానికి కూడా నష్టం కలిగిస్తోందన్నారు. కచ్చా కాలువలు, మురు గు కాలువల పూడిక తొలగింపు కోసం సుమారు రూ. 50 లక్షలతో జేసీబీ కొనుగోలు చేయాలన్న ప్రతిపాదనపై కూడా అభ్యంతరం వ్యక్తం చేశారు. ముందుగా పట్టణంలో ఎంత మేరకు కచ్చా కాలువలు, జేసీబీ అవసరమయ్యే మురుగు కాలువలు ఉన్నాయో సమగ్రంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఆలేరు ప్రధాన రహదారిపై దుమ్ము, ధూళి కార ణంగా ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వర్షాకాలంలో నీరు నిలిచి రహదారి చెరువును తలపిస్తోందన్నారు. దీనికి శాశ్వత పరిష్కారంగా ప్రధాన రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్‌లు నిర్మించి బీటీ రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ వద్ద ఉన్న నిధులను ముందుగా మురుగు కాలువలు, సీసీ రోడ్లు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి విని యోగించి, ఆ తర్వాతే జేసీబీ వంటి యంత్రాల కొనుగోలుపై ఆలోచిం చాలని కోరారు. తైబజార్ వేలం నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోకపోతే పట్ట ణంలోని చిరు వ్యాపారులందరినీ సమీకరించి మున్సిపల్ కార్యాలయాన్ని దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నా యకులు వడ్డేమాన్ బాలరాజు, ఘనగాని మల్లేష్, మోరీగాడి అశోక్, మోరీగాడి అంజయ్య, ఘనగాని రాజు, డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు యాసారపు ప్రసాద్, బర్లసిద్ధులు, ఎం. డి. ఖలీల్, ఘనగాని కిష్టయ్య, ఎం. డి. మతీన్ తదితరులు పాల్గొన్నారు.

# వెలువర్తిలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



**వలిగొండ, ఆగష్టు 05 (నినాదం):** మండలంలోని వెలువర్తి గ్రామంలో అంగన్వాడి సెక్టర్ 1,2,3 కేంద్రాలల్లో అంగన్వాడీ టీచర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది, బుధవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ చేముడాల అనిత, పంచాయతీ కార్యదర్శి గిరిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది మాట్లాడుతూ తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో తల్లిపాలు ఎంతో కీలకమని వివరించారు. బిడ్డ పుట్టిన మొదటి గంటలోనే తప్పని సరిగా ముర్రుపాలు పట్టాలని పిలుపునిచ్చారు. తల్లిపాలు బిడ్డను అనేక రకాల వ్యాధుల నుండి కాపాడుతాయని, ముర్రు పాలు పిల్లల జీర్ణశయాన్ని శుభ్రపరుస్తాయని తెలిపారు. తల్లి, బిడ్డల ఆరోగ్యమే సమాజానికి ముఖ్యాంశమని, ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు నీలమ్మ, రమాదేవి, సంధ్యారాణి, ఏఎన్ఎం సాలమ్మా, ఆశ వర్కర్లు, లక్ష్మీనర్సమ్మ, నమ్రత, లక్ష్మి, బాలింతలు, గర్భిణీలు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

### సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి: సీఐ ఎల్లయ్య



**అశ్వాపురం, ఆగస్టు 5 (నినాదం):**నేటి డిజిటల్ యుగంలో రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అశ్వాపురం సీఐ సీహెచ్. ఎల్లయ్య సూచించాంరు. బుధవారం అశ్వాపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఎల్లయ్య మాట్లాడుతూ, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులను నమ్మవద్దని సూచించారు. ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు వెల్లడించవద్దని చెప్పారు. సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నందున అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఆన్‌లైన్ మోసాలకు గురైన వెంటనే జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ 1930 కు ఫిర్యాదు చేయడంతో పాటు, సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. అప్రమత్తతతో వ్యవహరిస్తే సైబర్ నేరాలను చాలా వరకు నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ముత్యాలరావు, అశ్వాపురం సర్పంచ్ బానోత్ సోదరులాల్, ఉప సర్పంచ్ తుళ్లూరి ప్రకాశ్‌రావు, పంచాయతీ కార్యదర్శి యాకూబ్, పోలీసు సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డకు రక్షణ కవచం

### అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాలు



**ఆళ్లపల్లి, ఆగస్టు 5(నినాదం):** మండల కేంద్రంలోని మర్కోడు గ్రామపంచాయితి అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మర్కోడు గ్రామపంచాయతీ సర్పంచ్ సుతారి రమాదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం అంతకుమించి బాలింతకు ఆరోగ్యకరం అని తెలిపారు. అంగన్వాడీ ఉపాధ్యాయులు పూనెం జయశ్రీ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే పాలు ఇవ్వడం ప్రారంభించాలి. అలా రెండేళ్ల వయసు వరకు ఇయ్యవచ్చు మొదటి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలే ఇవ్వాలి కానీ కొంతమంది తల్లులు తల్లిపాలు ఇస్తే శరీరాకృతిలో తేడా వస్తుందని భావించి శిశువుకు డబ్బా పాలు పట్టించడం వలన బిడ్డ ఎదుగుదల పై ప్రభావం చూపుతుందని, అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయి అని హెచ్చరించారు. పాలు పట్టించడం వల్ల శిశువు తో పాటు తల్లి కూడా ఆరోగ్యంగా ఉంటారు అని గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు అవగాహన కల్పించారు . ఈ వారోత్సవల్లో కొమరం జయచిత్ర, చందా కోటమ్మ, కొమరం సుభద్ర, కొమరం విజయ, పడిగ శిరీష, కొమరం లీలావతి, కోరం పద్మ, అంగన్వాడీ ఆయా కోరం లక్ష్మి మహిళా మండల నాయకురాలు ఎస్ కె పర్వీన్ గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు



## పాఠశాలలో డ్రైనేజీ సమస్యకు తక్షణ పరిష్కారం: బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి



**ఎల్బీ నగర్, ఆగస్ట్ 5, (నినాదం):** గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని త్యాగరాజ నగర్ కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో డ్రైనేజీ సమస్య కారణంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తాజా మాజీ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి కి స్థానికులు తెలియజేయగా, వెంటనే స్పందించారు. అనంతరం జలమండలి అధికారులతో కలిసి పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించి, డ్రైనేజీ సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరింపజేశారు. సమస్యకు తాత్కాలిక పరిష్కారం కాకుండా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జలమండలి సిబ్బంది శ్రీకాంత్, ప్రశాంత్, త్యాగరాజ నగర్ కాలనీ వాసులు మురళి, శ్రవణ్, బీజేపీ నాయకులు రఘునందన్ జోషి, వంశీ గంగపుత్ర, పవన్, రాము తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ నాయకురాలు జ్యోతి యాదవ్ భర్త అకస్మిక మృతి



**అల్వాల్, ఆగస్టు 5(నినాదం):** కాంగ్రెస్ మహిళ సీనియర్ నాయకురాలుటెంపుల్ అల్వాల్ 192 వ డివిజన్ అధ్యక్షులు జ్యోతియాదవ భర్త శ్రీనివాస్ యాదవ్ అకాల మృతి పట్ల వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము. శ్రీనివాస్ యాదవ్ ఆత్మకు శాంతి కలగాలని పలువురు పార్టీలకు అతీతంగా ప్రగాఢ సానుభూతి తెలిపారు

గురువారం । తెలంగాణ
6 ఆగస్టు 2026
# నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

## హెచ్‌పీవీ టీకాతో గర్భాశయ క్యాన్సర్‌కు శాశ్వత రక్షణ సాధ్యం: డాక్టర్ సృజన

### అర్హులైన ప్రతి బాలిక తప్పనిసరిగా వ్యాక్సిన్ తీసుకోవాలి..

### అపోహలకు తావివ్వొద్దు: డాక్టర్ సృజన




**బిజినపల్లి, మండలం ఆగస్టు 5 నినాదం:** గర్భాశయ క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధిని హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) టీకాతో సమర్థవంతంగా నివారించవచ్చని, 9 నుంచి 14 సంవత్సరాల వయస్సు గల ప్రతి బాలిక తప్పనిసరిగా ఈ వ్యాక్సిన్ తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ సృజన పిలుపునిచ్చారు. బిజినపల్లి పట్టణంలోని ఆల్ సెయింట్స్ మోడల్ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థినులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా హెచ్‌పీవీ వైరస్ కారణంగా గర్భాశయ క్యాన్సర్ వచ్చే ప్రమాదం అధికంగా ఉంటుందని, అయితే సరైన వయస్సులో టీకా తీసుకుంటే భవిష్యత్తులో ఆ వ్యాధి బారిన పడకుండా రక్షణ పొందవచ్చని స్పష్టం చేశారు. హెచ్‌పీవీ టీకాపై ప్రజల్లో ఉన్న అపోహలను పూర్తిగా వీడి, అర్హులైన ప్రతి బాలిక వ్యాక్సిన్ తీసుకునేలా తల్లిదండ్రులు ముందుకు రావాలని సూచించారు. మహిళల ఆరోగ్య సంరక్షణలో హెచ్‌పీవీ టీకా ఒక కీలక రక్షణ కవచమని, ముందస్తు జాగ్రత్తే ప్రాణాలను కాపాడగలదని ఆమె పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినులు అడిగిన ప్రశ్నలకు డాక్టర్ సృజన సమగ్రంగా సమాధానాలు ఇచ్చి టీకా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. హెల్త్ సూపర్‌వైజర్ బి. సుజాత, ఏఎన్ఎం శ్వేత, ఆశా కార్యకర్తలు చెన్నమ్మ, సరస్వతి కూడా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. పాఠశాల యాజమాన్యం జోసఫ్, రీతూ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో బాలికల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాలకు విచ్చేసి హెచ్‌పీవీ టీకా ప్రాధాన్యాన్ని వివరించిన డాక్టర్ సృజనతో పాటు వైద్య సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొని ఆసక్తిగా విని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారుఠ

## సైబర్ మోసాలకు అడ్డుకట్ట వేయాలి

### సైబర్ భద్రతపై అవగాహన అవసరం: జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర.




**బిక్కనూరు, ఆగస్టు 5 (నినాదం):** ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. బిక్కనూరు మండలంలో నిర్వహించిన సైబర్ నేరాల అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఫోన్ కాల్స్, నకిలీ లింకులు, ఓటీపీలు, క్యూ ఆర్ కోడ్‌లు, సోషల్ మీడియా ద్వారా సైబర్ మోసాలు జరుగుతున్నాయని తెలిపారు. అపరిచితులకు బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం, డెబిట్, క్రెడిట్ కార్డు వివరాలు, ఓటీపీలు, యూపీఐ పిన్ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఇవ్వవద్దన్నారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెరగడం చాలా అవసరమన్నారు. అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులను నమ్మవద్దని, ఏదైనా అనుమానం వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటే సైబర్ నేరాలను చాలా వరకు నివారించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా సైబర్ మోసాల నుంచి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించి, సైబర్ భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డి ఎస్ పి మధుసూదన్, గ్రామ సర్పంచ్ రేఖ సుదర్శన్, సీఐ జగడం నరేష్, ఎస్ఐ అనిల్, పోలీస్ సిబ్బంది, ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు, ప్రజాప్రతినిధులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

### బి ఏనుగు రాకేష్ రెడ్డి.




**మిర్యాలగూడ ఆగస్టు 5( నినాదం ):** 317 జీవోను రద్దు చేసి వెంటనే మెగా డీఎస్సీ ని ప్రకటించి నిరుద్యోగులకు న్యాయం చేయాలని బి ఆర్ఎస్ పార్టీ నాయకులు ఏనుగు రాకేష్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మిర్యాలగూడలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ రేవంత్ పాలనలో తెలంగాణలో విద్యా వ్యవస్థ కుంటుపడిందని రెండు లక్షల ఉద్యోగాలను చెప్పిన రేవంత్ నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లారని అధికారంలోకి రాగానే 317 జీవో రద్దు చేస్తామని ఇప్పటివరకు మాట ఎత్తడం లేదని విమర్శించారు. సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపిఎస్ తీసుకొస్తామని చెప్పి మాట తప్పారని ఉద్యోగులకు ఇప్పటివరకు పిఆర్సీ కూడా ప్రకటించలేదని ఆరు పీఆర్సీలు పెండింగ్ లో ఉన్నాయని దుయ్యబట్టారు. తెలంగాణకు ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రిని కూడా కేటాయించలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎన్.బి .ఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్ధార్థ, బి ఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎండి. ఇలియాస్ ఖాన్, పెద్ది శ్రీనివాస్ గౌడ్, ఎండి. మగ్దుం పాషా, ధనావత్ చిట్టిబాబు నాయక్, గంగుల బిక్షం యాదవ్, యర్రమల్ల దినేష్, ఎండి. షోయబ్, చీదల్ల వెంకటేశ్వర్లు, పునాటి లక్ష్మీనారాయణ, భూక్య రాంబాబు, ఎక్క మనిదీప్, వల్లపట్ల వినోద్, గయాస్, గంట శ్రావణ్ రెడ్డి, రఫీ, వీర నాయక్, వడ్త్య శివ నాయక్, రామావత్ వినోద్ నాయక్, షేక్ మస్తాన్, అలీం, దోనేటి సైదులు, తుమ్మల ఫణి కుమార్, కాతోజు వినోద్ కుమార్, కోర్రపిడత లింగారాజు, మహిమూద్, రాజేష్, షేక్ ఫయాజ్, నాగరాజు, అబిలాస్, వినయ్, నాగయ్య, చిన్న నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# తక్షణమే పీఆర్సీ ప్రకటించాలి

### – టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాస్ గౌడ్






**పెబ్బేరు ఆగస్టు 05 (నినాదం):** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీఎస్‌యూటీఎఫ్ పెబ్బేరు మండల యూనియన్ సభ్యత్వ నమోదు ప్రచార కార్యక్రమంలో భాగంగా రెండు రోజుల పాటు జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాస్ గౌడ్ జెడ్పి, ఎంపీపీఎస్, మోడల్ స్కూల్, కేజీబీవీతో పాటు పలు ప్రభుత్వ విద్యాసంస్థలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సమావేశమై విద్యారంగ సమస్యలు, ప్రభుత్వ పాఠశాలల పరిస్థితులు, ఉద్యోగుల పెండింగ్ డిమాండ్లపై విస్తృతంగా చర్చించారు. సమస్యల పరిష్కారం కోసం టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టనున్న దశలవారీ పోరాట కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు ఐక్యంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నూతన పీఆర్సీని ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ ఉద్యోగుల పెండింగ్ ఏరియర్స్ బిల్లులనువెంటనే చెల్లించాలని కోరారు. జీఓ నెం. 25ను సవరించి ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని, 40 మంది విద్యార్థులు ఉన్న ప్రతి పాఠశాలలో తరగతికో ఉపాధ్యాయుడిని కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. సీపీఎస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 హెడ్ ఆఫ్ అకౌంట్ ద్వారా వేతనాలు చెల్లించాలని, కేజీబీవీ ఉద్యోగులకు టైమ్ స్కేల్ అమలు చేసి సమ్మె కాలపు వేతనాలను విడుదల చేయా లని కోరారు. అలాగే మోడల్ స్కూల్, గురుకుల, కేజీబీవీ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు హెల్త్ కార్డుల సౌకర్యాన్ని వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఆగస్టు 7న పాఠశాల స్థాయిలో నిరసన కార్యక్రమాలు, ఆగస్టు 12, 13 తేదీల్లో మండల కేంద్రాల్లో వినతిపత్రాల సమర్పణ, ఆగస్టు 19న జిల్లా కేంద్రంలో ధర్నా, చివరిగా ఆగస్టు 29న రాష్ట్ర రాజధానిలో మహాధర్నా నిర్వహిం చనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలు పునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తిమ్మప్ప, చెన్నకేశవ్, మండల అధ్యక్షుడు నరసింహ, ప్రధాన కార్యదర్శి నరసింహ, మండల కోశాధికారి శ్రీనివాసులు, నాయకులు వెంకటేశ్వర్లు, సమీ, గోపాల్ నాయక్ పాల్గొన్నారు.

## కార్పొరేట్ సేవలో పాలకులు.. కార్మికుల బడ్జెట్‌లో మొండిచేయి..

### మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి..

### సిఐటియు మండల కన్వీనర్ మురిహరి రఘు డిమాండ్..



**దమ్మపేట, ఆగస్టు 5(నినాదం):** కేంద్ర బడ్జెట్‌లో మధ్యాహ్న భోజన కార్మికులకు నిధులు కేటాయించకుండా, జీతాలు పెంచడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సిఐటియు మండల కన్వీనర్ మురిహరి రఘు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) జగపతిని కలిసి, ఈ నెల 10వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించనున్న 'జైలు భరో' ఆందోళన కార్యక్రమ పోస్టర్‌ను విడుదల చేసి, వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మురిహరి రఘు మాట్లాడుతూ.. ఆకాశాన్నంటుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచడంలో పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కష్టజీవుల సంక్షేమాన్ని తుంగలో తొక్కి, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నాయని విమర్శించారు. నేడు దేశాన్ని ప్రజాప్రతినిధులు కాకుండా బహుళజాతి కంపెనీల దిగ్గజాలు శాసిస్తున్నాయని, 'క్విట్ ఇండియా' స్ఫూర్తితో కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా కార్మికులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రప్రభుత్వం సైతం ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు తక్షణమే రూ. 10,000 వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో వంటకు అవసరమైన గ్యాస్ సిలిండర్లు, కోడిగుడ్ల ఖర్చును ప్రభుత్వమే నేరుగా భరించాలన్నారు. ఈ న్యాయమైన డిమాండ్ల సాధనకై ఈ నెల 10న జరిగే 'జైలు భరో' కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కవులూరి రామకృష్ణ, సత్యవతి, జయ, ఈశ్వరమ్మ, సుగుణ, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.


## ప్రభుత్వ బాలికల పాఠశాలకు ప్రింటర్ ను అందజేసిన సార్ప్ స్వచ్ఛంద సంస్థ




**యాదాద్రి భువనగిరి ఆగస్టు 5 నినాదం :** ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు సౌకర్యార్థం కోసం 'సార్ప్' స్వచ్ఛంద సంస్థసొసైటీ ఫర్ యాక్షన్ విత్ రూరల్ పూర్ ఎన్జీఓ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఒక ప్రింటర్‌ను విరాళంగా అందజేశారు. లండన్‌లో నివసిస్తున్న ఎన్. అనిత తన భర్త డాక్టర్ ఎన్. రాజేంద్రప్రసాద్ జన్మదినాన్ని (జూలై 20) పురస్కరించుకుని ఈ ప్రింటర్‌ను స్పాన్సర్ చేశారు. సార్ప్ ఎన్జీఓ అధ్యక్షురాలు డాక్టర్ బి. ప్రమీల ఆధ్వర్యంలో పా ఠశాల ప్రధానో పాధ్యాయులకు, విద్యార్థినులకు ఈ ప్రింటర్‌ను అందించారు. ఈ సందర్భంగా ఎన్. అనిత పంపిన సందేశాన్ని నిర్వాహకులు చదివి వినిపించారు. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న ఈ రోజుల్లో పాఠశాలకు ప్రింటర్ ఎంతో అవసరమని, ఇది బాలికల విద్యాభివృద్ధికి, వారి సాధికారతకు ఎంతో ఉపయోగపడుతుందని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ కౌన్సిలర్లు సుచరిత రెడ్డి, బర్రె పూజిత, సఖి సెంటర్ కౌన్సిలర్ వెన్నెల ప్రోగ్రాం మేనేజర్ సూరి నేని శ్రీనివాస్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని చదువుకోవాలని, సమాజంలో ఆదర్శప్రా యమైన మహిళలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా బాలికల సాధికారత, విద్య యొక్క ప్రాముఖ్యత మరియు మహిళలు, పిల్లల రక్షణ కోసం ప్రభుత్వం అందుబాటులో ఉంచిన టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ల వినియోగంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. పాఠశాల విద్యాభివృద్ధికి మద్దతుగా నిలిచి ప్రింటర్ అందించిన ఎన్. అనిత – డాక్టర్ రాజేంద్రప్రసాద్ దంపతులకు 'సార్ప్' ఎన్జీఓ ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేక హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మా స్టర్, సార్ప్ సంస్థ వ్యవస్థాపకులు బర్రె సుదర్శన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేష్, సార్ప్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఇల్లందు జడ్జి స్వరూపకు న్యాయ శాస్త్రంలో డాక్టరేట్

**ఇల్లందు ఆగస్టు 05(నినాదం ):** ఇల్లందు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న స్వరూప కమటం కు ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి న్యాయ విభాగంలో గౌరవ డాక్టరేట్ పట్టా దక్కింది. అరుదైన ఘనత సాధించిన ఇల్లందు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ స్వరూప కాటం ఉస్మానియా యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, గైడ్ ప్రొఫెసర్ ఎస్. బి. ద్వారకానాథ్ , ప్రొఫెసర్ విజయలక్ష్మి చేతుల మీదుగా ఇటీవల కాలంలో స్వీకరించినారు. ఈ సందర్భంగా బుధవారం ఇల్లందు బార్ అసోసియేషన్ సభ్యులు కోర్టు సిబ్బంది మెజిస్ట్రేట్ స్వరూప కమటం ను కోర్టు హాల్ నందు పుష్పగుచ్చం ఇచ్చి శాలువాతో ఘనంగా సత్కరించి, కేక్ కటింగ్ చేయించినారు, అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ వారు మాట్లాడుతూ, ప్రతిష్టాత్మక ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ సాధించడం ఆనందంగా ఉందని నా తల్లి దండ్రుల ప్రోత్సాహం వల్లే ఈ స్థితికి చేరగలిగానని, ప్రతి ఒక్కరు కష్టపడి చదివి వారి భవిష్యత్తుకు వాళ్ళ పునాదులు వేసుకోవాలని, ఇతర విషయాలపై దృష్టి పెట్టకుండా విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని, విద్య మంచి మార్గంలో నడిపిస్తుందని మార్గదర్శకులుగా మారాలని ఈ సందర్భంగా తెలిపినారు. అనంతరం బార్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ఇంతటి ప్రతిష్టాత్మక ఘనత సాధించిన జడ్జిగారు మన ఇల్లందు కోర్టుకు రావడం గర్వకారణం అని వారు ఎంచుకున్న అంశం రైట్ టు ఈక్వల్ ప్రొటెక్షన్ ఆఫ్ లా అండర్ ది కాన్స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా అనే అంశం ఎంచుకొని సాధించిన తీరు స్ఫూర్తిదాయకమని, అంకిత భావానికి నిదర్శనమని, వారు ఎల్.ఎల్.బి, ఎల్ ఎల్ ఎం విద్యను అభ్యసించే సమయంలో మూడు బంగారు పతకాలు సాధించి విశ్వవిద్యాలయాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చారని వారు ఇల్లందు కోర్టుకు రావడం సేవలు అందించడం మన అందరి అదృష్టంగా భావిస్తున్నామని ముమ్మందు ఇలాంటి మరెన్నో డాక్టరేట్లు సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరుకుంటున్నామని తెలిపినారు. ఈ కార్యక్రమంలో జడ్జి తో పాటు ఇల్లందు బార్ అసోసియేషన్ సభ్యులు సీనియర్, జూనియర్, మహిళ న్యాయవాదులు, డి.ఎస్.పి వెంకన్నబాబు కోర్టు సూపరెంట్ శ్రీరంగం రామ కృష్ణ, కోర్టు సిబ్బంది పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






### పండరి–స్వరూప కుటుంబానికి శ్రీ మాత సేవ ట్రస్ట్ అండ

**కామారెడ్డిప్రతినిధి, ఆగస్టు 5(నినాదం):** కామారెడ్డి జిల్లా పెద్దకొడప్గల్‌కు చెందిన పండరి--స్వరూప కుటుంబం వరుస విషాదాలు, అనారోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ విషయం తెలుసుకున్న శ్రీ మాత సేవ చారిటబుల్ ట్రస్ట్ "నెలకొక మంచి పని--నెలకొక సేవ" కార్యక్రమంలో భాగంగా బుధవారం కుటుంబానికి 25 కిలోల బియ్యం, కిరాణా సామగ్రి, కూరగాయలను అందజేసింది. భవిష్యత్తులోనూ ఆర్థికంగా అండగా ఉంటామని ట్రస్ట్ సభ్యులు హామీ ఇవ్వగా, దాతలు ముందుకు వచ్చి ఈ కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.



### డిగ్రీ స్పెషల్ ఫేజ్ అడ్మిషన్ల కోసం చివరి అవకాశం



**కొడంగల్, ఆగస్టు 05(నినాదం) :** ప్రభు త్వ డిగ్రీ కళాశాల కొడంగల్ లో దోస్త్ ద్వారా డిగ్రీ చివరి ఫేజ్ అడ్మిషన్ల ప్రక్రియ రేపటి నుండి ప్రారంభమ వుతుందని ప్రిన్సిపాల్ డా. బి. శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 06 వ తేదీ నుండి 11 వ తేదీ వరకు రిజిస్ట్రేషన్స్, మరియు 12వ తేదీ వం–కు వెబ్ ఆప్షన్స్ కి అవకాశం ఉంటుందని ఆయన తెలి పారు. దోస్త్ చివరి దశలో చేరిన విద్యా ర్థులకు కూడా స్కాలర్షిప్ మరియు ఫీజు రీఇంబర్స్ మెంట్ వర్తిస్తుందని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకో వాలని తెలియజేశారు. బి. ఎ, బి. కామ్, కంప్యూటర్ అప్లికేషన్స్ బి. ఎస్సీ బి. జడ్. సి , ఎం. పి. సి , ఎం. పి. సి. ఎస్ మరియు బి. ఎస్సీ హెల్త్ కేర్ కోర్సులలో సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇతర వివరాలకు కళాశాలలోని కార్యాలయంలో సంప్రదిం చాలన్నారు.

## గుడుంబా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

### 2 లీటర్ల గుడుంబా స్వాధీనం



**ఎల్బీనగర్, ఆగస్ట్ 5,(నినాదం):** గుట్టుచప్పుడు కాకుండా గుడుంబా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన సంఘటన సరూర్ నగర్ పోలీసులు బుధవారం చోటుచేసుకుంది. సిఐ శ్రీశైలం యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చంపాపేట్ అంజి రెడ్డి నగర్ హాట్స్ ప్రాంతంలో దేపావత్ వెంకట్ రామ్ అక్రమంగా నాటుసారా నిల్వ చేసి విక్రయిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు దాడి నిర్వహించినట్లు తెలిపారు. దాడి సమయంలో సుమారు 2 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొన్నట్లు వెల్లడించారు. నిందితుడిపై తెలంగాణ నిషేధ చట్టం, ఇతర సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేయబడినట్లు తెలిపారు. దర్యాప్తు కొనసాగుతోందన్నారు. సరూర్‌నగర్ పోలీసులు, పోలీస్ స్టేషన్ పరిధిలో నాటుసారా తయారీ, నిల్వ, రవాణా, విక్రయాలలో పాల్గొనే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలు గమనించిన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

## పెద్ది సంతాప సభకు విస్తృత ఏర్పాట్లు

### స్థలాన్ని పరిశీలించిన పోచంపల్లి, ఎర్రబెల్లి.



**నల్లబెల్లి, ఆగస్టు 5(నినాదం):** ఈ నెల 10న నిర్వహించనున్న మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పెద్ది సుదర్శన్‌రెడ్డి సంతాప సభ విజయవంతానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులుఏర్పాట్లను ముమ్మరం చేశారు. సభా వేదిక ఏర్పాట్లు, ప్రజల రాకపోకలు, పార్కింగ్, ఇతర మౌలిక సదుపాయాలపై బుధవారం పార్టీ ముఖ్య నేతలు స్థల పరిశీలన నిర్వహించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రజానాయకుడు పెద్ది సుదర్శన్‌రెడ్డికి నివాళిగా నిర్వహించే సంతాప సభకు పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కూడా ఏర్పాట్లను పరిశీలించి సభను క్రమబద్ధంగానిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలనిసూచించారు. స్థల పరిశీలనలో వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవ్‌రెడ్డి, మాజీ చైర్మన్ మర్రి యాదవ్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భరత్‌కుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు డాక్టర్ బానోత్ సారంగపాణి, జిల్లా, మండల, గ్రామస్థాయి పార్టీ నాయకులు పాల్గొ న్నారు. సభకు భారీగా ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లు పకడ్బందీగాచేపడుతున్నట్లు నాయకులు తెలిపారు.

తుమ్మలచెరువులో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు..

## తల్లి పాలతోనే శిశువులకు సంపూర్ణ ఆరోగ్యం

### –సీడీపీఓ మంగతార



**అశ్వాపురం, ఆగస్టు 5 (నినాదం):** తల్లి పాలు శిశువులకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించే అమూల్యమైన ఆహారమని బూర్గంపాడు ప్రాజెక్టు సీడీపీఓ మంగతార అన్నారు. అశ్వాపురం మండలం లోని తుమ్మలచెరువు రైతు వేదికలో బుధవారం మల్లెలమడుగు సెక్టార్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీఓ మంగతార మాట్లాడుతూ, పుట్టిన తొలి గంటలోనే శిశువుకు తల్లిపాలు ఇవ్వడం ఎంతో అవసరమని తెలిపారు. తొలి ఆరు నెలల పాటు శిశువుకు తల్లిపాలు మాత్రమే అందించాలని, అవి శిశువు ఎదుగుదలకు, వ్యాధి నిరోధక శక్తి పెంపొందించేందుకు ఎంతో దోహదపడతాయని వివరించారు. తల్లిపాల ప్రాము ఖ్యతపై గర్భిణీలు, బాలింతలకు అవగాహన కల్పించా రు. అ నంతరం గర్భిణీకి సంప్రదాయబద్ధంగా శ్రీమంతం నిర్వహించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ ధనలక్ష్మి, తుమ్మలచెరువు గ్రామ సర్పంచ్ నరేష్, గ్రామ కార్యదర్శి దినేష్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణీలు, బాలింతలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### ఎండోమెంట్ భూముల్లో

## అక్రమ దుకాణాల తొలగింపు



**అమరచింత, ఆగస్టు 5, (నినాదం):** ఆత్మకూరు పురపాలక సంఘం పరిధిలో ఉన్న ఎండోమెంట్ భూముల్లో అక్రమంగా వెలిసిన దుకాణాలను బుధవారం మున్సిపల్ అధికారులు తొలగించారు. పురపాలక సంఘం పరిధిలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) ఆదేశాల మేరకు, ఎండోమెంట్ భూముల్లో ఏర్పాటు చేసిన అక్రమ దుకాణాలను మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది సంయుక్తంగా తొలగించారు. ఎండోమెంట్ భూములను ఆక్రమించి ఏర్పాటు చేసిన మిగిలిన దుకాణాల యజమానులను కూడా వెంటనేఆక్రమణలను తొలగించి, స్థలాలను ఖాళీ చేయాలని అధికారులు హెచ్చరించారు. ప్రభుత్వ/ఎండోమెంట్ భూములను ఎటువంటి అనుమతులు లేకుండా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామనిఅధికారులు స్పష్టం చేశారు. ప్రజలు ప్రభుత్వ భూములను ఆక్రమించకుండా, అధికారుల సూచనలను పాటించాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ సీత్యా నాయక్, టీబీ పి ఓ రాజు, మున్సిపల్ రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# నినాదం
## తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం


## గుడుంబాపై ఎక్సైజ్ శాఖ ఉక్కుపాదం - 9 మంది అరెస్ట్



**కాటారం, ఆగస్టు 05(నినాదం):**
అక్రమ గుడుంబా తయారీ, విక్రయాలపై ఎక్సైజ్ శాఖ ఉక్కుపాదం మోపింది. కాటారం డివిజన్ పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం ఎక్సైజ్ అధికారులు, స్టేట్ టాస్క్ ఫోర్స్ (ఎస్ టి ఎఫ్), డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ (డి టి ఎఫ్) సంయుక్తంగా విస్తృత దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గుడుంబా తయారీకి ఉపయోగిస్తున్న భారీ మొత్తంలో పులియబెట్టిన చెక్కర పానకాన్ని ధ్వంసం చేయడంతో పాటు 9 మంది నిందితులను అరెస్ట్ చేశారు.కాటారం సర్కిల్ ఎక్సైజ్ సీఐ కిష్టయ్య తెలిపిన వివరాల ప్రకారం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కాటారం, పలిమెల, మహాముత్తారం, మహాదేవపూర్ మండలాల పరిధిలోని రెడ్డిపల్లి, పెగడపల్లి, యత్నారం, ముకునూర్, సర్వాయిపేట, పలిమెల, అంబట్పల్లి, సూరారం, కాటారం గ్రామాల్లో ప్రత్యేక బృందాలు ఏకకాలంలో దాడులు చేపట్టాయి. కాటారం ఎక్సైజ్ సీఐ కిష్టయ్య, డీటీఎఫ్ సీఐ రాజసమ్మయ్య, ఎస్టీఎఫ్ ఎస్సై శోభ, కాటారం పీఎస్సై విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో సుమారు 1,400 లీటర్ల పులియబెట్టిన చెక్కర పానకాన్ని ధ్వంసం చేసి, 33 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనలకు సంబంధించి 8 కేసులు నమోదు చేసి, గుడుంబా తయారీలో పాల్గొన్న 9 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. అక్రమంగా గుడుంబా తయారీ, నిల్వ, విక్రయాలకు పాల్పడే వారిపై ఇకపై మరింత కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ కిష్టయ్య హెచ్చరించారు.

## వ్యవసాయ, ఉద్యానవన అభివృద్ధి ప్రణాళిక తయారీ కోసం నిపుణుల బృందం ఏర్పాటు



**కొడంగల్, ఆగస్టు 05(నినాదం):**
తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, ప్రముఖ పరిశోధనా సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, భారత ప్రభుత్వ సంస్థలు మరియు అభివృద్ధి సంస్థలకు చెందిన శాస్త్రవేత్తలు మరియు నిపుణులతో కూడిన బహుళ–శాఖల నిపుణుల బృందాన్ని 2026 ఆగస్టు 5 మరియు 6 తేదీలలో కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గంలో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించేందుకు ఏర్పాటు చేయడం జరిగింది. బృందం వ్యవసాయం మరియు ఉద్యానవన రంగాల ప్రస్తుత స్థితిని సమగ్రంగా పరిశీలించి, వ్యవసాయం మరియు అనుబంధ రంగాలలో ఉన్న ప్రధాన లోపాలు, అవకాశాలను గుర్తించి, స్థిరమైన వ్యవసాయాభివృద్ధి మరియు రైతుల జీవనోపాధి మెరుగుదలకు తగిన కార్యాచరణ సూచనలను అందిస్తుంది. క్షేత్రస్థాయి పరిశీలనలు మరియు సంబంధిత భాగస్వాములతో నిర్వహించిన సంప్రదింపుల ఆధారంగా, ప్రస్తుత లోపాలను గుర్తించి, కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గంలో వ్యవసాయ మరియు ఉద్యానవన రంగాల సమగ్రాభివృద్ధితో పాటు రైతుల స్థిరమైన జీవనోపాధి పెంపొందించేందుకు స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక కార్యాచరణ సూచనలను బృందం రూపొందిస్తుంది. క్షేత్రస్థాయి పర్యటన పూర్తయిన వెంటనే, తన సిఫార్సులతో కూడిన సమగ్ర నివేదికను ప్రభుత్వం వారికి బృందం సమర్పిస్తుంది.

## సైబర్ నేరాలపై గుండాలలో అవగాహన – సీఐ తిరుపతి



**గుండాల, ఆగస్టు 5 (నినాదం):**
తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "సురక్షా కా తిరంగా" కార్యక్రమంలో భాగంగా గుండాల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ కళాశాలలకు చెందిన సుమారు 100 మంది విద్యార్థులకు సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుండాల సీఐ తిరుపతి మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగంలో ప్రతి ఒక్కరూ సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా కెవైసి మోసాలు, డీప్‌ఫేక్ మోసాలు, డిజిటల్ అరెస్ట్ మోసాలు, సోషల్ మీడియా ఫేక్ ప్రొఫైల్ మోసాలు, పెట్టుబడి (ఇన్వెస్ట్‌మెంట్) మోసాలు, ఫేక్ లింక్ మోసాలు వంటి సైబర్ నేరాల గురించి విద్యార్థులకు వివరించారు. తెలియని వ్యక్తులతో బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, పిన్ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని సూచించారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకుండా ముందుగా వాటి విశ్వసనీయతను నిర్ధారించుకోవాలని చెప్పారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వేదికల్లో అపరిచితులతో పరిచయాలు పెంచుకుని మోసపోవద్దని, ఫేక్ ప్రొఫైళ్లు, డీప్‌ఫేక్ వీడియోలు, అధిక లాభాల పేరుతో వచ్చే పెట్టుబడి ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అలాగే పోలీసుల పేరుతో ఫోన్ చేసి డబ్బులు లేదా వ్యక్తిగత వివరాలు అడిగితే నమ్మవద్దని, పోలీసులు ఫోన్ ద్వారా ఎప్పుడూ డబ్బులు అడగరని స్పష్టం చేశారు.సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్కు కాల్ చేయాలని వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. విద్యార్థులు సైబర్ భద్రతపై అవగాహన పెంపొందిం చుకుని, తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా ఈ సమాచారాన్ని చేరవే యాలని అధికారులు పిలుపునిచ్చారు.గుండాల ఎస్ఐ శ్రవణ్ మాట్లాడుతూ, అప్రమత్తంగా ఉండండి, అవగాహన పెంచుకోండి, సైబర్ నేరాల నుండి సురక్షితంగా ఉండండి అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన

**పాలకవీడు, ఆగస్టు 5(నినాదం):**
పాలకవీడు పోలీస్ స్టేషన్ పరిధిలోని బొత్తాలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సైబర్ నేరాలపై ముమ్మర అవగాహన సదస్సు నిర్వహించారు. పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సురక్ష కా తిరంగా – టువర్డ్స్ ఎ సైబర్ ఇండిపెండెంట్ తెలంగాణ' కార్యక్రమంలోభాగంగా.పాలకవీడు సబ్ ఇన్స్పెక్టర్ రువ్వ కోటేశ్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులకు ఆన్‌లైన్ మోసాల పట్ల అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, సాంకేతికత అందుబాటులోకి వచ్చిన తర్వాత సైబర్ నేరగాళ్లు సరికొత్త పద్ధతుల్లో విద్యార్థులను, ప్రజలను మోసం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు చిన్న వయసు నుంచే డిజిటల్ భద్రతా నియమాలను తెలుసుకోవాలని పేర్కొంటూ జాగ్రత్తలను వివరించారు.

# ప్రజలకు కనిపించేలా పోలీసుల సేవలు అందించాలి

**పోలీస్‌స్టేషన్‌లో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి తనిఖీ**






**చేవెళ్ల, ఆగస్టు 5( నినాదం):-**
ప్రజలకు పోలీసుల ఉనికి స్పష్టంగా కనిపించేలా సేవలు అందించాలని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి సూచించారు. సైబర్ నేరాలు, చట్టాలు, రహదారి భద్రతపై నిరంతరం అవగాహన కల్పిస్తూ ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బుధ వారం చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన కమిషనర్ స్టేషన్ భవనం, పరిసరాల పరిశుభ్రత, భద్రతా ఏర్పాట్లు, రికార్డుల నిర్వహణ ను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న తీవ్ర మైన కేసులు, విచారణలో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ రికార్డులను క్రమపద్ధతిలో నిర్వహిస్తూ నేర, న్యాయ సమాచార వ్యవస్థ, ఎలక్ట్రానిక్ సాక్ష్యాల వ్యవస్థలను సమర్థవంతంగా విని యోగించాలని తెలిపారు. సైబర్ నేరాల నివారణ, గుర్తింపుపై ప్రత్యేక దృష్టి సారించి బాధితులకు సత్వర సేవలు అందించాలన్నారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్క నాటిన కమిషనర్.. ప్రతి పోలీసు అధికారి మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని సూచించారు. అనంతరం పురుషుల బ్యారక్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో చేవెళ్ల జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ యోగేష్ గౌతమ్, ఐపీఎస్, చేవెళ్ల డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ బి. కిషన్, చేవెళ్ల పోలీస్‌స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ కె. నరేందర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## చేనేత కార్మికులకు మెమెంటోలు అందజేసిన సినీనటి అమల

**అమరచింత, ఆగస్టు 5, (నినాదం):**
జాతీయ చేనేత దినోత్సవం (ఆగస్టు 7)సందర్భంగా భారత ప్రభుత్వ వస్త్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాదులోని శిల్పారామం వద్ద నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అమరచింత చేనేత కార్మికులు పాల్గొన్నారు.భారత ప్రభుత్వ వస్త్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, చేనేత అభివృద్ధి కమిషనర్ కార్యాలయం నేత కార్మికుల సేవా కేంద్రం, హైదరాబాద్ ప్రత్యేక ఆహ్వానంతో 12వ,జాతీయ చేనేత దినోత్సవం--2026సందర్భంగా హైదరాబాద్ లోని శిల్పారామం,మాదాపూర్‌లో అవగాహన ప్రచార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్,సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు , ప్రముఖ సినీనటి, బ్లూ క్రాస్ వ్యవస్థాప కురాలు అక్కినేని అమల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అమరచింత వాసి తిరుమల రమేష్, అమరచింత చేనేత కార్మికులతో కలిసి అమరచింత చేనేత కార్మికులను అక్కినేని అమల శాలువాలు, మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేసి ఘనంగా సత్కరించారు. చేనేత కార్మికులు పాల్గొన్నారు.



## కాళేశ్వరం గోదావరిలో మునిగి గుర్తుతెలియని వ్యక్తి మృతి



**మహాదేవపూర్ ఆగస్టు 5, (నినాదం)**
: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం గోదావరి నదిలో ప్రమాదవశాత్తు మునిగి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. కాళేశ్వరం ఎస్సై తమాషా రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సుమారు 60 సంవత్సరాలు కలిగిన వ్యక్తి గోదావరి నదిలో స్నానమాచరిస్తుండగా ప్రమాదవశాత్తు మృతి చెందాడని, అక్కడ ఉన్న జాలర్లు వెతికి తీయగా అతని వివరాలు తెలియ రాలేదని వివరించారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే స్థానిక పోలీస్ స్టేషన్ 8712658115, 8712658137 నెంబర్లకు ఫోను చేసి వివరాలు అందివ్వాలని కోరారు.

# విద్యుదాఘాతంతో రైతు మృతి





**హుజుర్‌నగర్ (మఠంపల్లి) ఆగస్టు 04 (నినాదం ):**
మఠంపల్లి మండలంలోని బక్కమంతులగూడెం గ్రామానికి చెందిన నిమ్మల నరేష్ మంగళవారం పొలంలో మోటార్ ఆన్ చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు.ఎస్ఐ బి. ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, ఉదయం సుమారు 6:30 గంటలకు చౌటపల్లి గ్రామ శివారులో తనకు చెందిన ఎకరం పొలంలోని మోటార్‌ను స్టార్ట్ చేయడానికి నరేష్ వెళ్లాడు. మోటార్‌కు ఉన్న స్టార్టర్ నుంచి పొలం చుట్టూ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌లోని అల్యూమినియం తీగలకు ప్రమాదవశాత్తు విద్యుత్ ప్రవహించింది. ఈ క్రమంలో నరేష్ ఫెన్సింగ్‌కు ఉన్న ఇనుప కంచెను పట్టుకోగా తీవ్ర విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు.ఈ ఘటనపై మృతుడి తండ్రి నిమ్మల బుర్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మట్టంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు నరేష్‌కు భార్యతో పాటు ఇద్దరు చిన్నారులు ఉన్నారు. ఆయన ఆకస్మిక మృతితో గ్రామంలో, కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

## హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి : ఐఎఫ్‌టీయూ డిమాండ్



**కొత్తగూడెం, ఆగస్టు 5(నినాదం):**
హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం రూపొందించి ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అంకిత్‌కు, ఏసీఎల్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కు సారంగపాణి మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్లు, కూరగాయల మార్కెట్లు, గోదాములు, రైస్ మిల్లులు, సిమెంట్, ఎరువుల గోదాములు, రవాణా రంగాల్లో హమాలీలు నిత్యం కష్టపడి పనిచేస్తున్నప్పటికీ వారికి ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, వైద్య సదుపాయాలు, పెన్షన్, ప్రమాద బీమా వంటి కనీస హక్కులు కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.హమాలీ కార్మికులకు ఉపాధి భద్రత కల్పించే సమగ్ర చట్టాన్ని రూపొందించి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, 50 సంవత్సరాలు నిండిన కార్మికులకు నెలకు రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలని, ఈపీఎఫ్, ఈఎస్ఐ, బోనస్, గ్రూప్ ఇన్సూరెన్స్, ప్రమాద బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే విధి నిర్వహణలో ప్రమాదాలకు గురైన కార్మికులకు తగిన నష్టపరిహారం, మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం లేదా జీవన భృతి కల్పించాలని, మహిళా హమాలీ కార్మికులకు ప్రత్యేక రక్షణతో పాటు ప్రసూతి సెలవులు అమలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పందిర్లపల్లి వీరన్న, జిల్లా కార్యదర్శి యాసారపు వెంకన్న, సహాయ కార్యదర్శి కొప్పుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మేకల వినోద్, నాయకులు బి. కిషన్, చేబోతు రవి, మెంతిని నాగేష్, బాల్య కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## యంగ్ ఎర్త్ లీడర్స్‌తో పర్యావరణ పరిరక్షణకు నూతన దిశ

**ఆమనగల్లు, ఆగస్టు 05(నినాదం):**
విద్యార్థుల్లో చిన్న వయసు నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన, బాధ్యత పెంపొందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంయుక్త నిర్వహిస్తున్న యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రామ్ రెండ్రోజుల శిక్షణా కార్యక్రమం బుధవారం రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం అన్మాస్పల్లిలోని ది ఎర్త్ సెంటర్లో ప్రారంభమైంది.కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ వ్యవస్థాపకులు కే. లక్ష్మారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పర్యావరణ వేత్త ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి , కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డి లు పాల్గొని మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించాలంటే పాఠశాల స్థాయి నుంచే పర్యావరణ విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని వారు అన్నారు .రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల ఉపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ శిక్షణలో పర్యావరణ సమస్యలు, వాతావరణ మార్పులు, నీటి సంరక్షణ, అటవీ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ, పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటు, హరితహారం, జీవవైవిధ్య పరిరక్షణ వంటి అంశాలపై సిద్ధాంతపరమైన, ఆచరణాత్మక శిక్షణ అందిస్తున్నారు.శిక్షణ అనంతరం ప్రతి కేజీబీవీలో 'యంగ్ ఎర్త్ లీడర్స్ క్లబ్' ఏర్పాటు చేసి విద్యార్థులతో మొక్కల పెంపకం, వర్షపు నీటి సంరక్షణ, పరిశుభ్రత, ప్లాస్టిక్ రహిత పాఠశాలల రూపకల్పన, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను నిర్వహించేలా ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 150 మంది కేజీబీవీ ఉపాధ్యాయురాలు పాల్గొంటున్నారు. వీరి ద్వారా 50 వేలకుపైగా విద్యార్థినుల్లో పర్యావరణ చైతన్యం పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ డా.ఉపేందర్ రెడ్డి, పర్యావరణ శాస్త్రవేత్త ఉమామహేశ్వర్ రెడ్డి, వై ఎల్ పి రాష్ట్ర కోఆర్డినేటర్ యానాల వెంకటరెడ్డి, సిజిఆర్ ఇంచార్జ్ రజినీకాంత్, ప్రోగ్రాం ఆఫీసర్ నవ్య, టెక్నికల్ అసిస్టెంట్ సాక్షి, మద్దిలేటి, హనుమంతు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## వెంకటాపురం డివిజన్ అభివృద్ధికి కృషి చేయండి

**అల్వాల్, ఆగస్టు 5 (నినాదం):**
అల్వాల్ సర్కిల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ని కానాజిగూడ భూదేవి నగర్ వెంకటాపురం డివిజన్లో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను ఒంటరి మహిళలవితంతువులకు వృద్ధులకు పెండింగ్ లో ఉన్న పెన్షన్లు తక్షణమే చేపట్టే విధంగా తగు చర్యలు తీసుకోవాలని అల్వాల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ భోగేశ్వరులను కోరిన బి ఆర్ ఎస్ మైనార్టీ నాయకులు సయ్యద్ మోసిన్.ఇతర నాయకులు పాల్గొన్నారు.

# పెబ్బేరులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన భారీ ధాన్య కుంభకోణం..!

- ధాన్యం కుంభకోణం దర్యాప్తులో ట్విస్ట్..!
- పాత లెక్కలు -- కొత్త నివేదికలపై సందేహాలు
- మిల్లర్ల మాయాజాలమా..? విజిలెన్స్ వైఫల్యమా..?
- పెబ్బేరు ధాన్య వ్యవహారంలో అసలు నిజాలేవి?



**పెబ్బేరు, ఆగస్టు 05 (నినాదం):**
వనపర్తి జిల్లాలోని పెబ్బేరు ప్రాంతాన్ని కుదిపేస్తున్న భారీ సీఎంఆర్ (కస్టమ్ మిల్డ్ రైస్) ధాన్య కుంభకోణం ఆలస్యంగా వెలు గులోకి రావడం తీవ్ర సంచలనానికి దారితీ సింది. ప్రభుత్వానికి అప్పగించాల్సిన ధాన్యా న్ని భారీ స్థాయిలో దారి మళ్లించి నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతుండగా, కోట్ల రూ పాయల విలువైన ధాన్యం లెక్కలు తేలకపో వడం, విజిలెన్స్ తనిఖీల్లో వెలుగు చూసిన కొత్త లెక్కలు ఇప్పుడు జిల్లా వ్యాప్తం గా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. గత ఏడాది అధికారులు నిర్వహించిన తనిఖీల్లో పెబ్బే రులోని మూడు రైస్ మిల్లుల్లో కలిపి సుమారు 3.6 లక్షల బస్తాల ధాన్యం కొరత ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. ప్రభు త్వ ధాన్యంతో పాటు ఇతర నిల్వలు కలిపి దాదాపు రూ.37 కోట్ల విలువైన ధా న్యం లెక్కలు తేలలేదని అప్పటి నివేదికల్లో నమోదైనట్లు తెలిసింది. ఇందులో ప్రభుత్వా నికి చెందిన ధాన్యం విలువ సుమారు రూ.6 కోట్లు కాగా, మిగిలిన ధాన్యం విలువ రూ.30 కోట్లకు పైగా ఉన్నట్లు పేర్కొన్నట్లు సమాచారం. అయితే తాజాగా విజిలెన్స్ డీఎస్పీ నేతృత్వంలోని బృందం అదే మిల్లులను మరోసారి తనిఖీ చేసి కేవలం లక్ష బస్తాల ధాన్యం మాత్రమే కొరత ఉన్నట్లు నివేదిక ఇవ్వడం కొత్త అను మానాలకు తావిచ్చింది. గతంలో 3.6 లక్షల బస్తాలు కనిపించకపోతే ఇప్పుడు అవి ఎలా తగ్గాయి?" అనే ప్రశ్నలు అన్ని వర్గాల్లో వినిపిస్తున్నాయి. రెండు అధికారిక లెక్కల మధ్య ఉన్న భారీ వ్యత్యాసం దర్యాప్తు పారదర్శకతపై సందేహాలు రేకెత్తిస్తోంది. మూడు మిల్లుల చుట్టూ తిరుగుతున్న వివాదం ఈ వ్యవహారంలో పెబ్బేరుకు చెందిన మూడు రైస్ మిల్లులు ప్రధానంగా వినిపిస్తున్నాయి. గతంలో ఈ మిల్లుల్లో నిల్వలు, ధాన్యం లెక్కల్లో భారీ తేడాలు ఉన్నట్లు అధికారులు గుర్తించగా, ప్రస్తుతం అదే వ్యవహారంలో కొత్త లెక్కలు బయటకు రావడం వివాదానికి కారణమైంది. విజిలెన్స్ రిపోర్టు పై అనుమానాలు: తాజా నివేదికపై ప్రజలు, రైతులు, వ్యాపార వర్గాల్లో అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గత ఏడాది లక్షల బస్తాల కొరత నమోదైతే ఇప్పుడు ఆ సంఖ్య భారీగా తగ్గడానికి కారణమేంటని ప్రశ్నిస్తున్నారు. ఈ ఆరోపణలకు సంబంధించి అధికారిక నిర్ధారణ లేకపోయినా, దర్యాప్తు ప్రక్రియపై పారదర్శకత అవస రమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. బకా యిల వసూళ్లపై అధికారుల ఉక్కుపాదం ప్రభుత్వానికి అప్పగించాల్సిన సీఎంఆర్ బియ్యం, ధాన్యం లెక్కల్లో తేడాలు గుర్తిం చిన అధికారులు సంబంధిత మిల్లర్లకు నోటీసులు జారీ చేశారు. క్వింటాలుకు రూ.లు 2,236. 81 చొప్పున 90 రోజుల లోపు బకాయిలు చెల్లించాలని స్పష్టం చేశారు. గడువులోగా చెల్లించకపోతే 25 శాతం పెనాల్టీతో పాటు 12 శాతం వడ్డీ విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని హెచ్చరించారు. విడతల వారీగా చెల్లింపులకు అవకాశం వనపర్తి జిల్లా సివిల్ సప్లయాస్ డీఎం ఆంజనేయులు స్పందిస్తూ, మిల్లర్లకు వెసులుబాటు కల్పించే ఉద్దేశంతో బకాయిలను విడతల వారీగా చెల్లించే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ నెల 10వ తేదీలోపు 50 శాతం, అనంతరం రెండు విడతల్లో మిగిలిన మొత్తాన్ని చెల్లించాలని సూచించి నట్లు చెప్పారు. ఇప్పటికే కొందరు మిల్లర్లు స్పందించినట్లు వెల్లడించారు.

## తల్లిపాలే బిడ్డకు అమృతం

- జగ్గసాగర్‌లో తల్లిపాల వారోత్సవాలు
- గర్భిణులు, బాలింతలకు అవగాహన



**మెట్‌పల్లి, ఆగస్టు 5 (నినాదం):**
జగిత్యాల జిల్లా, మెట్ పల్లి మండలం జగ్గసాగర్ గ్రామంలో ఐసీడీఎస్ వారి ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతతో పాటు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఏఎన్ఎం లావణ్య మాట్లాడుతూ.. పుట్టిన శిశువుకు తొలి గంటలోనే తల్లిపాలు పట్టించడం అత్యంత అవసరమని, తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే అందించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు సమతుల్య పోషకాహారం తీసుకుంటే తల్లి, బిడ్డ ఇద్దరి ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పుల్ల జగన్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి గుంటుక మమత, అంగన్‌వాడీ కార్యకర్తలు శారద, పద్మ, పూలమ్మ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## నాచేపల్లిలో వరి క్షేత్ర ప్రదర్శన



**పాలేరు ఆగస్టు 05( నినాదం):**
నేలకొండపల్లి మండలం లోని నాచేపల్లి గ్రామంలో కోరమాండల్ కంపెనీ ఆధ్వర్యంలో బుధవారం వరి క్షేత్ర ప్రదర్శన ను నిర్వహించారు. వరి పంటలో కలుపు మందు నివారణ పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కోరమాండల్ కంపెనీ ప్రతినిధి ఆశోక్ మాట్లాడారు...ఈ సీజనల్ లో వరి సాగు చేస్తున్న రైతులు కలుపు మందు కోసం డెసిమేట్ ను వాడాలని సూచించారు. ఈ మందు కేవలం 140 గ్రాముల మందు ఎకరానికి సరిపోతుందన్నారు. వరి నాటిన వారం రోజులలో ఫెర్టిలైజర్ లేదా ఇసుక తో కలిపి చల్లుకోవాలని సూచించారు. దీని వలన కలుపు నివారణ తో పంట దిగుబడి పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ జోనల్ మేనేజర్ హుస్సేన్ బాషా, టెరిటరీ మేనేజర్ రవీందర్, కంపెనీ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## రోడ్లన్నీ కుక్కల ఆధీనంలో.. ప్రజల భద్రత ప్రశ్నార్థకం



**పెబ్బేరు, ఆగస్టు 05 ( నినాదం):**
పెబ్బేరు పట్టణ కేంద్రంలోని కొల్లాపూర్ వెళ్లే ప్రధాన రహదారిపై సంచార కుక్కల బెడద రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. గుంపులుగా రోడ్లపై సంచరిస్తున్న కుక్కలు వాహనదారులు, పాదచారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో రోడ్డంతా ఆక్రమించి తిరుగుతుండటంతో ప్రమాదాలు జరిగే పరిస్థితి నెలకొంది. ప్రజల భద్రతను కాపాడాల్సిన పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో చిన్నారులు, వృద్ధులు, మహిళలు భయంతో రోడ్లపై నడవలేని పరిస్థితి ఏర్పడింది. ప్రమాదం జరిగాక స్పందించడం కాకుండా, వెంటనే సంచార కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రాణాల కంటే ప్రభుత్వానికి నిర్లక్ష్యమే ముఖ్యమా?" అంటూ పట్టణవాసులు ప్రశ్నిస్తున్నారు. సంచార కుక్కల సమస్యపై ప్రభుత్వం, మున్సిపల్ యంత్రాంగం తక్షణమే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

## తల్లి పాలతో శిశువులకు సంపూర్ణ ఆరోగ్యం

### – బండరావిపాకులలో తల్లి పాల వారోత్సవాలు



**రేవల్లి, ఆగస్టు 5 (నినాదం):**
రేవల్లి మండల పరిధిలోని బండరావిపాకుల గ్రామంలో తల్లి పాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిశువులకు తల్లి పాల ప్రాధాన్యత, తల్లి పాలతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై తల్లులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ధూపం రాజు, ఉపసర్పంచ్ సుకుమార్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, సూపర్వైజర్ నాగం సుజాత, అంగన్వాడీ టీచర్లు రజిత, కరుణ శ్రీతో పాటు తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

## చేర్యాలలో పోలీసుల అవగాహన ర్యాలీ

**చేర్యాల, ఆగస్టు 5 (నినాదం):**
చేర్యాల పట్టణ కేంద్రంలో జాతీయ రహదారిపై వివిధ కళాశాలల విద్యార్థులు అవగాహన ర్యాలీనిర్వహించారు అనంతరం వాసవి గార్డెన్ లో నిర్వహించిన కార్యక్రమంలో సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే మోసాల నుంచి రక్షణ పొందవచ్చని పోలీసులు సూచించారు సైబర్ మోసాల తీరు తేన్నులను వివరించారు ఓటిపి బ్యాంకు ఖాతాల వివరాలను వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దు అని సూచించారు ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు ర్యాలీలో సిఐ బానోత్ రమేష్ నాయక్ ,ఎస్ఐలు అపూర్వ రెడ్డి, మహేష్ ,ఆసిఫ్ పోలీస్ సిబ్బంది అధ్యాపకులు పాల్గొన్నారు.

# సైబర్ క్రైమ్ పై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలి

### ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు





**ఆమనగల్లు, ఆగస్టు 5(నినాదం):**
టెక్నాలజీ పెరిగిన ప్రస్తుత తరుణంలో సైబర్ నేరాలు కూడా పెరిగిపోయాయని దీని గురించి విద్యార్థులు తెలుసుకొని, సైబర్ నేరాలపై అందరికీ అవగాహన కల్పించాలని అమనగల్లు ఎస్ఎచ్ఓ వెంకటేశ్వర్లు విద్యార్థులకు సూచించారు. అమనగల్లు మున్సిపాలిటీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అమనగల్లు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ ప్రచార కార్యక్రమంలో భాగంగా సురక్షిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా విద్యార్థులకు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అందులో భాగంగా సైబర్ క్రైమ్ / ట్రాఫిక్ రూల్స్ / ర్యాగింగ్/ ఇవిటీజింగ్/ పోక్సో/ షీ టీమ్స్/ డ్రగ్స్ వలన కలుగు నష్టం లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్బంగా ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ .విద్యార్థులు , యువతి యువకులు సెల్ఫోన్స్, లాప్టాప్స్‌లలో ఇంటర్నెట్ ను విపరీతంగా వినియోగిస్తున్నారని, ఇలా వినియోగించే వారు ఎక్కువగా సైబర్ క్రైమ్ బారిన పడుతున్నారని, తప్పకుండా వీరందరికీ సైబర్ క్రైమ్ పై అవగాహన ఉండాలని సూచించారు. మీరు మీ మిత్రులకు, కుటుంబ సభ్యులకు, గ్రామ పెద్దలకు సైబర్ క్రైమ్ బారిన పడకుండా అవగాహన కల్పించాలని తెలియజేశారు. సైబర్ క్రైమ్ పై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని ముఖ్యంగా విద్యార్థినిలు , మహిళలు తమ వివరాలను గోప్యంగా ఉండేలా చూసుకోవాలన్నారు. లాటరీ వచ్చిందని, కూపన్స్ వచ్చాయని ఆన్లైన్లో మరేఇతర విధంగా అయినా సైబర్ నేరగాళ్లు ఎల్లవేళలా మోసం చేస్తూ ఉంటారని, ప్రస్తుతం సైబర్ క్రైమ్ నేరగాళ్లు అవలంబిస్తున్న పద్ధతులను విద్యార్థులు తెలుసుకోవాలని కోరారు. సైబర్ నేరగాళ్లు అవసరం లేనటువంటి లింకులు షేర్ చేస్తూ, కుటుంబ సభ్యుల ఫోటోలను పెట్టుకొని డబ్బులు అడుగుతూ,వాహనాలు తీసుకుంటామంటూ, కొనుగోలు చేస్తామంటూ ఎన్నో రకాల ఎటువంటి సైబర్ క్రైమ్ లు సైబర్ నేరగాళ్ల ద్వారా నిర్వహించబడతాయని వాటిని అదుపు చేయాలంటే ఒక పోలీసు వ్యవస్థ తోనే సాధ్యపడదని ప్రతి ఒక్కరూ ప్రజలందరూ సైబర్ క్రైమ్ పై అవగాహనను కలిగి ఉండాలని అవగాహనా కోసం రాష్ట్ర ప్రభుత్వం,పోలీస్ శాఖ ఇలాంటి అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలియజేశారు. ప్రజలు ఎవరైనా ఎటువంటి సైబర్ నేరానికి గురైన వెంటనే సైబర్ టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి,100 డయల్ కి సంప్రదించినట్లయితే వెంటనే మీరు పోగొట్టుకున్నవంటివి తిరిగి వచ్చే అవకాశం ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్ రెడ్డి, కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## గోరింటాకు వేడుకల్లో మనాలి ఠాకూర్ సందడి

- మహిళలకు గోరింటాకు పెట్టి శుభాకాంక్షలు తెలిపి..
- సంప్రదాయ వేడుకలు మహిళల ఐక్యతకు ప్రతీక అని వాఖ్య



**గోదావరిఖని,ఆగస్టు 5 (నినాదం):**
రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు, ఆయన సతీమణి, మక్కన్ సింగ్ సేవా సమితి చైర్‌పర్సన్ మనాలి ఠాకూర్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్వి ప్రకాష్ ఆధ్వర్యంలో 11వ డివిజన్ జ్యోతి నగర్‌లో మహిళలు నిర్వహించిన ఆషాడమాసం గోరింటాకు వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మనాలి ఠాకూర్ మహిళలకు స్వయంగా గోరింటాకు పెట్టి ఆషాడమాస శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మహిళలతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ వారి కుటుంబ క్షేమసమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆషాడమాసం వంటి సంప్రదాయ వేడుకలు మహిళల మధ్య ఐక్యతను పెంపొందించడమే కాకుండా భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు దోహదపడతాయని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు కందనూరి రామస్వామి, తాత రాజేశం, కేసారపు రాయపోషం, ఇనుగాల రాజయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు సంధ్య, స్వప్న, రంగు లక్ష్మి, ముత్తునూరి పద్మ, విజయతో పాటు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆగస్టు 10 వరకు ఓటరు దరఖాస్తుల పునఃసమర్పణకు అవకాశం : తల్లోజు ఆచారి



**ఆమనగల్లు, ఆగస్టు 05(నినాదం):**
ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి పిలుపునిచ్చారు. ఆగస్టు 10వ తేదీ వరకు ఎన్యూమరేషన్ దరఖా స్తులను తిరిగి సమర్పించుకునే అవ కాశం ఉన్నందున, ప్రతి అర్హుడైన ఓటరికి ఈ సమాచారం చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి బూత్ పరిధిలో అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పని చేసి అర్హులైన ఓటర్ల వివరాలు సక్రమంగా నమోదయ్యేలా చూడాలని ఆయన కోరారు.

## నల్గొండ రీజియన్ సమావేశానికి భారీగా తరలిన కార్మికులు

### -దేవరకొండ డిపో తెలంగాణ మజ్దూర్ యూనియన్ కార్మికులు



**చింతపల్లి, ఆగస్టు 4 (నినాదం):**
దేవరకొండ ఆర్టీసీ డిపోకు చెందిన తెలంగాణ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో నల్గొండలో నిర్వహించిన రీజియన్ స్థాయి యూనియన్ సమావేశానికి డిపో ఉద్యోగులు, కార్మికులు మంగళవారం పెద్ద సంఖ్యలో బయలుదేరి వెళ్లారు. దేవరకొండ డిపో తెలంగాణ మజ్దూర్ యూనియన్ అధ్యక్షులు ఎంజే ఖాన్ నాయకత్వంలో కార్మికులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంజే ఖాన్ మాట్లాడు తూ, కార్మికుల హక్కుల పరిరక్షణ, పెండింగ్ సమస్యల పరిష్కారం, ఉద్యోగుల సంక్షేమం, సంస్థ అభివృద్ధి వంటి అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. కార్మికుల సమస్యల సాధన కోసం తెలంగాణ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపక కార్యదర్శి ఇ. అశ్వద్ధామ రెడ్డి నాయకత్వంలో యూనియన్ నిరంతరం పోరాటం చేస్తోందని, ఉద్యోగులందరూ ఐక్యంగా ఉండి సంఘం బలోపేతానికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి దేవరకొండ డిపోకు చెందిన యూనియన్ ఉపాధ్యక్షుడు ఇద్దయ్య యాదవ్, కార్యదర్శి రాజేందర్ గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శి స్వామి నాయక్ తో పాటు యూనియన్‌కు చెందిన ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనేందుకు నల్గొండకు బయలుదేరి వెళ్లారు.

## ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయండి

- ప్రభుత్వ పథకం పొందాలంటే ఆధార్ తప్పనిసరి
- బస్సు ఎక్కాలన్న ఏదైన ఐడి కావాల్సిందే
- ఆమనగల్లు కేంద్రంలో ఆధార్ సెంటర్ లేక జనం అవస్థలు
- మార్పులు చేర్పుల కోసం దూర ప్రాంతం వెళ్ళాల్సి వస్తుంది



**ఆమనగల్లు, ఆగస్టు 05 (నినాదం):-**
ప్రభుత్వ పథ కాలు పొందాలన్నా,ఇతర గు ర్తింపు పత్రాలు తీసుకోవా లన్న, విద్యార్థులపై చదువు లకు వెళ్లాలన్న, ప్రస్తుతం మ హిళలు ఆర్టీసీ బస్సు ఎక్కాల న్న ఆధార్ తప్పనిసరి అయిం ది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపె ట్టిన గ్యారంటీ అమలు దరఖా స్తుల స్వీకరణకు సైతం ఆధార్ కార్డు తప్పనిసరి చేసింది. ఇంతటి ప్రాధాన్యతను సంతరిం చుకున్న ఆధార్ కార్డులో మార్పులు చేర్పులు చేసుకోవడానికి, కొత్తగా పొందడానికి, ఉన్నవారు ఫోన్ నెంబర్ లింక్ చేసుకోవడానికి ఆధార్ సెంటర్ లేక రంగారెడ్డి జిల్లాలోని ఆమనగల్లు, కడ్తాల్,తలకొండపల్లి, మాడుగుల మండల ప్రజలు తీవ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆధార్ కోసము వేరే జిల్లాలకు వెళ్లాల్సి వస్తుంది.

**– 6 గ్యారంటీలకు ఆధార్ లింకు**

– 4 మండలాలకు కూడలి అయిన ఆమనగల్లు పట్టణ కేంద్రంలో ఆధార్ సెంటర్ లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వము తలపెట్టిన 6 గ్యారెంటీ పథకాలకు అర్హత సాధించేందుకు ఆధార్ తప్పనిసరి కావడంతో కొత్తగా నమోదు అప్డేషన్ కోసం దూర ప్రాంతాలకు ప్రయాణించాల్సి వస్తుంది. వివాహం కావడము, ఇంటి పేరు,కేరాఫ్ చిరునామా, ఉద్యోగ ఉపాధి రిత్యా, నివాసము,మొబైల్ నెంబర్ మారడంతో అప్డేషన్ ఆవశ్యకత ఏర్పడింది. కాంగ్రెస్ గ్యారంటీ అమలు దరఖాస్తుల్లో ఆధార్ తప్పనిసరి చేయడంతో ప్రజలు ఆధార్ అప్డేట్ కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**-బస్సు ఎక్కాలన్న ఎదైన ఐడి కావాల్సిందే :**

మహాలక్ష్మి పథకంతో మహిళలు ఆర్టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం పొందాలంటే ఆధార్ అప్డేట్ లేకపోతె టికెట్ ఇస్తున్నారు. ఉచిత ప్రయాణానికి గుర్తింపు కార్డులో ఫోటోలు స్పష్టంగా ఉండాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు. కానీ చాలామంది ఆధార్ కార్డులో చిన్నతనం నాటి ఫోటోలు ఉన్నాయి. వాటిని అప్డేట్ చేసుకోవడానికి నాలుగు మండలాల్లో ఆధార్ సెంటర్ లేకపోవడంతో ప్రభుత్వ పథకాలను మహిళలు కోల్పోతున్నామని అసంతృప్తితో ఉన్నారు.వెంటనే ఆమనగల్లు పట్టణ కేంద్రంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు

### -ఎస్సై వెంకటేశ్వర్లు



**ఆమనగల్లు, ఆగస్టు 05(నినాదం):**
ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని ఆమనగల్లు పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ రోడ్డులో విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 25 మంది వాహనదారులపై ఈ-చలాన్లు విధించారు. అలాగే 12 పెండింగ్ ఈ-చలాన్లను పరిష్కరించి రూ.3,200 జరిమానా మొత్తాన్ని వసూలు చేశారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించడం యొక్క ప్రాముఖ్యత, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించడం, సురక్షితంగా వాహనాలు నడపడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు..ఈ సందర్భంగా ఎస్ఎచ్ఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని స్పష్టం చేశారు. ఒకవేళ ఇస్తే జరిగే పరిణామాలకు తల్లిదండ్రులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రజలందరూ ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించి సురక్షితంగా ప్రయాణించాలని సూచించారు. ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణించడం, హెల్మెట్ ధరించకపోవడం వల్ల తీవ్ర ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.ఈ తనిఖీల్లో ఎస్ఐ సంతోష్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎవరేం చేస్తారు... నా ఇష్టం ఉన్నచోట రోడ్డు వేస్తా...!

- -జీవోలో ఓ చోటు రోడ్డు వేసింది మరో చోటు
- -10 లక్షల నిధులు దుర్వినియోగం





**మహదేవపూర్ ఆగస్టు 5, (నినాదం):**
నన్ను ఎవరేం చేస్తారు నా ఇష్టం వచ్చిన చోట రోడ్డు వేస్తాను అంటూ ఓ కాంట్రాక్టర్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమేల మండలంలోని సర్వాయి పేటలో 10 లక్షల రూపాయల పంచాయతీరాజ్ నిధులను దుర్వినియోగం చేశారు. గ్రామస్తులు వద్దన్న వినకుండా గ్రామంలో ఇంటర్నల్ రోడ్డు వేయాల్సిన కాంట్రాక్టర్ పంచాయితీ రాజ్ లో నాడు ఏఈ నేడు డిఈగా పని చేస్తున్న అధికారితో కలిసి రోడ్డును జీవో ప్రకారం వేయకుండా మరోచోటు వేసి నిధులను దుర్వినియోగం చేశాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే సర్వైపేట గ్రామంలోని పాత సిసి రోడ్డును ఆనుకొని పాఠశాల వెనకవైపునకు రోడ్డు వెయ్యాలని అధికారులు జీవో తీసి నిధులు మంజూరు చేయించారు. కానీ కాంట్రాక్టర్ నాటి పంచాయతీరాజ్ ఏఈ తో కుమ్మక్కై పాఠశాలలో విద్యార్థులకు గ్రౌండ్ లేకుండా పాఠశాల లో ఆ నిధులతో రోడ్డు వేసి చేతులు దులుపుకున్నాడని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండల ఎంఈఓ, పాఠశాల ఉపాధ్యాయులు , గ్రామస్తులు వద్దన్న వినకుండా పాఠశాలలో విద్యార్థులకు గ్రౌండ్ లేకుండా చేసి తాను పనిచేసినట్లు రికార్డులు చేయించుకున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ రాజ్ అధికారి అండగా ఉండగా తనను ఎవరు ఏం చేయలేరని ఆ కాంట్రాక్టర్ దురుసుగా ప్రవర్తించి నిధులను దుర్వినియోగం చేశాడని అతనిపై, అతనికి సహకరించిన అధికారిపై కఠిన చర్యలు తీసుకొని తిరిగి గ్రామంలో ప్రజల సౌకర్యార్థం సిసి రోడ్డును వేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

## రంగాపురం పుష్కర ఘాట్ వరద జలాలతో మళ్లీ జలకళ సంతరించుకున్న కృష్ణమ్మ

నాడు అలా



**పెబ్బేరు, ఆగస్టు 5 (నినాదం):**
ఒకప్పుడు నిత్యం జలకళతో కళకళలాడిన కృష్ణానది కొద్ది రోజుల క్రితం వరకు ఎండల తీవ్రతతో వట్టిపోయి ఎడారిని తలపించేలా కనిపించింది. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం రంగాపురం గ్రామంలోని పుష్కర ఘాట్ ప్రాంతంలో మొన్నటి వరకు నీటి జాడ లేక ఇసుక మేటలు మాత్రమే దర్శనమిచ్చాయి. దీంతో స్థానికులు, భక్తులు తీవ్ర నిరాశకు గురయ్యారు. అయితే ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు, జూరాల ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదల చేస్తున్న వరద జలాలతో రంగాపురం పుష్కర ఘాట్ వద్ద కృష్ణానది మళ్లీ జలకళను సంతరించుకుంది. పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తున్నాయి. మొన్నటి వరకు ఎండిపోయిన నదీ పరివాహక ప్రాంతం ఇప్పుడు వరద జలాలతో నిండిపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. చాలా రోజుల తర్వాత కృష్ణానదిలో నీటి ప్రవాహం కనిపించడంతో రైతులు, మత్స్యకారులు, స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కృష్ణమ్మ మళ్లీ తన సహజ రూపంలో దర్శనమివ్వడం శుభపరిణామమని, ఇలాగే నీటి ప్రవాహం కొనసాగాలని వారు ఆకాంక్షిస్తున్నారు.

నేడు ఇలా




## 15 నాటికి ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరాలి

-భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీజేపీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి



**లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 5 (నినాదం):**
ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించే 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేలా ప్రజలను చైతన్యపరచాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీజేపీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం లక్ష్మీదేవిపల్లిలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ విజయ్ చందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి ఇల్లు, వ్యాపార సంస్థ, కార్యాలయంపై గౌరవప్రదంగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని సూచించారు. యువమోర్చా ఆధ్వర్యంలో తిరంగా యాత్రలు, బూత్ స్థాయిలో జెండాల పంపిణీ, అవగాహన కార్యక్రమాలు, వందేమాతరం గానం, అమరవీరులకు నివాళులు, సేవారంగంలో విశిష్ట సేవలందించిన వారికి సన్మానాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి నాయకులు, మోర్చా పదాధికారులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి: సీఐ కట్టా నరేందర్ రెడ్డి



**చేవెళ్ళ ఆగస్త్తే, 5( నినాదం):-**
చేవెళ్ళ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ కట్టా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... అపరిచిత లింకులు, ఓటీపీ, యూపీఐ పిన్, బ్యాంకు వివరాలు పంచుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. సి. కాంచనలత, వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. రమేష్ బాబు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ విజయవంతంగా పూర్తి : తహసీల్దార్ విజయలక్ష్మి



**చింతపల్లి, ఆగస్టు 5 (నినాదం):**
మండలంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని మండల స హాయ ఎన్నికల నమోదు అధి కారి, తహశీల్దార్ పండాల విజ యలక్ష్మి తెలిపారు. కార్యక్ర మంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారముల డిజిటలైజేషన్ ప్రక్రియలో గణనీయ మైన పురోగతి నమోదైంద న్నారు.మండలంలో మొత్తం 56 పోలింగ్ స్టేషన్లు ఉండగా, 45,727 మంది ఓటర్లు ఉన్నారని ఆమె తెలిపారు.వీరిలో 40,598 ఎన్యుమరేషన్ ఫారముల డిజిటలైజేషన్ పూర్తి కావడంతో 88.78 శాతం పురోగతి సాధించినట్లు ఆమె వెల్లడించారు. నేటి వరకు 5,129 అన్‌కలెక్టబుల్ ఎన్యుమరేషన్ ఫారములు గుర్తించినట్లు తెలిపారు. వాటిలో మరణించిన వారు 1,086 మంది, ఇతర ప్రాంతాలకు మారిన వారు (షిఫ్టెడ్) 1,231 మంది, ఇప్పటికే ఇతర చోట్ల ఓటరుగా నమోదు అయిన వారు 2,790 మంది, గృహంలో అందుబాటులో లేని వారు 22 మంది ఉన్నట్లు ఆమె వివరించారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎస్ ఐ ఆర్. కార్యక్రమంపై బుధవారం ఆమె అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎన్యుమరేషన్ ఫారములను 100 శాతం డిజిటలైజేషన్ చేయాల్సిన అవ సరం, అన్‌కలెక్టబుల్ ఎన్యుమరేషన్ ఫారాల వివరాలు, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పురోగతి తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. అదేవిధంగా, పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ , కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు వంటి అంశాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించి, వారి సూచనలు, అభిప్రాయాలను స్వీకరించారు.

# వ్యవసాయ పంట కుంటలతో రైతులకు బహుళ ప్రయోజనాలు

## -కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్





**కామారెడ్డి ప్రతినిధి, ఆగస్టు5(నినాదం):**
కామారెడ్డి జిల్లా గాంధారి మండలం పోతాయిపల్లి ఖుర్దు గ్రామంలో తెలంగాణ జలసిరి కార్యక్రమంలో భాగంగా నిర్మించిన వ్యవసాయ పంట కుంటను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా పంట కుంట ద్వారా బహుళ ప్రయోజనాలు పొందుతున్న రైతు ప్రతాప్ రెడ్డిని అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ పంట కుంటల నిర్మాణం ద్వారా వర్షపు నీటిని సంరక్షించడంతో పాటు ఎండాకాలంలో సాగునీటిగా వినియోగించుకోవచ్చని తెలిపారు. పంట కుంటల ద్వారా చేపల పెంపకం చేపట్టి అదనపు ఆదాయాన్ని పొందవచ్చని, భూగర్భ జలాల మట్టం పెరగడంతో పరిసర ప్రాంతాల్లోని బోర్లు, బావుల్లో నీటి లభ్యత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. నీటి సంరక్షణ, మత్స్య సంపద, భూగర్భ జలాల పెంపు వంటి అనేక ప్రయోజనాలతో రైతుల ఆదాయం పెరిగి సుస్థిర వ్యవసాయం సాధ్యమవుతుందని వివరించారు. జిల్లాలోని రైతులందరూ తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని వినియోగించుకొని తమ వ్యవసాయ భూముల్లో పంట కుంటలను నిర్మించుకుని బహుళ ప్రయోజనాలు పొందాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ ప్రభాకర్. డి ఆర్ డి ఏ దామోదర్ రెడ్డి. ఎంపీడీవో అధికారులు పాల్గొన్నారు.

## వ్యవసాయానికి ప్రోత్సాహం

### రైతులకు విద్యుత్ మోటార్లు పంపిణీ



**గుండాల, ఆగస్టు 5 (నినాదం):**
జలగం వెంగళరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, జలగం ప్రసాద్‌రావు సారథ్యంలో గుండాల మండల రైతులకు సబ్సిడీపై అందజేసిన 16 విద్యుత్ మోటార్లను గుండాల సర్పంచ్ కోరం సీతారాములు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోరం సీతారాములు మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలోని రైతులకు జలగం వెంగళరావు మెమోరియల్ ట్రస్ట్ ద్వారా విద్యుత్ మోటార్లు అందించడం అభినందనీయమని అన్నారు. రైతులు ఈ మోటార్లను సద్వినియోగం చేసుకుని వ్యవసాయాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. గోవింద నరసింహారావు మాట్లాడుతూ, మారుమూల ప్రాంతమైన గుండాల మండలంలో విద్యుత్ లైన్ల ఏర్పాటుతో పాటు సబ్సిడీపై విద్యుత్ మోటార్లను అందించడం జలగం ప్రసాద్‌రావు చేస్తున్న సేవలకు నిదర్శనమని కొనియాడారు. రైతులు ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు ఈసం కృష్ణ, బొబ్బిలి సమ్మయ్య, గడ్డం సమ్మయ్య, గడ్డం కృష్ణ, గుర్రం రాములు, నిట్ట వెంకన్న, ఎస్.డి కుద్దూస్, ఈసం సమ్మయ్య, తవిడిశెట్టి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఐతపాక మహేష్ కుటుంబాన్ని పరామర్శించిన రాష్ట్ర నాయకుడు బిల్యా నాయక్



**చింతపల్లి, ఆగస్టు 5(నినాదం):**
మండలకేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ కార్యకర్త ఐతపాక మహేష్ అనారోగ్య సమస్యలతో కొంతకాలంగా బాధపడుతూ బుధవారం సాయంత్రం 4 గంటలకు తుదిశ్వాస విడిచారు. టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతం, అభివృద్ధి కోసం ఆయన విశేషంగా కృషి చేశారని నాయకులు గుర్తుచేశారు.మహేష్ మృతి వార్త తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బిల్యా నాయక్ ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మహేష్ భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.మృతుడి కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చిన బిల్యా నాయక్, తక్షణ సాయంగా రూ.15,000 ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్తులో కూడా కుటుంబానికి అండగా ఉంటానని ధైర్యం చెప్పి ఓదార్చారు. ఆయన వెంట నాయకులు,కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

## అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**కామారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 5 (నినాదం):**
జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో నీటి కలుషితం, చెత్త పేరుకుపోవడం, నిల్వ నీరు ఏర్పడటం, దోమల వ్యాప్తి వంటి కారణాలతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ విజ్ఞప్తి చేశారు.ప్రజలు తమ కుటుంబ సభ్యుల ఆరోగ్య రక్షణతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా ఈ క్రింది జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. తాగునీటిని తప్పనిసరిగా మరిగించి లేదా శుద్ధి చేసిన తర్వాత మాత్రమే తాగాలి. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, చెత్తను నిర్ణీత ప్రదేశాల్లోనే వేయాలి.కాలువలు, డ్రైనేజీలు మూసుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలి. నిల్వ నీరు లేకుండా చూసుకొని దోమల నివారణ చర్యలు చేపట్టాలి. తాజాగా వండిన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి. బహిరంగ ప్రదేశాల్లో విక్రయించే ఆహారాన్ని వీలైనంత వరకు నివారించాలి. సబ్బుతో తరచూ చేతులు కడుక్కోవడం అలవాటు చేసుకోవాలి.తడి దుస్తులను వెంటనే మార్చుకొని శరీరాన్ని పొడిగా ఉంచుకోవాలి. జ్వరం, విరేచనాలు, వాంతులు లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రి లేదా వైద్యుడిని సంప్రదించాలి. పాఠశాలలు, కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, గృహాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు పరిశుభ్రత కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని, ప్రజలు కూడా వాటిలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కోరారు. "పరిశుభ్రమైన పరిసరాలే ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను కాపాడితే అంటువ్యాధులను సమర్థవంతంగా నివారించవచ్చు. మీ ఆరోగ్యం -- మీ కుటుంబ ఆరోగ్యం -- మన జిల్లా ఆరోగ్యం. అందరం కలిసి పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన కామారెడ్డి జిల్లాను నిర్మిద్దాం." అని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఓటరు ఫారాలను బీఎల్ఓలకు అందజేయాలి: తహసీల్దార్ వెంకన్న



**మోతె, ఆగస్టు 5( నినాదం):**
ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) గడువు ముగుస్తున్న నేపథ్యంలో ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారాలను త్వరగా బీఎల్ఓలకు అందజేయాలని తహసీల్దార్ ఎం. వెంకన్న కోరారు. బుధవారం రాయినిగూడెం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి అర్హుడు ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ కరుణాకర్ రెడ్డి, జీపీఓ మల్లయ్య, బీఎల్ఓలు పాల్గొన్నారు.

## లైంగిక వేధింపుల కేసుపై అధిష్ఠానం వెంటనే చర్యలు తీసుకోవాలి

### -రేగా కాంతారావును బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయాలి



**అశ్వాపురం, ఆగస్టు 5 (నినాదం):**
పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై నమోదైన లైంగిక వేధింపుల కేసు నేపథ్యంలో ఆయనను వెంటనే బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. బుధవారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నాయకులు మాట్లాడారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్‌బాబు మాట్లాడుతూ, మహిళల పట్ల బీఆర్ఎస్ అధిష్ఠానానికి నిజంగా గౌరవం ఉంటే రేగా కాంతారావుపై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొందరు బీఆర్ఎస్ నాయకులు ఆయనను నీతిమంతుడిగా చిత్రీకరిస్తున్నారని, అలాంటప్పుడు ఆయన అజ్ఞాతంలో ఉండాల్సిన అవసరం ఏమిటో ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. ఆయన నిర్దోషా, దోషా అనే విషయం చట్టపరమైన విచారణతో పాటు ప్రజా కోర్టులోనూ తేలుతుందని వ్యాఖ్యానించారు. మహిళలను అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదని, రాజకీయ కక్ష సాధించాలనుకుంటే ఇతర అంశాలపై కూడా పోరాడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఒక మహిళ తనను పెళ్లి పేరుతో మోసం చేశారని ఆరోపిస్తున్న నేపథ్యంలో, ఈ వ్యవహారం పినపాక నియోజకవర్గ ప్రజలను, ముఖ్యంగా మహిళలను తీవ్ర ఆవేదనకు గురి చేసిందన్నారు. గతంలో ఇలాంటి ఆరోపణలు ఎదుర్కొన్న నాయకులపై చర్యలు తీసుకున్నట్లే, రేగా కాంతారావుపైనా బీఆర్ఎస్ అధిష్ఠానం క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే మండల వ్యాప్తంగా మహిళలతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అలాగే ఈ కేసుపై పోలీసులు త్వరితగతిన విచారణ చేపట్టి బాధిత మహిళకు న్యాయం చేయాలని ఉన్నతాధికారులను కోరారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్‌బాబుతో పాటు సీనియర్ నాయకులు గాదే కేశవరెడ్డి, ఊసా అనిల్‌కుమార్, బూరెడ్డి వెంకటరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వేములపల్లి రమేష్, కుంజా జాను, కోర్సా కృష్ణ, కొండలరావు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ రైతులకు కీలక సూచనలు

**రామగుండం, ఆగస్టు 05 (నినాదం):**
రామగుండం, మంథని డివిజన్ల పరిధిలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని ఉద్యాన శాఖ సూచించింది. ఈ ఏడాది వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు, ప్రస్తుతం ఎల్‌నినో (జుశ్రీ చీఅశీ) ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవడం వల్ల పరాగసంపర్క వీవిల్స్ ఉత్పత్తి తగ్గిందని తెలిపింది. దీని కారణంగా ప్రస్తుతం ప్రారంభ దశలో ఏర్పడుతున్న ఫ్రెష్ ఫ్రూట్ బంచెస్ సరైన పరాగసంపర్కం జరగక అభివృద్ధి మందగిస్తున్నట్లు ఉద్యాన శాఖ వివరించింది.

## పెన్షన్ల చెల్లింపులు, జలసిరి అమలును

# పరిశీలించిన అదనపు కలెక్టర్ భాస్కర్ రావు







**మోటకొండూరు, ఆగస్టు 05(నినాదం) :**
మోటకొండూరు మండలలో ప్రభుత్వము అమలు చేస్తున్న పెన్షన్ల చెల్లింపులు జలసిరి కార్యక్రమాన్ని అమలు చేస్తున్న తీరుపై బుధవారం అదనపు కలెక్టర్ భాస్కర్ రావు క్షేత్రస్థాయిలో పర్యటించి అమలు చేస్తున్న పనులపై పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్... మోటకొండూరు గ్రామ పంచాయతీ కార్యాల యాన్ని సందర్శించి పెన్షన్ల పంపిణీకి సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకు న్నారు. ప్రస్తుతం లబ్ధిదారులకు అందుతున్న రూ. 2,0 16 పెన్షన్ మొత్తంలో అదనంగా రూ. 16 చెల్లింపులు జరుగుతున్నాయా లేదా అనే విషయాన్ని నేరుగా లబ్ధిదారులను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకు న్నారు. రానున్న రెండు, మూడు నెలల్లో పెన్షన్ల చెల్లింపులను బ్యాంకుల ద్వారా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన 'జలసిరి' కార్యక్రమం అమలు తీరుపై వివరాలు ఎంపిడిఓ ను అడిగి తెలుసుకున్నారు. జలసిరి కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్స్ ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలను అదనపు కలెక్టర్ పరిశీలించారు. తదుపరి మోటకొండూరు గ్రామంలోని మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే హాస్టల్‌ను అదనపు కలెక్టర్ సందర్శించారు. హాస్టల్ వంటశాలను, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. సిబ్బంది యొక్క హాజరు రిజిస్టర్ ను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నారా లేదా అనే విషయాన్ని ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి హాస్టల్‌లో అందుతున్న వసతులు, భోజనం, ఇతర మౌలిక సదుపాయాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన వసతులు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఎంపీడీఓ ఇందిరా, సంబంధిత అధికా రులు పాల్గొన్నారు.

నినాదం

తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

## ఓవర్‌మ్యాన్ ప్రమోషన్ దీక్షకు టిబీజీకేఎస్ మద్దతు



**లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 5 (నినాదం):**
సింగరేణిలో పెండింగ్‌లో ఉన్న బ్యాక్‌డేటెడ్ ఓవర్‌మ్యాన్ ప్రమోషన్లను వెంటనే అమలు చేయాలని కోరుతూ బాధిత ఉద్యోగులు చేపట్టిన మూడు రోజుల నిరాహార దీక్షకు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టిబీజీకేఎస్) మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా టిబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ మాట్లాడుతూ, పలుమార్లు యాజమాన్యం దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పరిష్కారం లభించకపోవడంతో ఉద్యోగులు దీక్షకు దిగాల్సి వచ్చిందన్నారు. ప్రమోషన్ల సమస్యను యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీక్షలో టిబీజీకేఎస్ నాయకులు గడప రాజయ్య, తుమ్మ శ్రీనివాసరావు, జాఫర్, అన్వేష్ రెడ్డి, మహేందర్‌తో పాటు వివిధ ఏరియాలకు చెందిన మైనింగ్ స్టాఫ్ నాయకులు, కార్మికులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

## తల్లిపాలు అమృతంతో సమానం



**బోధన్ ప్రతినిధి, ఆగస్టు 5:(నినాదం):**
తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని బోధన్ సిడిపిఓ నందిని అన్నారు. బోధన్ మండలంలోని ఉట్పల్లి అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ గర్భిణులు, తల్లులకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. తల్లిపాలు శిశువు శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతో దోహదపడతాయని, తల్లికి కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు. అనంతరం గర్భిణులకు సామూహిక శ్రీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రశాంతి తిరుమలేష్, ఐసిడిఎస్ సూపర్వైజర్ గోపి లక్ష్మి, ఏఎన్ఎం పద్మ, అంగన్వాడి టీచర్లు గిరిజ, ఆస్మా, కమల, లక్ష్మి,వార్డ్ మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



**వలిగొండ, ఆగస్టు 05 (నినాదం):**
మండల పరిధిలోని టేకులసోమరం అంగన్వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పనుమటి మమత నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ శిశువు జన్మించిన గంటలోపే తల్లిపాలు పట్టించడం అత్యంత అవసరమని సూచించారు. తల్లిపాలలో శిశువు ఆరోగ్యానికి అవసరమైన పోషకాలు, రోగనిరోధక శక్తిని పెంచే గుణాలు సమృద్ధిగా ఉంటాయని, అవి శిశువు ఎదుగుదలకు ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. ప్రతి తల్లి తొలి ఆరు నెలలు తప్పనిసరిగా బిడ్డకు తల్లిపాలే అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అశోక్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి స్వరూప, పాఠశాలల ప్రధానోపాధ్యాయురాలు కనకదుర్గ, కళ్యాణి, ఐసీడీఎస్ సూపర్వైజర్ బాలమణి, అంగన్వాడీ టీచర్ కే.దుర్గ, ఆయా చేగూరి సుగుణమ్మ, తల్లులు, బాలింతలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

## దమ్మపేట కోర్టు సంచలన తీర్పు

### - రెండు కేసుల్లో నిందితులకు జైలు శిక్ష

**దమ్మపేట, ఆగస్టు 5(నినాదం):**
మండల కేంద్రంలోని ఫస్ట్‌క్లాస్ జుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి బి. భవాని బుధవారం రెండు వేర్వేరు కేసుల్లో నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ సంచలన తీర్పు వెలువరించారు. పోలీసుల కథనం ప్రకారం.. దమ్మపేట పోలీస్ స్టేషన్ పరిధిలో 2016లో జరిగిన దాడి, బెదిరింపుల కేసులో (క్రైమ్ నెం. 138/2016) నిందితుడు మిడియం సత్యనారాయణతో పాటు మరొకరిపై నేరం రుజువైంది. దీంతో న్యాయమూర్తి వారికి ఏడాది సాధారణ జైలు శిక్షతో పాటు చెరో రూ. 1,000 జరిమానా విధించారు. అదేవిధంగా, 2017లో జరిగిన ఓ రోడ్డు ప్రమాదం కేసులో (క్రైమ్ నెం. 34/2017) నిందితుడు బాలాజీపై నేరం రుజువు కావడంతో అతనికి రెండేళ్ల జైలు శిక్ష, రూ. 5,000 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. న్యాయస్థానంలో నేరాలను నిరూపించి, బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేసిన అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. శ్రీనివాస్, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ జె. ప్రవీణ్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ వి. రాంబాబులను ఈ సందర్భంగా ఉన్నతాధికారులు, స్థానికులు ప్రత్యేకంగా అభినందించారు.

## జడ్పీహెచ్ఎస్‌లో సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై అవగాహన



**కోదాడ రూరల్, ఆగస్టు 5 (నినాదం):**
కోదాడ మండలం కొమరబండ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు సైబర్ నేరాలు, మహిళా భద్రత, మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కోదాడ రూరల్ ఇన్‌చార్జి సీఐ డి. రామకృష్ణారెడ్డి, ఎస్సై ఎస్కే యాకూబ్, షీ టీం ఎస్సై మల్లేశం విద్యార్థులకు మొబైల్ ఓటీపీ మోసాలు, బాలికల రక్షణ, డ్రగ్స్ దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవిందు, సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# చెంచు కుటుంబాలతో చైర్మన్ జస్టిస్ షమీమ్‌అత్తర్ ముఖాముఖి

- విద్య, వైద్యం, సంక్షేమం, జీవనోపాధి, మౌలిక వసతులు సమస్యలను నేరుగా తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్



**నాగర్‌కర్నూల్, ఆగస్టు 5(నినాదం):**
నాగర్ కర్నూల్ అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని జిల్లా నల్లమల్ల అటవీ ప్రాంతంలో నివసిస్తున్న చెంచు గిరిజనుల జీవన ప్రమాణాలు, విద్య, వైద్య సేవలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలు, ఉపాధి అవకా శాలు, మౌలిక సదుపాయాలపై తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ బుధవారం క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించారు. నాగర్‌కర్నూల్ జిల్లా పర్యటనలో భాగంగా అచ్చంపేట నియోజకవర్గంలోని నల్లమల్ల ప్రాంతాన్ని సందర్శించిన ఆయన చెంచు గిరిజనుల వాస్తవ జీవన పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలిస్తూ, ప్రభుత్వ శాఖల పనితీరుపై అధికారులతో సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. అడవిలోని మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న చెంచు కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు ఎంతవ రకు చేరుతున్నాయో స్వయంగా తెలుసుకునేందుకు ఆయన వివిధ గ్రామాలను సందర్శించారు.

**బ్రహ్మగిరి కృష్ణవేణి గెస్ట్ హౌస్‌లో అధికారులతో సమీక్ష**

ఉదయం బ్రహ్మగిరి,విష్ణుగిరిలోని కృష్ణవేణి గెస్ట్ హౌస్‌లో గిరిజన సంక్షేమ, విద్య, వైద్య ఆరోగ్య, అటవీ, ఐటీడీఏ, పంచాయతీరాజ్, పోలీస్ తదితర శాఖల అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నల్లమల్ల ప్రాంతంలోని చెంచు గిరిజనుల సామాజిక, ఆర్థిక పరిస్థితులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, విద్యా స్థితిగతులు, వైద్య సేవలు, మౌలిక వసతులు, అటవీ ప్రాంత విస్తీర్ణం, రవాణా సమస్యలు, తాగునీటి సౌకర్యాలు, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై అధికారుల నుంచి సమగ్ర వివరాలు తెలుసుకున్నారు.
చెంచు గిరిజనుల జీవన విధానం, సంప్రదాయ జీవన నైపుణ్యాలు, ఉపాధి వనరులు, ఆదాయ మార్గాలు, ప్రభుత్వ ఆర్థిక సహాయ కార్యక్రమాలు, స్వయం ఉపాధి అవకాశాలపై అధికారులు చేపడుతున్న చర్యలను వివరించాలని ఆదేశించారు. సంక్షేమ పథకాలు ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా ప్రత్యేక కార్యాచరణ ఉండాలని సూచించారు.
ప్రభుత్వ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, గిరిజన సంక్షేమ వసతి గృహాల నిర్వహణపై జస్టిస్ షమీమ్ అక్తర్ ప్రత్యేకంగా సమీక్షించారు. విద్యార్థుల నమోదు, హాజరు శాతం, ఉపాధ్యాయుల నియామకాలు, విద్యా నాణ్యత, మధ్యాహ్న భోజనం, హాస్టళ్లలో అందిస్తున్న సౌకర్యాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యార్థుల భద్రత తదితర అంశాలపై అధికారులను ప్రశ్నించారు. విద్యార్థులు చదువును మధ్యలో మానివేయకుండా తీసుకుంటున్న చర్యలు, ఉన్నత విద్యలో చెంచు విద్యార్థుల ప్రాతినిధ్యం, ప్రభుత్వ ప్రోత్సాహక కార్యక్రమాలపై కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారు.
సమీక్ష అనంతరం బ్రహ్మగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన కమిషన్ చైర్మన్ తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యా పరిస్థితులను తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు నమోదు, బోధనా విధానం, పాఠశాల మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయుల సంఖ్యకు అనుగుణంగా విద్యార్థుల సంఖ్య ఎందుకు తక్కువగా ఉందని అధికారులను ప్రశ్నించారు. గిరిజన పిల్లలందరూ విద్యకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి విద్యార్థి పాఠశాలకు వచ్చేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. తదుపరి వట్టువర్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జస్టిస్ షమీమ్ అక్తర్ అక్కడి వైద్య సేవలను పరిశీలించారు. వైద్యుల హాజరు, సిబ్బంది అందుబాటు, మందుల నిల్వలు, అత్యవసర సేవలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న సేవలు, వ్యాధి నిరోధక కార్యక్రమాలు, అంబులెన్స్ సేవలు, అడవి ప్రాంతాల నుంచి రోగులను తరలించే విధానంపై అధికారులను ప్రశ్నించారు. ప్రత్యేకంగా నల్లమల్ల అటవీ ప్రాంతంలో నివసిస్తున్న చెంచు గిరిజనులకు వైద్య సేవలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందుతున్నాయా, సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకుం టున్న చర్యలేమిటి, దూర ప్రాంతాల్లో మొబైల్ వైద్య సేవలు అందుతున్నాయా అనే అంశాలపై వివరాలు తెలుసుకున్నారు.

## పీకే బ్లాక్ సింగరేణికి దక్కడం సీపీఐ, ఏఐటీయూసీ పోరాట ఫలితమే

### -ఎమ్మెల్యే కూనంనేని



**కొత్తగూడెం, ఆగస్టు 5(నినాదం):**
మణుగూరు పీకే బ్లాక్ సింగరేణికి దక్కడం హర్షణీయమని, ఇది సిపిఐ--ఏఐటీయూసీ చేపట్టిన పోరాటాల విజయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే అన్నారు. బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మణుగూరు పీకే ఓసీ డిప్ ప్రైవేటీకరణ కాకుండా సింగరేణికి దక్కడానికి సిపిఐ, ఏఐటీయూసీ చేసిన పోరాటాలే కారణమన్నారు. ముఖ్యమంత్రి వద్ద పలుమార్లు ప్రస్తావించడంతో ఈ నిర్ణయం సాధ్యమైందని, తాడిచెర్ల బొగ్గు బ్లాక్ కూడా సింగరేణికే దక్కిందని తెలిపారు. సింగరేణి భవిష్యత్ మనుగడ కోసం అవసరమైతే మరిన్ని ఐక్య ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు. పెనగడప, పెనుబల్లి, రాంపురం, అనిశెట్టిపల్లి, పునుగుడుచెలక, హేమచంద్రాపురం ప్రాంతాల్లో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా గనుల అభివృద్ధిపై దృష్టి సారిస్తామని చెప్పారు. కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటు కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నామని, పారిశ్రామిక జిల్లాకు ఎయిర్‌పోర్టు అవసరమని పేర్కొన్నారు. పోస్టాఫీస్ అనుసంధానంతో పాస్‌పోర్టు సేవా కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని, ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వస్తోందన్నారు. కొత్తగూడెం జిల్లా ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు పంపామని, రూ.10 కోట్లతో నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు అనుమతులు వచ్చాయని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. జిల్లాకు కేంద్రీయ విద్యాలయం కూడా త్వరలో మంజూరయ్యే అవకాశముందని చెప్పారు. కొత్తగూడెం బస్టాండ్ పునర్నిర్మాణంతో పాటు పాల్వంచ బస్టాండ్ ఆధునీకరణకు చర్యలు తీసుకుంటున్నామని, కొత్తగూడెం బైపాస్ రహదారికి రూ.500 కోట్ల నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు. బైపాస్ పూర్తయితే పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని అన్నారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, గ్రామాల నుంచి పట్టణాల వరకు సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, తాగునీటి వంటి మౌలిక వసతుల కల్పనకు నిధులు సమీకరిస్తున్నామని చెప్పారు. ప్రతి బుధవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను స్వీకరించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే. సాబీర్ పాషా, ఏఐటీయూసీ నాయకులు కొరిమిరాజ్ కుమార్, వంగా వెంకట్ రమణమూర్తి, జి. వీరస్వామి, రత్నకుమారి, సందెబోయిన శ్రీనివాసరావు, ప్రశాంత్, జలీల్ పాషా, కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, చంద్రగిరి శ్రీనివాసరావు, కొమారి హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



**బోధన్ ప్రతినిధి, ఆగస్టు 5 (నినాదం):**
గ్రామీణ ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సాలూరా గ్రామ సర్పంచ్ సొక్కశీ లావణ్య రవి అన్నారు. సాలూరా మండల కేంద్రంలో నిజామాబాద్ మనోరమ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించి స్వయంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు సుమారు 750 మంది ప్రజలకు వివిధ రకాల వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య శిబిరం పర్యవేక్షకులు గైని రమేష్, గ్రామ పెద్దలు, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి



**బోధన్ ప్రతినిధి, ఆగస్టు 5:(నినాదం ):**
సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని బోధన్ ఎసిపి శ్రీనివాస్ సూచించారు. బోధన్ పట్టణంలో ఉషోదయ డిగ్రీ కళాశాలలో బోధన్ పట్టణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల విద్యార్థులు, యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. తెలియని లింకులు, ఫోన్ కాల్స్, ఓటిపి, బ్యాంక్ ఖాతా వివరాలు వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఇవ్వవద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్, సమీప పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ వెంకటనారా యణ, ఎస్సై హబీబ్, ఉషోద య విద్యాసంస్థల చైర్మన్ సూర్య ప్రకాష్, సైబర్ వారియర్ వినీత్, అధ్యాప కులు, విద్యార్థులు పాల్గొ న్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలో తెలంగాణ ఉద్యమ కళాకారులకు న్యాయం జరగాలి

- రెడ్డిగూడెం గ్రామం నుంచి భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవాలయం వరకు పాదయాత్ర
- పాదయాత్రను ప్రారంభించిన కాంగ్రెస్ మండల నాయకులు



**తల్లాడ, ఆగస్టు 5(నినాదం):**
తల్లాడ మండలం రెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఉద్యమ కళాకారుడు కె వి కళ బృందం అధ్యక్షుడు కాంపెల్లి వంశీ తెలంగాణ ఉద్యమ కళాకారుల ను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించాలని, వారికి ప్రభుత్వం నుంచి ఒక గుర్తింపు ఇచ్చి వారికి అందే బెనిఫిట్స్ ను ఇవ్వాలని కోరుతూ తల్లాడ మండల పరిధిలోని రెడ్డి గూడెం గ్రామం నుంచి భద్రాచలం వరకు పాదయాత్ర సుమారుగా 101 కిలోమీటర్ల వరకు ఉద్యమ కళాకారులు పాద యాత్ర చేశారు. ముందుగా తల్లాడ మండల కాంగ్రెస్ మండల అధ్యక్షులు గొడుగునూరి లక్ష్మ రెడ్డి, పైడిపల్లి రవి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉద్యమ కళాకారులు కాంపెల్లి వంశీ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం ఉవ్వేత్తే సమయం లో అనేక గ్రామాల్లో తిరిగి గజ్జ కట్టి డప్పు వాయిద్యాలతో వేల పాటలు పడిన మాకు గత పదేళ్ళు అధికారం లో ఉన్న బి ఆర్ ఎస్ ప్రభుత్వం మా ఉద్యమ కళాకారులను గుర్తించలేదు అని ఆయన అన్నారు. కనీసం ఇప్పుడు ఉన్న ప్రజా ప్రభుత్వం మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐన ఉద్యమ కళాకారులను గుర్తించి వారికి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఆయన అన్నారు. కళాకారులు రెక్క ఆడితే కానీ డొక్కా ఆడని పరిస్థితి, పాటలు పడుతూ అనేక గ్రామాలు తిరిగి పగలు రాత్రి అనేది లేకుండా పోగ్రామ్స్ కి వెళ్తు కుటుంబాన్ని పోసించుకునే పరిస్థితి కాబట్టి తెలంగాణ ప్రభుత్వం ఆలోచించి ఉద్యమ కళాకారులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాడిన తరువాత బీ ఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నిజమైన ఉద్యమ కళ కారులకు అన్యాయం జరిగింది అని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఉద్యమ కళాకారులకు ఉద్యోగ భరోసా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తారని కోరారు. కళాకారుల సమస్యలను సత్తుపల్లి ఎమ్మెల్యే మట్ట రాగ మయి ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి తెలియజెసి త్వరతగతిన న్యాయం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గొడుగునూరి లక్ష్మరెడ్డి,మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దుండేటి వీర రెడ్డి, మండల నాయకులు పైడిపల్లి రవి, జక్కంపూడి కిషోర్, మర్సకట్ల బాబురావు, మాజీ సర్పంచ్ వేమిరెడ్డి క్రిష్ణ రెడ్డి,సర్పంచ్ మోదుగు తిరుమల రావు, మండల యూత్ కాంగ్రెస్ లీడర్ రేగళ్ల రామారావు పాల్గొన్నారు.

## మహిళల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

**బోధన్ ప్రతినిధి, ఆగస్టు 5(నినాదం):**
మహిళల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని బోధన్ మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మశరత్ రెడ్డి అన్నారు. బోధన్ పట్టణంలోని 6, 9, 14, 25,26 వార్డులలో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం అందించే చేయూతతో మహిళలు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోధన్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శరత్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు అంకుల్ దామోదర్, కౌన్సిలర్లు జహీర్,పౌల్, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యాన పంటలపై ఆధునిక సాగు మెళకువలు

**భీమదేవరపల్లి, ఆగస్టు 5 (నినాదం):**
వాతావరణ మార్పులకు అనుగుణంగా కూరగాయల సాగులో అనుసరించాల్సిన ఆధునిక సాంకేతికతలపై ముల్కనూరు కో-ఆపరేటివ్ సొసైటీకి చెందిన 50 మంది కూరగాయల రైతులకు శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఒకరోజు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చర్ సైన్స్, ముల్కనూరు కో-ఆపరేటివ్ రూరల్ క్రెడిట్ అండ్ మార్కెటింగ్ సొసైటీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాయి. ప్రొఫెసర్ డాక్టర్ సుచిత్ర ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని అసిస్టెంట్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ ప్రారంభించి, వాతావరణ



మార్పుల నేపథ్యంలో కూరగాయల సాగులో అనుసరించాల్సిన ఆధునిక



పద్ధతులు, నాణ్యమైన నారుమడి తయారీ, కోత అనంతర నిర్వహణ, పురుగులు-- తెగుళ్ల నివారణపై రైతులకు వివరించారు. వెజిటేబుల్ రీసెర్చ్ స్టేషన్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ ఎల్‌నినో ప్రభావం, వాతావరణ అనుకూల కూరగాయల సాగుపై అవగాహన కల్పించగా, పరిశోధకులు నిరోషా, లావణ్యలు నారుమడి తయారీ, కోత అనంతర నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. డాక్టర్ సురేష్ సమగ్ర పురుగు, వ్యాధి యాజమాన్య పద్ధతులను వివరించారు.
అనంతరం క్షీరసాగర్ గ్రామంలోని క్షేత్ర ప్రదర్శనను రైతులు సందర్శించి వాతావరణ అనుకూల సాగు పద్ధతులను ప్రత్యక్షంగా పరిశీలించారు. శాస్త్రవేత్తలతో సందేహాలను నివృత్తి చేసుకున్న రైతులు ఈ శిక్షణ తమకు ఎంతో ఉపయోగపడిందని పేర్కొంటూ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ వ్యవసాయ అధికారి సంగ శ్రీనివాస్, సహాయ వ్యవసాయ అధికారులు అర్జున్, ప్రశాంత్, వర్ధన్ పాల్గొన్నారు.